మహిళ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital


Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-2-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 365 పేజీలు: 10+4 వెల: 6.50



తిరుపతిలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య 2లో

రాహుల్, కేంద్రమంత్రి మధ్య మిత్ర ద్రోహి..దేశద్రోహి రగడ 5లో



## రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్' చికిత్స

### రూ.1.5 లక్షల సాయం

### 6 రాష్ట్రాలలో పైలట్ ప్రాజెక్టు అమలు

### ఎంపి మేడా రఘునాథ రెడ్డి ప్రశ్నకు రాజ్యసభలో తెలిపిన కేంద్రమంత్రి గడ్కరీ

**రాజంపేట,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** దేశంలో రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత గోల్డెన్ అవర్ చికిత్స పథకం ద్వారా 1.50 లక్ష వరకు నగదు రహిత చికిత్సలు అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల్లో బుధవారం వైసిపి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పథకాన్ని అమలు చేసేందుకు చండీగఢ్, అస్సాం, పంజాబ్, ఉత్తరాఖండ్, హర్యానా , కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో పల్లెలైటిగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ స్థాయిలో అమలు చేయడానికి ముందు అమలు సవాళ్లను అంచనా వేయడానికి పైలట్ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్టు తెలిపారు. పైన పేర్కొన్న రాష్ట్రాలలో అమలు సమయంలో 6,833 చికిత్స అభ్యర్థనలు అందాయని, వాటిలో 5,480 మంది బాధితులు అర్హులని గుర్తించి, పథకం నిబంధనల ప్రకారం నగదు రహిత చికిత్స పొందారు. మోటారు వాహన ప్రమాద నిధి కింద పంపిణీ చేయబడిన మొత్తం నిధి కింద 73.88 లక్షలు అందజేసినట్టు తెలిపారు.ప్రమాదం జరిగిన తేదీ నుండి గరిష్ఠంగా 7 రోజుల పరిమితికి లోబడి, బాధితుడికి 1.5 లక్షల

>>2

# 'సాస్కి' నిధులతో బిసి స్కూళ్లు

**విజయవాడ.ఫి బ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా, ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆదరణ 3పథకం ద్వారా కులవృత్తుల వారీగా ఆధునిక పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం బీసీ సంక్షేమశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణంతో పాటు అక్కడ సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. రూ.60 కోట్ల సాస్కి నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారు. 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. దీంతో పాటు హాస్టళ్లలో శానిటేషన్‌తో పాటు విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారిం చాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా బోధన సహా అన్ని అంశాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుస రిం చాలని సూచనలు ఇచ్చారు. బీసీ విద్యార్థులకు విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదుచేసి అనుసంధానం చేయాలని సీఎంఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీభవనాలను పూర్తి

>>2



బుధవారం బిసి సంక్షేమశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

### మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు

### ఆదరణ-3 ద్వారా ఆధునిక పరికరాల పంపిణీ

### బిసి సంక్షేమశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

## ముడి పొగాకు ఉత్పత్తులపై జీరో సుంకం

### కేంద్రానికి మద్దతు ఇచ్చిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఎలాంటి బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నాకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తెలిపారు. ఇది రాష్ట్రంలో జరిగే అన్ బ్రాండెడ్ పొగాకు వాణిజ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. శుద్ధిచేయని పొగాకుకు(హెచ్ఎస్ కోడ్ 2401) వర్తించే

>>2

# అమరావతిలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, టూరిజం ప్రాజెక్టులు

### లండన్, దోహాలో మంత్రి నారాయణ బృందం పర్యటన

### ప్రాజెక్టులపై అధ్యయనం

**విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో నిర్మించే పలు ప్రాజెక్టుల అధ్యయనానికి విదేశీ పర్యటనకు వెళ్లారు మంత్రి నారా యణ ప్రజారాజధాని అమరావతిని ప్రపంచంలో టాప్ 5 రాజధానులలో ఒకటిగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెబు తున్నారు. దానికి తగినట్లుగానే మాస్టర్ ప్లాన్ రూపకల్పన తో పాటు కీలక ప్రాజెక్టుల నిర్మాణం కోసం అనేక దేశాల్లో అధ్యయనం చేస్తున్నారు. దీనికోసం మంత్రి నారాయణతో పాటు అధికారులు పలు దేశాల్లో ప్రపంచ ప్రఖ్యాత ప్రాజెక్టులను,ప్రాంతాలను పరిశీలించి బెస్ట్ మోడల్స్ ను పరిగణనలోకి తీసుకుంటున్నారు.తాజాగా అమరావతిలో నిర్మించే ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ,టూరిజం ప్రాజెక్టుల అధ్యయనానికి యూకేలోని లండన్,ఖతార్ రాజధాని దోహాలో పర్యటించారు మంత్రి నారాయణ. ఈ పర్యటనలో మంత్రి నారాయణ వెంట మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ కూడా ఉన్నారు. రెండు రోజులపాటు లండన్ లో పర్యటించిన మంత్రి నారాయణ బృందం. సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై లండన్ అభివృద్ధి ప్రణాళికలు,టూరిజం ప్రాజెక్టులపై చర్చించారు.. థేమ్స్ నది ఒడ్డున అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన రివర్ ఫ్రంట్ ను పరిశీలించారు.కృష్ణా నదీ తీరాన రివర్ ఫ్రంట్

>>2



## 18న బిల్‌గేట్స్ అమరావతి రాక

**విజయవాడ,ఫిబ్రవరి 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో క్వాంటం వ్యాలీ అంశంలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడుల అంశంపై కీలక ఒప్పందం జరిగే అవకాశాలు మెరుగుపడు తున్నాయి.అతి త్వరంలో క్వాంటం వ్యాలీలో మైక్రోసాఫ్ట్ కేంద్రం అందుబాటులోకి రాను న్నది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రముఖ దాత బిల్‌గేట్స్ ఫిబ్రవరి 18న బిల్‌గేట్స్ అమరావతికి రానున్నారని సమాచారం. ఈ పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్ సీఎం చంద్రబాబునాయుడుతో భేటీ కానున్నారు.ఏపీ ప్రగతికి సంబంధించిన పలు కీలక అంశాలు, ముఖ్యంగా సాంకేతిక రంగంలో పరస్పర సహకా రంపై వీరిద్దరి మధ్య చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆరోగ్యసంరక్షణ, పోషకాహారం, వ్యవసాయం, విద్య, ఉపాధి రంగాలలో బిల్ గేట్స్ ఫౌండేషన్ ఏపీ ప్రభుత్వానికి

>>2

# అవసరమైతే రాష్ట్ర బంద్

### వచ్చేది మా ప్రభుత్వమే, అన్నిటిపై ఎంక్వైరీ వేస్తాం

### గుంటూరులో అంబటి రాంబాబు ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో మాట్లాడిన మాజీ సిఎం జగన్



బుధవారం గుంటూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**గుంటూరు,ప్రభాతవార్త ప్రతినిధి :** మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించడానికి బుధవారం అంబటి రాంబాబు నివాసానికి గుంటూరు వచ్చారు. సాయంత్రం అంబటి రాంబాబు నివాసానికి చేరుకున్న వైయస్ జగన్ ముందుగా ఇంటిని ఆఫీసును పరిశీలించారు. ఆ తరువాత అంబటి కుటుంబ సభ్యులను కలిసి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అధర్య పడొద్దు, పార్టీ అండగా ఉంటుందని భరోసాను వారికి ఇచ్చారు. తదుపరి మీడియా సమావేశంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ అంబటి రాంబాబు పై జరిగిన దాడి పై విరుచుకుపడ్డారు. మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైయస్సార్సీపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. అంబటి రాంబాబు కాపు కులానికి టైగర్ అలాంటి వ్యక్తిని స్టేషన్ లో నల్లపాడు, పట్టాభిపురం సిఐలు దారుణంగా కొట్టారని వైయస్ జగన్ అన్నారు. వచ్చేది తమ ప్రభుత్వం అన్నిటిపై ఎంక్వైరీ వేస్తాం వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక అన్నీ లెక్కలు తేలుస్తాం విషపూరిత విత్తనాలు నాడటం ఆపండి రేపు కార్యకర్తలు స్పందిస్తే ఏమవుతుందో ఆలోచించుకోమని అన్నారు. చేతనైతే ఇచ్చిన హామీలను నిలబెట్టుకోండి, దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా బందుకు పిలుపునిస్తాం అని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో 200 మంది సీఐలు ఎస్సైలు వి ఆర్ లో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కావలసిన వారిని పోలీసులు నియమించుకున్నారు. బీహార్ సంగతేమో గాని ఏపీలో మాత్రం జంగల్ రాజ్ నడుస్తుంది తప్పు చేసిన అధికారుల్ని ఆధార్లతో సహా కోర్టులో నిలబెడతాం అని వైయస్ జగన్ వార్నింగ్ ఇచ్చారు. జగన్ రాక నేపథ్యంలో అభిమానులు భారీ సంఖ్యలో అంబటి నివాసం వద్దకు తరలివచ్చారు.గుంటూరు విజయవాడ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో కనీసం అంబులెన్స్‌లకు కూడా దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు.అయితే గతంలో పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో జగన్ పర్యటనల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలీసు ఆంక్షలు విధించారు. ఎడ్లపాడు జాతీయ రహదారిపై వైసీపీ నేతల వాహనాలను పోలీసులు నిలిపివేస్తున్నారు. గుంటూరులో జగన్ పర్యటనకు వెళ్లకుండా ఆంక్షలు పెట్టి, పలువురు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వైసీపీ కేడర్ తరలివెళ్తోంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దగ్గర తనిఖీలు నిర్వహించి ఎక్కడికక్కడ వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు. మరోవైపు జగన్ గుంటూరు పర్యటనకు అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పోలీసు అధికారులను కోరారు. అందుకు పోలీసులు నిరాకరిం చారు. గుంటూరుజిల్లా పరిధిలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడా బహి రంగ సభలు, సమావేశాలకు అనుమతి లేదని జిల్లాపోలీసు యంత్రాంగం ప్రకటన జారీ చేసింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పని గుంటూరు పోలీసులు హెచ్చరించారు.






ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన నటకిరీటి రాజేంద్రప్రసాద్

# డి.సిఎం పవన్‌ను కలిసిన నటకిరీటి రాజేంద్రప్రసాద్

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖనటుడు, నట కిరీటి రాజేంద్రప్రసాద్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. మంగళగిరిలోని డీ సీఎం పవన్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా పవన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య పలు విషయాలు చర్చకు వచ్చాయి. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పవన్‌ను రాజేంద్రప్రసాద్ సన్మానించి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించడం పట్ల పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు.ఏపీ రాజకీయాల్లో పవన్ నిబద్ధతతో వ్యవహరిస్తున్న తీరు ప్రశంసనీయమని రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు. పలుఅంశాలపై పవన్‌తో రాజేంద్రప్రసాద్ చర్చించినట్లు సమాచారం.



బుధవారం వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ రవి మనోహరాచారి

# విద్యార్థి నేతల కిడ్నాప్ కేసులో శ్రీవిద్యానికేతన్ పిఆర్‌ఒ సతీశ్ సహా 13మంది అరెస్ట్

**తిరుపతి,ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎ.రంగంపేట సమీపంలో ఉన్న శ్రీవిద్యానికేతన్ ,మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమాలపై నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలను కిడ్నాప్ చేసిన కేసులో యూనివర్సిటీ పిఆర్‌ఒ రావూరు సతీశ్‌తోబాటు 13మందిని తిరుపతి పోలీసులు అరెస్టుచేశారు. మూడు ఇన్నోవా కార్లు, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకు న్నామన్నారు. ఈ కేసులో మరికొంతమంది అరెస్ట్ కావాల్సి ఉందని తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ రవి మనోహరచారి తెలిపారు. మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ సమీపంలో జరిగిన ఘటనపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బుధవారం మధ్యాహ్నం 13మందిని అరెస్ట్ చేశారు. సాయంత్రం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి వివరాలు తెలిపారు.మంగళవారం జరిగిన విద్యార్థినేతల కిడ్నాప్ ఉదంతంపై జిల్లాఎస్పీ లంకెలసుబ్బరాయుడు తీవ్రంగా పరిగణించారు. బాధితులైన విద్యార్థినేతలు ఆలీఅక్బర్, వినోద్ కుమార్‌లతోబాటు వి.రెడ్డికుమార్ ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసులో తిరుపతి రూరల్ డిఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో తిరుచానూరు సిఐ బి.సునీల్ కుమార్ సిబ్బంది ముద్దాయిలు ఎంబియు పిఆర్‌ఒ రావూరు సతీశ్, పి.హేమంత్, కె.సురేంద్ర, పి. విశ్వేష్‌లను అరెస్ట్ చేశారు. బాధితుడు అక్బర్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో యూనివర్సిటీ బౌన్సర్లు సురేంద్ర, రాజేశ్,జానకిరామ్, బద్రినాథ్, మునిచంద్ర, ఎన్.వాసుదేవ, ఎ. మునితేజ, పి.విశేష్‌లను అరెస్ట్‌చేశామని, మరికొందరు పరారీలో ఉన్నారని త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. కాగా అరెస్ట్‌కు ముందు పిఆర్‌ఒ సతీశ్ ఫిర్యాదుపై చంద్రగిరి పోలీసులు విద్యార్థినేతలపై కూడా కేసునమోదు చేయడం కొసమెరుపు. వ్యక్తిగతరక్షణకు నియమించుకున్న బౌన్సర్లు ఆ వ్యక్తుల రక్షణకే ఉండాలని,అనవసరచట్టవిరుద్ధంగా చర్యలకు పాల్పడకూడదని పోలీసులు హెచ్చరించారు.

# ముడి పొగాకు ఉత్పత్తులపై జీరో సుంకం

>> సుంకం విధానాన్ని స్పష్టం చేస్తూ ఆర్థిక శాఖ ఈ గెజిట్ ను జారీ చేసింది. ఇక నుంచి అన్ బ్రాండెడ్ పొగాకు రీటైల్ విక్రయాలకు ఎక్సైజ్ సుంకం సున్నా గా పేర్కొంటూ ఈ గెజిట్ ను కేంద్రం విడుదల చేసింది. పొగాకు విక్రయాలపై పన్నుల విషయంలో ఏకరూపత, స్పష్టత, పారదర్శకంగా ఉండేలా ఈ గెజిట్ ను కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకమైన ముందడుగని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఎలాంటి బ్రాండ్ లేని బల్క్ పొగాకు క్రయ విక్రయాలు, వాణిజ్యానికి స్పష్టమైన తేడా లేకపోవటంతో చట్టంలోని వేర్వేరు నిబంధనల కారణంగా ఇబ్బందులు తలెత్తేవి. ఈ తరహా అస్పష్ట విధానాల కారణంగా రైతులు, వ్యాపారులు నష్టపోతున్న నేపథ్యంలో అన్ బ్రాండెడ్ ఉత్పత్తుల సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ గెజిట్ ద్వారా ఎక్సైజ్ డ్యూటీ విధింపులో వేర్వేరు వర్గీకరణల వల్ల జరిగే ఇబ్బందులు తగ్గనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పొగాకు రైతులందరికీ మేలు చేసే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులకు మంచి ధర దక్కటంతో పాటు వ్యాపారులకు, ఎగుమతులకు కూడా ప్రయోజనం చేకూర్చనుందని వివరించారు. స్పష్టమైన మార్గదర్శ కాలు, నిబంధనల కారణంగా ఎక్సైజ్ డ్యూటీ ఎగవేత గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తప్పుడు మార్గాల్లో పన్ను ప్రయోజనాలు పొందకుండా అడ్డుకునేలా ఉన్న ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థిస్తుందని అన్నారు.ఈ నోటిఫికేషన్‌ను దేశవ్యాప్తంగా ఒకేలా కఠినంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుకు ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

**ఫిబ్రవరి 1 నుంచే ఈ మార్పులు అమలు:**పొగాకు హెచ్‌ఎస్ 2401 కోడ్ కిందకు వచ్చే బ్రాండ్ లేని, రీటైల్ విక్రయాలకు కోసం ప్యాక్ చేయని పొగాకు ఉత్పత్తులకు సున్నా శాతం ఎక్సైజ్ సుంకం వర్తించనుంది. రైతులు సంచులలో విక్రయించే పొగాకు ఈ పరిధిలోకి రానుంది. ఇక దుకాణాల కోసం చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసిన పొగాకు ఉత్పత్తులకు, కంపెనీ బ్రాండ్ పేరు ముద్రించిన పొగాకు సంచులు, ప్యాకెట్లకు కూడా 18 శాతం ఎక్సైజ్ సుంకం వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ తన గెజిట్ లో పేర్కొంది. ఎక్సైజ్ సుంకంలో తాజా మార్పులతో ముడి పొగాకు సరఫరా వ్యవస్థకు ఉపశమనం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వాణిజ్య ప్రయోజనాల కోసం విక్రయించే ఉత్పత్తుల నుంచి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఇబ్బంది ఉండదని వెల్లడించింది. ముడి పొగాకు రీటైల్ విక్రయాలు పన్ను పరిధిలోకి వస్తుందా లేదా ప్యాకింగ్ వల్ల పన్ను రేటు మారుతుందా అన్న అంశాలపై నిబంధనలు అస్పష్టంగా ఉండేవని.. ప్రస్తుత గెజిట్ నోటిఫికేషన్ తో సందేహాలు తొలగిపోయాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. బ్రాండ్ లేని ప్యాకింగ్ లేని పొగాకు రీటైల్ విక్రయాలపై 2026 ఫిబ్రవరి 1 తేదీ నుంచి సున్నా ఎక్సైజ్ సుంకం వర్తిస్తుందని నోటిఫికేషన్ లో పేర్కొన్నారు. మిగిలిన పొగాకు ఉత్పత్తులన్నిటి పైనా 18 శాతం మేర ఎక్సైజ్ సుంకం వర్తిస్తుందని తద్వారా ఆడిటింగ్, బిల్లింగ్ సమయంలో తలెత్తే వివాదాలు తగ్గనున్నాయని ప్రభుత్వం తెలియచేసింది. ఈ నిర్ణయం ద్వారా రైతులు, చిరువ్యాపారులకు ప్రయోజనం కలుగనుంది. రైతులు సాగు చేసిన పొగాకును యథాతథంగా ఎలాంటి బ్రాండ్ లేకుండా సంచుల్లో బల్క్ గా విక్రయిస్తున్నందున దీనికి ఎలాంటి సుంకమూ ఇక వర్తించదని నోటిఫికేషన్ పేర్కొంది. తద్వారా వారికి నేరుగా ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో అస్పష్టమైన నిబంధనల వల్ల అధికారులు రైతులను కూడా ప్రశ్నించే పరిస్థితి ఉండేది. ప్రస్తుత నిర్ణయంతో రైతులకు ఇబ్బందులు తప్పాయి. బల్క్ పొగాకుపై ఎలాంటి పన్నూ లేకపోవటంతో రైతులకు మెరుగైన ధర కూడా లభించే అవకాశం ఉందని రాష్ట్రప్రభుత్వం తెలియచేసింది. దీంతో పాటు బ్రాండెడ్ ఉత్పత్తుల రీటైల్ విక్రయాల్లో ముడి పొగాకు పేరుతో జరిగే దుర్వినియోగానికి కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాలు అడ్డుకట్ట వేయనున్నాయి.



బుధవారం గుంటూరులోని అంబటి రాంబాబు నివాసంలో ఆయన కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జగన్

# రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్ అవర్' చికిత్స

>>వరకు చికిత్స కవర్ అందించబడుతుందన్నారు.ఏ కేటగిరీ రోడ్డులోనైనా మోటారు వాహనాల వాడకం వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలలో చిక్కుకున్న బాధితులకు చికిత్స కవర్ అందుబాటులో ఉంటుందన్నారు.ప్రతి మోటారు వాహన రోడ్డు ప్రమాద బాధితుడికి ప్రాణాపాయం లేని కేసులలో 24 గంటల వరకు, ప్రాణాంతక కేసులలో 48 గంటల వరకు పోలీసు ప్రతిస్పందనకు లోబడి, నియమించబడిన ఆసుపత్రులలో చికిత్స అందించబడుతుందన్నారు. ఈ పథకానికి ఉమ్మడిగా నిధులు సమకూరుతాయన్నారు.ఇందులో నేరం చేసిన మోటారు వాహనం బీమా చేయబడిన కేసులకు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు అందించే విరాళాలు, బీమా లేని మోటారు వాహనాలు లేదా హిట్ అండ్ రన్ మోటార్ ప్రమాదాలకు సంబంధించిన కేసులకు బడ్జెట్ మద్దతు ఉంటుందన్నారు.

# అమరావతిలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ,టూరిజం ప్రాజెక్టులు

>> అభివృద్ధికి థేమ్స్ రివర్ ఫ్రంట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నారాయణ అభిప్రాయపడ్డారు.లండన్ లోని బాటర్సీ పవర్ స్టేషన్ ను సందర్శించారు.ఆ తర్వాత ప్రపంచంలోనే ఎత్తైన కాంతిలివర్డ్ అబ్జర్వేషన్ వీల్ అయిన లండన్ ఐను అధ్యయనం చేశారు.

ఇప్పటికే అమరావతిలో లండన్ ఐ తరహాలో ఒక భారీ వీల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇక రెండో రోజు లండన్ స్ట్రాట్ ఫోర్డ్ లోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ పార్క్‌ను మంత్రి నారాయణ బృందం పరిశీలించింది...2012 లో ఒలింపిక్ గేమ్స్ కోసం నిర్మించిన ఈ స్పోర్ట్స్ పార్క్ లోని పలు క్రీడా పార్కులు(ప్లే జోన్స్)ను పరిశీలించి వాటి నిర్మాణం గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. .ప్రసిద్ధ లండన్ స్టేడియం,లండన్ ఆక్వాటిక్స్ సెంటర్,హైడ్ పార్క్, లీ వ్యాలీ వేలోపార్క్ ల నిర్మాణాలను సందర్శించి వాటిని అధ్యయనం చేశారు. రెండు రోజుల పర్యటన తర్వాత లండన్ నుంచి నేరుగా ఖతార్ రాజధాని దోహా కు చేరుకున్న మంత్రి నారాయణ బృందం...అక్కడి స్పోర్ట్స్ ప్రాజెక్టులను సందర్శించింది.ఆస్పైర్ జోన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా పిలిచేదోహా స్పోర్ట్స్ సిటీని మంత్రి బృందం సందర్శించింది.స్పోర్ట్స్ సిటీలోని ఖలీఫా ఇంటర్నేషనల్ స్టేడియం,ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్,ఆస్పైర్ అకాడమీలను పరిశీలించి వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ లతో అంతర్జాతీయ క్రీడలకు గమ్య స్థానంగా దోహా స్పోర్ట్స్ సిటీ పేరుగాంచింది. 250 హెక్టార్లలో భారీ విస్తీర్ణంలో ఉన్న స్పోర్ట్స్ సిటీలో 2006లో ఆసియన్ గేమ్స్ నిర్వహించారు...ఇదే స్పోర్ట్స్ సిటీలో ఆసియా లోనే మొదటి స్పోర్ట్స్ మెడిసిన్ హాస్పిటల్ గా ఉన్న ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్ కూడా ఉంది. అలాగే 2022 ఫిఫా వరల్డ్ కప్ నిర్వహించిన లుసైల్ స్టేడియం ను సందర్శించి అంతర్జాతీయ క్రీడలను ఏ విధంగా నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికల గురించి దోహా అధికారులతో మంత్రి నారాయణ బృందం చర్చించింది. త్వరలోనే అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మించేందుకు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తుంది ప్రభుత్వం లండన్,దోహా ల పర్యటన తర్వాత అక్కడ అభివృద్ధి చేసిన కొన్ని ప్రాజెక్టులను అమరావతిలో కూడా అమలు చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. మూడు రోజుల పర్యటన ముగించుకుని భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం మంత్రి నారాయణ బృందం విజయవాడ చేరుకోనుంది.

# క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై హైకోర్టు విచారణ

**విజయవాడ,ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ప్రభుత్వంలో అప్పటి విపక్ష నేత చంద్రబాబు తదితరులపై నమోదైన కేసులకు సంబంధించిన రికార్డులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. సీఐడీ తరఫు న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి కౌంటర్ వేసేందుకు సమయం కోరడంతో విచారణను 2వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఫైబర్‌గ్రిడ్, మద్యం పాలసీలకు సంబంధించి వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసులను విజయవాడ ఏసీబీ కోర్టు మూసివేసింది. ఈ కేసులకు సంబంధించిన తీర్పు ప్రతులతో పాటు రికార్డులన్నింటినీ ఇవ్వాలని కోరగా కోర్టు నిరాకరించింది, అని పేర్కొంటూ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి యేము కొండలరావు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు.

# 18న బిల్‌గేట్స్ అమరావతి రాక

>> సహకారం అందించడానికి ఇదివరకే ఒప్పందాలు చేసుకుంది. 2025 మార్చిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒక ముఖ్యమైన అవగాహన ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వంటి టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు సాధించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యం. ఏఐ టెక్నాలజీ వినియోగంతో పాటు రియల్ టైమ్ డేటా వ్యవస్థలను అమలు చేయడంలో చంద్రబాబు విజన్‌ను బిల్ గేట్స్ ప్రశంసిస్తూ లేఖసైతం రాశారు. ముఖ్యంగా హెల్త్ అనలిటిక్స్, డిజిటల్ అగ్రికల్చర్, ఈగవర్నెన్స్ ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే అవకాశం ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనపై మరో ఆసక్తికరమైన ప్రచారం కూడా సాగుతోంది. అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీలో మైక్రోసాఫ్ట్ సంస్థ పెట్టుబడులు పెట్టే అవకాశంఉన్నట్లు తెలుస్తోంది. చంద్రబాబుతో భేటీలో ఈ అంశంపై ప్రతిపాదన చేస్తారని అంతా భావిస్తున్నారు. ఒకవేళ ఇదేనిజమైతే ఏపీ ఐటీ రంగానికి ఇది మరింత ప్లస్ అవుతుంది. ఏపీ ప్రభుత్వానికి టెక్నాలజీ సహకారంతో పాటు పెట్టుబడులకు సంబంధించిన అంశంపై బిల్ గేట్స్ పర్యటన రోజు స్పష్టత రానుందని రాజకీయ, పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి.

# 'సాస్కి' నిధులతో బిసి స్కూళ్లు

>> చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 6 మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చాలని సీఎం ఆదేశించారు. బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్ట్ కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని వారికి ప్రయోజనం కలిగేలా పథకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

# మణిపూర్ సిఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం

**ఇంఫాల్,ఫిబ్రవరి 4:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దుచేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గజిట్ నోటిఫికేషన్‌ను అనుమతించడంతో మణిపూర్‌లో ప్రజాప్రభుత్వం ఏర్పాటయింది. బుధవారం మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా బిజెపినేత యమ్నం ఖేమ్‌చంద్‌సింగ్‌ప్రమాణం చేసారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. బిజెపి ఎమ్మెల్యే నెమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్‌ఫ్రంట్ ఎమ్మెల్యే ఎల్‌డిఖో ఉపముఖ్యమంత్రులుగాప్రమాణంచేసారు. మణిపైర్‌లో 2023 మే నెలలో మొదలైన జాతుల వైరం హింసాత్మకంగా మారి 260మందికిపైగా మృతి చెందారు.

# ప్రత్యర్థుల కుట్రలు తిప్పికొడతాం

## కూటమి నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవే..

## తిరుపతి లడ్డూ, రాజ్యసభ సీట్ల కేటాయింపుపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ చర్చలు





**విజయవాడ, ఫిబ్రవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రత్యర్థి రాజకీయ పక్షాల కుట్రల సమర్థవంతంగా తిప్పకొట్టాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు.కూటమి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం సమిష్టిగా ఉండాలని ఇద్దరు అభిప్రాయపడ్డారు.సీఎం చంద్రబాబు నాయుడితో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. కుల రాజకీయాలను రెచ్చగొట్టే దిశలో వైకాంగ్రెస్‌పార్టీ కుట్రలు పన్నుతుందని సీఎం,డి సీఎం అభిప్రాయపడ్డారు.వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని నిర్ణయించారు.ప్రతి అంశానికి కులాన్ని ముడిపెట్టే ప్రయత్నం సహించవేదిగా లేదని డిప్యూటీ సీఎం పవన్ సమావేశంలో వ్యాఖ్యానించారంటున్నారు.అదీ నిజమైన ఏ అంశంపైనైనా విధానపరంగా వ్యవహరిద్దామని ఆయన సీఎంతో అన్నారు.ఇది అత్యంత పరిపక్వమైన ఆలోచన అని సీఎం చంద్రబాబు పవన్ కల్యాణ్‌కు కితాబు ఇచ్చినట్లు సమాచారం.సీఎంగా,కూటమి రథసారథిగా చంద్రబాబు తీసుకునే ప్రతి నిర్ణయానికి జనసేన మద్దతు ఉంటుందని పవన్ సీఎంకు చెప్పినట్లు సమాచారం. ఈరోజు (బుధవారం) ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నారు పవన్. అనంతరం ఇద్దరి మధ్య సమావేశం మొదలైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సున్నితమైన అంశాలపై విపక్షం రెచ్చగొట్టే ప్రయత్నాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడంపై చర్చించనున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న నేపథ్యంలో.. వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే గతంలో సీఎం మాట్లాడటం, విచారణకు ఆదేశించడం, అలాగే ఈ అంశంపై సుప్రీం కోర్టుకు పలువురు వెళ్లగా సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటై ఈ వ్యవహారంపై విచారించడం జరిగింది. సిట్ తన నివేదికను కేబినెట్ ముందు ఉంచగా నిన్న (మంగళవారం) ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. నెయ్యి కల్తీ జరగడం వాస్తవమని తేలడంతో.. ఇందులో ఎవరు సూత్రధారులు అనేదానిపై కేబినెట్‌లో చర్చించడంతో పాటూ కల్తీకి ఆస్కారం ఇచ్చిన వారంతా బాధ్యులే అని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో వాటి పంపకం అంశంపైనా ఈ సమావేశంలో చర్చ అనుకున్నట్లుగానే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కూటమి సమీకరణాల ప్రకారం టీడీపీకి రెండు స్థానాలు, జనసేనకు ఒకటి, బీజేపీకి ఒకటి దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న. ఈ నేపథ్యంలో కూటమిలో సమన్వయం, అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చ జరిగే అవకాశముందని సమాచారం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా అజెండాలో ఉండనున్నాయి. అలాగే త్వరలో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో, ఆ అంశం కూడా సమావేశంలో ప్రస్తావనకు రావచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రత్యేకంగా కూటమిలోని మూడు పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ ఇకపై కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహించేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాల్సిన అవస్యకతపై చంద్రబాబు, పవన్ ఒక రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పరిపాలనతో పాటు రాజకీయంగా కూడా కూటమిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే ఈ భేటీ సారాంశంగా చెబుతున్నారు. సీఎం.,డీసీఎం సమావేశం సుదీర్ఘ సమయం జరిగింది.సమావేశ వివరాలు పూర్తిగా వెల్లడి కావాల్సి ఉంది.



సీఎం చంద్రబాబును కలిసి గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందచేస్తున్న గద్దర్ కుమార్తె వెన్నెల

# ఎపిలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతినివ్వండి

## సిఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేసిన గద్దర్ కుమార్తె వెన్నెల

**విజయవాడ,ఫిబ్రవరి 4,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని ప్రజాయుద్ధనౌక గద్దర్ కుమార్తె వెన్నెల కలుసుకున్నారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు,గద్దర్ అభిమానుల కోరిక మేరకు, ఏపీ లో గద్దర్ విగ్రహం ప్రతిష్ఠకు అనుమతులు కోరుతూ వెన్నెల చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు.ఆంధ్ర విశ్వవిద్యాలయం లో కళలు,సాంస్కృతిక విభాగానికి కి గద్దర్ అన్న పేరు పెట్టాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ల కోరుకుంటున్నట్లు వెన్నెల సీఎం చంద్రబాబుకు వివరించారు, అట్లనే జనజీవనములో కలుస్తున్న మావోయిస్టుకు ఉపాధి కల్పించాల్సిందిగా కోరారు.అనంతం వెన్నెల మీడియాతో మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు తన వినతి పట్ల సానుకూలంగా స్పందించారని వివరించారు.గద్దర్ ప్రజా చైతన్యాన్ని తీసుకుని వచ్చిన వాగ్గేయకారుడని చంద్రబాబు అభివర్ణించారన్నారు.సాంస్కృతిక విప్లవ జీవనానికి నాంది పలికిన గద్దర్ ప్రజలందరి మనిషి అని వెన్నెల అన్నారు.

# తిరుపతిలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**తిరుపతి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని బాలాజీ నర్సింగ్ హాస్టల్‌లో నర్సింగ్ విద్యార్థిని భీష్మాంజలి(19) హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన బుధవారం ఉదయం జరిగింది. నెల్లూరుజిల్లా పెళ్ళకూరు మండలం చిరసంబేడు గ్రామానికి చెందిన రమణయ్య కుమార్తె భీష్మాంజలి తిరుపతిలోని ఎస్‌బిఐ కాలనీలో ఉన్న ప్రవీణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో కార్డియాలజీ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రతిరోజూలాగే మంగళవారం కూడా కళాశాలకు వెళ్ళి హాస్టల్‌కు చేరుకుంది. హాస్టల్‌లో బుధవారం ఉదయం తరగతికి వెళ్ళకుండా గదిలోనే ఉండిపోయింది. ఒంటరిగా ఉండటంతో ఆమె గదిలో ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళాశాల సిబ్బంది వేధింపుల కారణంగానే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని విద్యార్థినుల ఆరోపణలు. సమాచారం అందుకున్న మృతురాలి తల్లిదండ్రులు తిరుపతికి చేరుకుని బోరున విలపించారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునే పిరికిదికాదని, ఆమెకు కళాశాల యాజమాన్యం వేదింపులతోనే ఈ ఘటన జరిగిందని తిరుపతి తూర్పు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హేమాద్రి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు.

# హాస్టల్ భవనంపై నుంచి పడి బి టెక్ విద్యార్థి దుర్మరణం

**చంద్రగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** హాస్టల్ భవనంపై నుండి క్రిందపడి బి టెక్ విద్యార్థి మృతి చెందినదుర్ఘటన మంగళవారం అర్ధరాత్రి తిరుపతిజిల్లా చంద్రగిరి మండలం ఆరేపల్లి రంగంపేట వద్ద చోటుచేసుకున్నది. ఎస్‌ఐ మురళి వెల్లడించిన వివరాల మేరకు ఒంగోలుకు చెందిన బాలాజీ ఏ.రంగంపేటలో హాస్టల్లో వుంటూ మోహన్‌బాబు యూనివర్శిటీలో బిటెక్ థర్డ్ ఇయ్యర్ చదువుతున్నాడు.తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుని కుమారుడిని చదివించుకుంటున్నారు. సున్నిత మనస్కుడైన బాలాజీ తాను వుంటున్న హాస్టల్‌భవనంపై నుండి క్రిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు. బుధవారం కేసునమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.తల్లిదండ్రుల హృదయ విదారకరోదనతో సహచర విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

## వారం - వర్జ్యం

05-02-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
చవితి రా.12.26
ఉత్తరఫల్గుణి రా.11.01
వర్జ్యం : ఉ.7.55-9.37
దు.ఉ.10.27-11.13, 2) మ.3.03-3.49
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఇతరుల మీద ఆధారపడకుండా ప్రతి పనిని స్వయంగా పరిశీలించుకోవడం మంచిది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృషభం:** పరిష్కారం లేని సమస్యలను కాలానికి వదిలివేయడం వలన ఒత్తిడి నుండి బయటపడుతారు. వస్త్రలాభం.

**మిథునం:**ప్రయాణాలను సాధ్యమైనంత వరకు వాయిదా వేయడం ఉత్తమం. నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

**కర్కాటకం:**మిమ్మల్ని ఇరుకున పెట్టదానికి సాగించే ప్రయత్నాలు కొనసాగుతాయి. మిత్రుల కలయిక. వాహనసౌఖ్యం కలదు.

**సింహం:**పెద్దస్థాయి కలిగిన వ్యక్తులు కూడా మీ నుండి సలహాలను, సూచనలను అందుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం.

**కన్య :** మీ మేధస్సు మీకు మాత్రం ఉపకరించదు. చిన్న చిన్న పనులకు కూడా అధికంగా శ్రమించవలసి ఉంటుంది.

**తుల :** గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి అవకాశాలు కలిసివస్తాయి. నేర్పుగా అందిపుచ్చుకోండి.

**వృశ్చికం:**జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు తొలగిపోతాయి. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి.

**ధనుస్సు:** నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు. వివాదాలకు దూరంగా వుండండి.

**మకరం:**ఎదురు చూస్తున్న అవకాశాలు లాభిస్తాయి. సోదరుల నుండి ముఖ్యమైన సమాచారం అందిస్తారు.

**కుంభం:**పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. వస్తువస్త్రాల కొనుగోలు చేస్తారు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మీనం :** దుష్ప్రచారాలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.కాంట్రాక్టులు లాభిస్తాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఉగాది, కళారత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: మార్చి 19న నిర్వహించనున్న శ్రీ "పరాభవ" నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఉగాది, కళారత్న పురస్కారాలను ప్రధానం చేయడం జరుగుతుందని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్. మల్లిఖార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ. అవధానం, వైద్యం, ఇంద్రజాలం, మూకాభినయం, హరికథ, బుర్రకథ, జర్నలిజం, సామాజిక సేవ వంటి 15 విభాగాల్లో నిష్ణాతులైన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఆసక్తి కల్గినవారు తమ బయోడేటాను ఫిబ్రవరి 20, లోపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, రెండవ అంతస్థు ఘంటశాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, దుర్గాపురం, విజయవాడ కార్యాలయానికి పంపించవచ్చునని తెలియజేశారు

## 'స్వయం' పేరుతో డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్

- జాతీయ అంతర్జాతీయ మార్కెట్లను ఆకట్టుకునేలా బ్రాండింగ్
- సెర్ప్, మెప్మాపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




సచివాలయం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం "స్వయం" అనే పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించే అంశంపై బుధవారం సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్షించారు. బ్రాండింగ్ కల్పించే ప్రక్రియలో భాగంగా అధికారులు ప్రతిపాదిం చిన వివిధ పేర్లు.. లోగో లను సీఎం పరిశీలిం చారు. అధికారులు ప్రతి పాదించిన రెండు లోగో లను పరిశీలించిన సీఎం లోగో ఖరారుపై డ్వాక్రా సంఘాల అభిప్రాయాల ను కూడా పరిగణన లోనికి తీసుకోవాలని ఆదేశించారు. మెజార్టీ అభిప్రాయం మేరకు లోగో ఖరారుపై నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "డ్వాక్రా మహిళలు అద్భుతంగా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వారికి మంచి మార్కెటింగ్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

స్థానికంగా ఉండే మార్కెట్లే కాకుండా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను కూడా ఆకర్షించేలా మహిళా ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే అదేస్థాయిలో బ్రాండింగ్ ఆకర్షణీయంగా ఉండాలి. బ్రాండ్ పేరు, లోగో ఆకట్టుకునేలా ఉండాలి, బ్రాండ్ పేరు, లోగోతోనే కాన్సెప్ట్ అందరికీ అర్థమయ్యేలా ఉండాలి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఉత్పత్తులను తెస్తున్నారు కాబట్టి స్వయం అనే పేరు బాగుంటుంది. అదే తరహాలో లోగో డిజైన్ కూడా ఉండాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హోంశాఖ బడ్జెట్‌పై కసరత్తు

- మంత్రులు పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత సమీక్ష

విజయవాడ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త ప్రతినిధి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి వంగలపూడి అనిత పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు హోం శాఖకు అవసరమైన నిధులు కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు. పోలీస్ శాఖ మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం, సిబ్బంది అవసరాలు తదితర అంశాలపై అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ సెక్రటరీలు వినయ్ కుమార్, రోనాల్డ్ రాస్, జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడ, హోంశాఖ సెక్రటరీ విజయ్‌కుమార్, అడిషనల్ డీజీ మధుసూదన్, ఐజీ రవిప్రకాశ్, పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు.

## పర్యాటక రంగ బ్రాండింగ్, మార్కెటింగ్ కోసం రూ.150 కోట్ల ప్రతిపాదన

- విశాఖ, తిరుపతిలను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిపై ఆర్థిక మంత్రి కేశవ్‌తో మంత్రి దుర్గేష్ సమీక్ష



విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, పర్యాటక రంగ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై వెలగపూడి సెక్రటేరియట్‌లో కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, శాఖాధిపతులు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు అవసరమైన నిధులపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడంతో పాటు వివిధ పర్యాటక ఉత్సవాల నిర్వహణకు రూ. 150 కోట్లు కేటాయించాలని మంత్రి దుర్గేష్ ఆర్థిక మంత్రిని కోరారు. విశాఖపట్నం, తిరుపతి నగరాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక తోడ్పాటు అందించాలని చర్చించారు. అదే విధంగా అన్ని జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు ఆర్థిక సహకారం కావాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రసాద్, స్వదేశీ దర్శన్ 2.0, సీబీడీడీ, శాస్కి మరియు పూర్వోదయ పథకాల ద్వారా వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని, కనెక్టివిటీని మెరుగుపరచాలని నిర్ణయించామన్నారు. వివిధ వేదికలపై పర్యాటక రంగానికి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయించి అనంతరం త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా 201419 కాలానికి సంబంధించిన పాత బకాయిల చెల్లింపులపై కూడా సానుకూలంగా చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పర్యాటక ఉత్సవాల అంశం చర్చకు వచ్చింది. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సెక్రటరీ రోనాల్డ్ రాస్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంతకు ముందు పర్యాటక శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి దుర్గేష్.. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పీపీపీ విధానంలో సాగుతున్న ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన క్యాపిటల్ వర్క్స్, పార్కుల అభివృద్ధి, పర్యాటకుల భద్రతపై అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. తూర్పు భారతదేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు, పర్యాటకం, సంస్కృతిని ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పర్యాటక ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామ న్నారు. పూర్వోదయ క్రింద పర్యాటక సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయడం, కనెక్టివిటీని మెరుగుపరచడం మరియు పర్యాటక సంబంధిత కార్యకలాపాల ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలను పెంచడం, పర్యాటకాభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

## వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించండి

**ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు భేటీ**

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై రాష్ట్ర వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతన్నలకు బలమైన అండగా నిలిచేలా వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి, అలాగే రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించే దిశగా వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖలకు అవసరమైన నిధుల కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకత వృద్ధి, ఆధునిక సాంకేతికత అమలు, పశుసంవర్ధక రంగ విస్తరణ వంటి అంశాలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో ముఖ్యమైన కార్యాలయ భవనాలు, మౌలిక వసతుల నిర్మాణం, కొనసాగుతున్న మరియు ప్రతిపాదిత ప్రాజెక్టుల అమలుకు అదనపు నిధులు అవసరమని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల కోసం అదనపు బడ్జెట్ కేటాయింపులు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఈ విజ్ఞప్తిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందిస్తూ, రైతు సంక్షేమం, వ్యవసాయ, పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. రాబోయే బడ్జెట్‌లో ఈ రంగాలకు తగిన నిధులు కేటాయించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## తిరుమల సమాచారం



### యతిరాజరామానుజ జీయర్‌స్వామికి పెద్దమర్యాద

తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: భగవంతుని నామస్మరణ, భక్తి భావంతోనే భక్తులకు మంచి జరుగుతుందని మేల్కొటే యధుగిరి యతిరాజ మఠం మఠాధిపతి యదుగిరి యతిరాజనారాయణ రామానుజ జీయర్‌స్వామి తెలిపారు. బుధవారం ఉదయం శిష్యులతో కలసి తిరుమలకు వచ్చిన స్వామికి టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఆలయ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. మహా ద్వారం నుండి ఆలయంలోకి చేరుకున్న స్వామి తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. వేదపండితులు వేదాశీర్వచనం అనంతరం స్వామివారి తీర్థప్ర సాదాలు అందజేశారు. స్వామితోబాటు బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్ ఉన్నారు.

### శ్రీవారిసేవలో మాజీ న్యాయమూర్తి రవీంద్రన్



తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వి రవీంద్రన్ కుటుంబం బుధవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తికి అధికారులు స్వాగతం పలికారు. ఆలయం లోపలకు చేరుకున్న వీరంతా దేవదేవుని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



### వెంకన్న ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని స్వామి వారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో జార్ఖండ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, జబర్దస్త్ ప్రేమ్ నటులు శ్రీముఖి, ముక్కు అవినాష్ వేర్వేరుగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### 26నుండి తిరుమలేశుని తెప్పోత్సవాలు ఆర్జితసేవలు రద్దు



తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 26వ తేదీ నుండి ఐదురోజులు వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు, నీటి విభాగం అధికారులు బలమైన తండ్లుతో తెప్పను తీర్చిదిద్దుతారు. తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదు రోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి అన్ని చర్యలు తీసుకుని ఏర్పాట్లు చేస్తుంది. ఫిబ్రవరి 26వ తేదీ గురువారం సాయంత్రం నుండి మార్చి 2వ వరకు ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ తెప్పోత్సవాలు ప్రతి రోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయ స్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు. రెండవరోజు మూడుచుట్లు, మూడవరోజు ఐదు చుట్లు. నాలుగు, ఐదు రోజుల్లో పలురకాల అలంకరణల్లో మలయప్ప తెప్పలపై విహరిస్తారు. తొలి రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేశారు.

### కపిలేశ్వరస్వామి ఆలయంలో వేదోక్తంగా శుద్ధి



తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 8 నుండి 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నందున బుధవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. ఆ తరువాత ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయంలోపల గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకాధికారి డి. ఫణికుమార్ నాయుడు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### 8నుండి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**15న మహాశివరాత్రి వేడుకలు**



తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 8వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగుతుంది. 8వ తేదీ ఉదయం ద్వజారోహణంతో శ్రీకారం చుట్టే బ్రహ్మోత్సవాలు తొలిరోజు రాత్రి హంసవాహనం, 9న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 10న భూతవాహనం, సింహవాహనం, 11న మకర వాహనం, శేషవాహనం, 12న తిరుచ్చి ఉత్సవం, అధికార నందివాహనం, 13న వ్యాఘ్ర వాహనం, గజవాహనం, 14న కల్పవృక్ష వాహనం, అశ్వవాహనం, 15న మహాశివరాత్రి వేడుకలతోబాటు రథోత్సవం (భోగితేరు), అధికార నందివాహనం, 16న పురుషామృగ వాహనం, శివపార్వతుల కల్యాణోత్సవం, తిరుచ్చివాహనం, 17న చివరగా త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, రవాణాసుర వాహనంతో ముగుస్తాయి.

బ్రహ్మోత్సవాల్లో ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణతో మారుమోగుతాయి. ప్రతిరోజూ ఉదయం, రాత్రి 7గంటల నుండి 9గంటల వరకు వాహనసేవలు ఊరేగుతాయి.

## ముడి పొగాకు ఉత్పత్తులపై సున్నా ఎక్సైజ్ సుంకం హర్షణీయం

- పొగాకు రైతులకు, చిరు వ్యాపారులకు పెద్ద ఊరట
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



సచివాలయం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తు లపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాగతిస్తుందని రాష్ట్ర వ్యవసాయి, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరు వ్యాపారులకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పొగాకు హెచ్ఎస్ కోడ్ 2401 కిందకు వచ్చే, రీటైల్ విక్రయాల కోసం ప్యాక్ చేయని అన్ బ్రాండెడ్ ముడి పొగాకు పై ఇకపై ఎలాంటి ఎక్సైజ్ డ్యూటీ వర్తించదని తెలిపారు. గతంలో అస్పష్టమైన నిబంధనల వల్ల రైతులు, వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ గెజిట్‌తో తొలగిపోతాయని చెప్పారు. అయితే బ్రాండెడ్‌గా ప్యాక్ చేసిన పొగాకు ఉత్పత్తులపై 18శాతం ఎక్సైజ్ సుంకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో పన్నుల విషయంలో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని, రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బల్క్‌ముడి పొగాకు పై ఎలాంటి పన్ను లేకపోవడం వల్ల రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని, మెరుగైన ధర లభించే అవకాశం ఉందన్నారు. అలాగే బ్రాండెడ్ ఉత్పత్తుల పేరుతో జరిగే దుర్వినియోగానికి ఈ కొత్త మార్గదర్శకాలు అడ్డుకట్ట వేస్తాయని మంత్రి పేర్కొన్నారు.

## ప్రత్యేక కమిషన్




- 'కల్తీ' నెయ్యిలో అసలు రహస్యం తేల్చుతుందా!?
- ఈ పాపంలో కీలక సూత్రధారులెవరు!?

తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూల తయారీకి జంతువులనూనె, ఇతర శాఖాహారపదార్థాలతో కల్తీచేసి సరఫరా చేశారని తేల్చిన సిబిఐ సిట్ నివేదికలతో అసలు సూత్రదారులు తేల్చలేకపోవడంతో దీనిపై రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పాత్రధారులను వెల్లడించిన సిట్ నివేదికలు సూత్రధారులు ఎవరనేది పేర్కొనలేకపోవడంతో తప్పులుచేసిన వారిని పట్టుకోవాలనే ధృడనిశ్చయంతో ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు ప్రత్యేకంగా నిపుణులతో కమిషన్ ఏర్పాటుచేసి సిట్ సిఫార్సుల్లో లోపాలను వెదికి తదుపరి ప్రభుత్వం దగ్గరున్న సమాచారంతో సూత్రధారుల్ని తేల్చడానికి కమిషన్ ఏర్పాటు అవశ్యమనేది మంత్రిమండలి నిర్ణయించింది. ఇప్పుడు ఈ కమిషన్‌లో ఎవరెవరుండనున్నారు? ఏ కోణంలో ఎవరిని విచారణ చేయనున్నారనేది గుబులు రేకెత్తిస్తోంది.

ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు ఏడాదిన్నరపైగా క్షేత్రస్థాయిలో కీలక విచారణ చేపట్టి లడ్డూలకు కల్తీనెయ్యి వాడకంపై 14మంది వరకు నిందితుల్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. 2019-24 మధ్యకాలంలో కీలకంగా 2020లో నెయ్యి సరఫరాకు నిబంధనలు మార్చారని, పూర్తిగా కాంట్రాక్టులను అర్హతలేని డెయిరీలకు ఇచ్చారనేది ప్రధానంగా తేల్చిన అంశం.

అప్పటి టిటిడి బోర్డు పెద్దలు,పూర్వఅధికారుల పనితీరుపై పలురకాల ఆరోపణలు, విమర్శల నివేదికలతో ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌ను ప్రభుత్వం బదలీ చేసింది. ఇప్పుడు ఈ ప్రత్యేక కమిషన్ ఏర్పాటై, రంగంలోకి దిగితే సూత్రధారులను తేల్చాలనేది ముఖ్యసారాంశం. ఇదే జరిగితే నిబంధనలు మార్చి, కల్తీకి ఊతమిచ్చారనే అంశంలో సూత్రధారులఅరెస్టు వరకు కూడా ఈ ప్రత్యేక కమిషన్ వెనుకంజవేయదనేది హాట్‌టాపిక్‌గా మారింది. 2020-24 మధ్య కాలంలోనే లడ్డూల తయారీలో కల్తీనెయ్యి ఘటనపై టెండర్లు కేటాయించినప్పటినుండి నెయ్యి సరఫరా చేసిన రోజుల వరకు పూర్తిగా సిట్ సమగ్రంగా దర్యాప్తు చేపటికట నివేదికలు ప్రభుత్వానికి అందజేసింది. ఇంకా ఉన్న పలు అనుమానాల్లో ఉన్న వివరాలను రాబట్టేందుకు ఈ ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకానుంది. కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలకంగా మారిన కేసులో మరీ రానున్న రోజుల్లో ఎలాంటి సంచనాలు వెలుగుచూడనున్నాయనేది అటు టిటిడి వర్గాల్లో ఇటు గత బోర్డు పెద్దల్లో గుబులురేకెత్తిస్తోంది. కల్తీనెయ్యి పాపంలో సిట్ అధికారులు ఇప్పటికే పాత్రధారులైన వారందరినీ అరెస్టుచేసింది. టిటిడిలో మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగం అధికారులను కూడా నిందితులుగా పేర్కొంది. ఇద్దరు మాజీ జిఎంలను అరెస్ట్ చేసింది. ఇదే వ్యవహారంలో గతంలో టిటిడిలో కీలకంగా వ్యవహరించిన ఓ అధికారితోబాటు గత బోర్డులో కొందరు పెద్దలను తెరపైకి తీసుకురావాలనేది ప్రభుత్వం నిర్ణయం కీలకంగా మారింది.

## నకిలీ కరెన్సీ స్వాధీనం ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లాలో భారీగా నకిలీ కరెన్సీ నోట్లు పట్టుబడ్డాయి. కృత్తివెన్ను మండలం సంగమూడిలో నకిలీ నోట్లను వాటి చెలామణికి ప్రయత్నిస్తున్న వారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంగమూడిలో ఓ మద్యం దుకాణం దగ్గరికి వెళ్లిన ఓ వ్యక్తి తనకు నచ్చిన బ్రాండ్ కొన్నాడు. అందు కోసం షాపు నిర్వాహకుడికి కొంత డబ్బు చెల్లించాడు. అయితే, అది ఫేక్ నోటు అని మద్యం షాపు నిర్వాహకులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు రంజిత్ సింగ్, బ్రహ్మ ఉమాశంకర్, దిలీప్ గా గుర్తించారు. వీరి నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన దొంగ నోట్లతో పాటు ప్రింటింగ్ మిషన్, పేపర్ స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ నకిలీ నోట్ల దందా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సనాతన ధర్మాన్ని నవతరానికి అందించాలి

- సనాతన వారసత్వ సంపదకు సాంకేతికతను జోడించి కాపాడుకోవాలి
- వేదపండితులు, అర్చకుల శిక్షణాతరగతుల్లో ఇన్‌ఛార్జి ఇఒ వెంకయ్యచౌదరి



తిరుమల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: వేలాది సంవత్సరాలుగా మన పూర్వీకులు అందించిన శాస్త్రం, సంప్రదాయాలు, సనాతన వారసత్వ సంపదకు సాంకేతికతను జోడించి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. సనాతన ధర్మాన్ని నవతరానికి అందించాలన్నారు. శాస్త్రం, సంప్రదాయాలకు సాంకేతికతను జోడించి వారసత్వ సంపదను కాపాడాలని అర్చక శిక్షణా తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన అర్చక, పరిచారిక, వేదపారాయణందారుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఇఒ చౌదరి మాట్లాడుతూ టిటిడి పరిధిలోని వివిధ ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న 35 మంది అర్చకులు, పరిచారకులు, 15 మంది వేద పారాయణదారులకు మూడు రోజులపాటు పునఃశ్చరణ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు, పరిచారకులు, వేద పారాయణదారులు నిత్యం నిర్వహించే కైంకర్యాలను మరింత శుద్ధిగా, నియమబద్ధంగా నిర్వహించేందుకు ఈ పునఃశ్చరణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని చౌదరి పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని అన్నారు. ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వంటి మహనీయులు కాపాడుతూ వచ్చిన సనాతన సంప్రదాయాన్ని భక్తులకు, సమాజానికి చేరవేయడంలో ఈ శిక్షణా తరగతులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ తరగతులలో ఆగమ పరిచయం, ఆగమాలు, వైఖానసం, నిత్య పూజ విధానం, పంచ సూక్తాలు, సంధ్యావందనం, గోత్రప్రవరలు, అగ్ని ప్రతిషాపన, నవ్యశేషాంశములు, అష్టోత్తర, ఆశీర్వచన మంత్రాలు, ఉచ్చరణ సంస్కృత పరిజ్ఞానం, కల్యాణోత్సవంలో లాజహోమ ప్రధాన హోమాలు, తిరుమల శ్రీవారి ఆలయ ఉత్సవాలు, సంప్రదాయాలు, బ్రహ్మోత్సవం, అర్చకుల లక్షణాలు, విధులు, పవిత్రోత్సవం ప్రాముఖ్యత, గృహ అర్చన, బింబ ప్రతిష్ట, వైశిష్టం, జ్యోతిష్య శాస్త్రం, నిత్యార్చన, శిక్షణ నిర్ధారణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం శిక్షణ తీసుకున్న వారు ఏమి నేర్చుకున్నారు, ఇంకా ఏమి నేర్చుకోవాలో తదితర అంశాలపై ఫీడ్ బ్యాక్ సేకరించి తదనుగుణంగా మాడ్యూల్స్ రూపొందించాలని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సూచించారు. వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తితో బాటు వైఖానస భగవచ్ఛాస్త్రోక్త బ్రహ్మోత్సవానుక్రమణికా పుస్తకాన్ని ఇన్‌ఛార్జి ఇఒ ఆవిష్కరించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన మానవ నిత్య జీవితంలో వేదాల విశిష్టతను, యోగా ప్రాముఖ్యత తెల్పేలా ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని తిలకించారు. తిరుమల ఆలయ తరహాలో టిటిడిలోని అన్ని ఆలయాలలో కైంకర్యాలు నిర్వహించేందుకు వీలుగా టిటిడి ఆధ్వర్యంలోని 61 ఆలయాలలో పనిచేసే అర్చక, పరిచారిక, వేదపారాయణందారులకు ఈ శిక్షణ ఉపయోగపడనుందన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి వైఖానస ఆగమ సలహాదారు డాక్టర్ భావనారాయణాచార్యులు, ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని, వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు, శ్వేత ఇంఛార్జ్ డైరెక్టర్ సువర్ణమ్మ, డిప్యూటీ ఇఒ (జనరల్ ) ఏ. శివప్రసాద్ ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

వార్త

మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైన విషయమో తెలుస్తుంది.

-జాకబ్ బ్రౌడీ

# ఈ ఒప్పందం ఉభయ తారకమేనా?

ట్రంప్ మనసు మారింది. భారత ప్రధాని నరేంద్ర మోడీని ప్రసన్నం చేసుకునేందుకు ఆయనే ముందడుగు వేసి తానే ప్రసన్నమయ్యారు. ఇంతకు ముందు భారత్‌పై అక్కసుతో వేసిన ప్రతీకార సుంకాలను తగ్గించారు. భారతీయ ఉత్పత్తులపై సుంకాలను 18 శాతానికి తగ్గించడం విశేషం. తనకూ భారత్ ప్రధానికి మధ్య జరిగిన ఒప్పంద విశేషాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సొంత ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. వీరి సంభాషణల పర్యవసానంగా అమెరికా ఉత్పత్తులపై భారత్ వసూలు చేస్తున్న సుంకాలు దశలవారీగా 'సున్నా'కు తగ్గిస్తామని హామీ లభించింది. ఈ నేపథ్యంలోనే ఇరుపక్షాల మధ్య సానుకూల వైఖరితో ఈ రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి ముందడుగు పడింది. అమెరికా నుండి భారత్ సాలీనా రూ. 45.5 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకుంటోంది. వీటిపై సుంకాలు లేకుండా చేయాలని, అప్పుడే భారత్ మార్కెట్‌లో అమెరికా ఉత్పత్తుల విక్రయాలు పుంజుకోగలవని ట్రంప్ ఆశ. అది నెరవేరినట్లే ఉంది. ఈ వాణిజ్య ఒప్పంద నేపథ్యంలో ఇరు దేశాల అగ్రనేతలూ ఒకరినొకరు పరస్పరం అభినందించుకున్నారు. 140కోట్ల మంది భారతీయుల తరపున ట్రంప్‌కు ప్రధాని మోడీ హృదయ పూర్వక అభినందనలు తెలియచేస్తే, ట్రంప్ కూడా తనకు మోడీతో ఉన్న స్నేహాభిలాషను సైతం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాలు కలిసి పనిచేస్తూ అద్భుతమైన మేలు ఆయా దేశాల ప్రజలకు కలుగుతోందని, పరస్పర ప్రయోజనాలకు మార్గంసుగమం చేస్తుందని భారత ప్రధాని అంటున్నారు. ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ శాంతి కోసం ట్రంప్ నేతృత్వం అవసరమనీ పొగిడారు. ఒకపక్క ట్రంప్ రష్యా, ఉక్రెయిన్, ఇరాన్, ఇజ్రాయెల్, వంటి దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల విషయంలో వైరుధ్య భావనలతో వ్యవహరిస్తున్నా భారత్ మాత్రం చాణక్యనీతిలో ఆయన శాంతి కోసం చేసే అన్ని ప్రయత్నాలకు మద్దతు ప్రకటించింది. భారత్ వాణిజ్య ఒప్పందం వేళ, ట్రంప్,రష్యాతోవ్యాపార నిరోధకతపై భారత్‌పై ఒత్తిడి తెచ్చారు. అందువల్లనే భారత్ అమెరికాల మధ్య ఒప్పందానికి వీలుపడినట్లు భావించాల్సి వస్తోంది. రష్యా చమురు ఇండియా కొనకూడదని అమెరికా ఆంక్ష. తమ వ్యవసాయ ప్రయోజనాలకు భంగకరమైన ఎలాంటి షరతులను తాము అంగీకరించబోమని భారత్ ఇన్నాళ్లూ భీష్మించుకు కూర్చొంది. కానీ ఇప్పుడా ఒప్పందం జరిగిందనీ, ఇరుదేశాలూ పరస్పరం సంతోషం వ్యక్తం చేశారంటే వాటి విషయంలో రాజీపడి వెనక్కితగ్గారా!అనే అంశాలపై పూర్తి స్పష్టతరావాల్సి ఉంది. రష్యా చమురు కొనుగోలు నిలిపి వేసి అమెరికా, వెనెజులా నుంచి చమురు కొనుగోళ్లు చేసే విషయమై ప్రధాని మోడీ సానుకూల వైఖరితో ఉన్నారని ట్రంప్ తన సోషల్ మీడియాలో సుదీర్ఘ సందేశాన్ని ఉంచారు. రష్యా చమురు కొనుగోలు ద్వారా భారత్ రష్యాఉక్రెయిన్‌లమధ్య యుద్ధానికి ఆర్థికంగా తోడ్పడుతోందని ఆది నుంచీ భారత్ మీద ఆరోపణలు గుప్పిస్తున్న ట్రంప్ మాత్రం ఇప్పుడు తనప్రకటనలో తాజా నిర్ణయాలు ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు తోడ్పడతాయంటూహర్షం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేసే వాటిలో బొగ్గు, సాంకేతికత వ్యవసాయ ఇతర ఉత్పత్తులున్నట్లు, అందుకు భారత్ ప్రధాని నుంచి హామీ తీసుకున్నట్లు ట్రంప్ చెబుతున్నారు. ఈ ఒప్పందంలో ఎవరివలన ఎవరికి ఎన్నెన్ని ప్రయోజనాలున్నాయో, ఏ దేశ వాణిజ్యానికి ఎంతవరకు లాభం కలిగిందో ప్రభుత్వమే ప్రకటిస్తే తప్ప సామాన్య ప్రజానీకానికి అర్థంకాదు. ఇరుదేశాల మధ్యసంబంధాలకు ఇక ఆకాశమే హద్దుఅని అమెరికా రాయబారి సెర్గియోగోర్ ఈ డీల్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. టెక్స్‌టైల్, ఫార్మా షేర్లు దూసుకుపోతున్నాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పెరిగింది. ఈ ఒప్పందాన్ని ట్రంప్ మార్కు 'ఆర్ట్ ఆఫ్ డీల్'గా గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా మారుస్తుందని విదేశీపత్రికలు వ్యాఖ్యానిస్తున్నాయి. ట్రంప్ మార్కు సుంకాల యుద్ధానికి, దౌత్యపరమైన ఉద్రిక్తతలను ఈ ఒప్పందం ముగింపు పలుకుతుందని మరి కొన్ని విదేశీ పత్రికలు విశ్లే షిస్తున్నాయి. ఈ ఒప్పందంలో భారత్‌లో టెక్ హార్డ్‌వేర్ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి. ల్యాప్‌టాప్‌లు, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ఇతర గ్యాడ్జెట్లు చౌకగాలభించే అవకాశముంది. ప్యాకేజ్ గూడ్స్, ప్రాసెస్‌డ్, గృహోపకరణాల దిగుమతి ఖర్చులు తగ్గుతాయి కనుక వాటి ధరలు కూడా సరసమైనవిగా ఉంటాయి. పప్పుధాన్యాలు, పాల ఉత్పత్తులువంటి వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గుతాయి. భారతీయ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలకు అమెరికాలో ఎగుమతుల వలన విక్రయాల స్థాయి పెరుగుతుంది. భారత్‌నుంచి భారీగా ఎగుమతయ్యే రత్నాలు ఆభరణాల రంగానికి లాభసాటికానుంది. ప్రధాని ఆలోచనల ప్రకారం విదేశాల్లో కూడా 'మేడ్ ఇన్ ఇండియా'కు కొత్త ఊపు రానుంది. గత యేడాది ద్వితీయార్థంలో ట్రంప్ అవలంబించిన సుంకాల వడ్డనప్రభావంతో చిన్న,మధ్యతరహా పరిశ్రమల రంగంభారీగా దెబ్బతింది. ఈ దశలో అమెరికాతో ఒప్పందం ఖరారైన వేళ మళ్లీ పరిశ్రమల రంగం పుంజుకునే అవకాశంఉంది. ఇంతవరకు ఏకపక్షంగా ట్రంప్‌నుంచి మాత్రమే ఒప్పంద విషయాలు బయటకు వచ్చాయి. తాజాగా భారత్ ఒప్పంద వివరాలపై ఇచ్చిన క్లారిటీచూస్తే మరోల ఉంది. వ్యవసాయ ప్రయోజనాలకు ఇబ్బందికరమైన ఏ షరతునూ తాము పాటించబోమని ఇండియా స్పష్టంగా ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామం.

ఎవరిని ప్రశ్నిస్తున్నాం అన్నది గొప్ప విషయం కాదు. ఎవర్ని నిందిస్తున్నాం అనేదే బాధాకరమైన విషయం.



విలియం ఆస్లర్

నొప్పించే మాటలు, అసూయ, దురాశ, కోపం వంటి దుర్లక్షణాలు మానండి. అదే న్యాయ సంగతమైన మార్గం అవుతుంది.



తిరువళ్ళువర్

# అభ్యంతరకర భాషతో రాజకీయ విలువలు పతనం!

*గతంలో ఎప్పుడూ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ పార్టీల నేతల మధ్య కనపడని విద్వేషాలు, ఫలితంగా వారి నోటివెంట వస్తున్న దుర్భాషలు రాజకీయ పార్టీల నేతలపై సామాన్య ప్రజలకు సైతం వెగటుని కలిగిస్తున్న మాటనిజం. ఎందుకంటే పన్నెండేళ్ళ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి చేసిందెవరో, చేస్తున్నదెవరో అంతిమ లబ్ధిదారులైన ప్రజలకుతెలియకుండా ఎలాఉంటుంది? ఒకవేళ అభివృద్ధి జరగకపోతే దానికి కారణమైన, కారణమోతున్న వారిపాలనా విధానాలను శాస్త్రీయంగా ఎండగట్టకుండా ఎదుటి వారిపై బాడీషేమింగ్‌తో, వారిని దుర్భాషలాడడంతో ప్రజల అభిమానాన్ని ఎలాచూర గొంటారో, దానిని ఎలా ఓటు బ్యాంకుగా మార్చుకొని రాజ్యాధికారాన్ని, సుస్థిరం చేసుకుంటారో బోధపడడం లేదు.*



డాక్టర్ నీలం సంపత్

డెబ్భై ఎనిమిది సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో గతంలో ఎప్పుడు లేని విధంగా రాజకీయ నాయకులు ఒకరిపై మరొకరు రాజకీయ ఆరోపణలూ, ప్రత్యారోపణలు చేసుకుంటున్న సందర్భాల్లో విధానాలపై విమర్శలకు తిలోదకాలొదిలి వ్యక్తిత్వ హననమే ప్రధానంగా ప్రదర్శిస్తున్న హావభావాలు ,ఉచ్చరిస్తున్న భాషను వివిధ టెలివిజన్ ఛానెళ్లలో చూడడానికి, వినడానికి,అదేవిధంగా పత్రికల్లో చదవడానికి ప్రజలు అయిష్టాన్ని ప్రదర్శించడమే కాదు, అసహ్యించుకుంటున్నారని చెప్పక తప్పదు. దశాబ్దాల తరబడి ప్రజా జీవితంలో ఉన్న నేతలు, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల నిర్ణయాన్ని శిరసావహిస్తూ దశాబ్దాల పాటు అధికారాన్ని అనుభవించిన నేతలు, అదే క్రమంలో నేడు కూడా అధికారం లో కొనసాగుతున్న నేతలు, మరోవైపు ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో ఏవో కారణాల నేపథ్యంలో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేక అధికారానికి దూరమైన నేతలు పరస్పరం ఒకరినొకరు దూషించుకుంటూ దుర్భాష లాడుకుంటున్న వైనంతో ప్రజా జీవితంలో రాజకీయ నాయకులు వాడుతున్న భాష పట్ల మెజారిటీ ప్రజలు ఆందోళన చెందుతున్న మాట వాస్తవం. అధికారంలోవున్న వారైనా, అధికారానికి దూరమైన వారైనా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల అభీష్టంతోనే రాజ్యాంగబద్ధంగా ఎన్నికై ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్న వారే కాబట్టి ఒకరు మరొకరిని ఉద్దేశించి మాట్లాడే సందర్భాల్లో ఉచ్చరిస్తున్నభాష ఆ నేతలనేకాకుండా వారిని తమ ప్రతినిధులుగా ఎన్నుకున్న ప్రజలను సైతం గాయపరుస్తుందనే లాజిక్‌ని ఎలా మరిచిపోతున్నారో అర్థం కావడం లేదు. రెండు వందల సంవత్సరాల బ్రిటిష్ సామ్రాజ్య వాదులను మన దేశం నుండి తరిమి కొట్టే క్రమంలో స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు సైతం విదేశీ పాలకులను ఈ తరహా దుర్భాష లాడలేదు. నిజానికి చరిత్రలో సభ్య సమాజం చదవడానికి, వినడానికి,చూడడానికి, అసహ్యించుకునే భాషతో ప్రపంచంలో ఎవ్వరూ రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోలేదు. అదే విధంగా ప్రజల హృదయాలను గెలుచుకునే పాలనా విధానాలతో తప్ప కేవలం విపక్ష పార్టీల నేతలను దుర్భాష లాడడం ద్వారా ఏ అధికార పార్టీ తన అధికార పీఠాన్ని సుస్థిరం చేసుకున్న దాఖలాలూ చరిత్రలో లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలోనూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రజలకు నీళ్లూ, నిధులూ, ఉద్యోగాలూ, ఉపాధి కల్పన పరంగా, రాజకీయ అధికార పరంగా అన్యాయం జరుగుతుందంటూ ఆనాటి పాలకులు అవలంబించిన పాలనా విధానాలను ఉచ్ఛస్వరంతో ప్రశ్నించారే తప్ప రాజకీయ నాయకుల వ్యక్తిత్వ హననం చేసే భాషను ఎవరూ ఉపయోగించలేదు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిన సందర్భం లో తెలంగాణ రాష్ట్ర ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను బలీయం చేసే క్రమంలో ఉద్యమ నేతలు అప్పుడప్పుడూ, సందర్భోచితంగా తెలంగాణ మాండలికంలో కొన్ని పరుష పదాలను ఉపయోగిస్తూ ఉద్యమ ఉధృతిని పెంచిన మాట నిజమేయైనా ఆ మాటలు ఏనాడూ నైతిక విలువల సరిహద్దులు దాటలేదనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయి రెండు ప్రత్యేక రాష్ట్రాలుగా ఆవిర్భవించిన తర్వాత ఇటు తెలంగాణ రాష్ట్రంలో,అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నేతలు ఆయా రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కవసరమైన ప్రణాళికలను రచించి ముందుకు సాగడానికి కంకణ బద్ధులు కావాలని ఆయా రాష్ట్రాల ప్రజలు కోరుకు



న్నారు. అందుకోసం రాజ్యాంగ నిబంధనలననుసరించి చట్ట సభల లోపలా, బయట కూడా ప్రతిపక్ష పార్టీలు ప్రజల పక్షాన నిలిచి పాలక ప్రభుత్వ పాలనా విధానాలలో లోపాలను ఎత్తి చూపుతూ ప్రతిపక్షంగా తన నిబద్ధతను ఋజువు చేసుకోవాలనేది కూడా ప్రజల ఆకాంక్షయేనని చెప్పక తప్పదు. ఐతే రెండు రాష్ట్రాలలోనూ ఆయా రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికవసరమైన పాలనా విధానాలను అమలు పరుస్తూ ముందుకు సాగుతున్నామని పాలక పక్షాలు, అదేమీ లేదు విధ్వంసానికి ఊపిరులూదుతున్నారని విపక్షాలుతమ సొంత మీడియా ఏజెన్సీలతో పాటు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఆరోపణలూ, ప్రత్యారోపణలు చేసుకుంటున్న క్రమంలో విధానాలపై విమర్శల పర్వంలో నైతిక విలువల లక్ష్మణ రేఖను దాటి పరస్పరం వ్యక్తిత్వ హననానికిపూనుకుంటున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ఈ కారణంతోనే గతంలో పొరుగు రాష్ట్రంలో ఆనాటి మాజీ ముఖ్యమంత్రి క్రియా శీల రాజకీయాలతో సంబంధమే లేని తన కుటుంబ సభ్యురాలిపై ఆనాడు అధికార పక్ష నాయకుడూ,ఆయన మంత్రివర్గ సహచరులూ చేసిన వ్యక్తిత్వ హననం చేస్తూ చేసిన ఆరోపణలకు వ్యథతో కన్నీళ్ల పెట్టుకుని మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉన్న వైనం బహిరంగ రహస్యమే. చట్ట సభలలోనే ఇలాంటి దురదృష్టకర పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇక ప్రజా జీవనంలో ఒకరిపై మరొకరు చేసుకుంటున్న వ్యక్తిగత ఆరోపణలు, ప్రత్యారోపణల్లో రోతలు, బూతులతో కూడిన భాష ఏస్థాయిలో కంపరం పుట్టిస్తుందో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. ఈ నేపథ్యంలోనే నిన్నటికి నిన్న పొరుగు రాష్ట్రంలో ఓ మాజీ మంత్రి ప్రస్తుత ముఖ్యమంత్రినీ, ఆయన రాజకీయ పార్టీని దుర్భాషలాడినాడనే కారణంతో ఆయనపై బి.యస్.యస్‌లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం అభియోగాల్ని నమోదు చేసి అరెస్ట్ చేసిన వైనం తెలిసినదే. అంతటితో ఆగకుండా అధికారపార్టీకి సంబంధించిన శ్రేణులు దుర్భాషలాడిన నేతపై, ఆయన ఆస్తులపై భౌతిక దాడులకు ప్రయత్నించిన వైనాన్నినిరసిస్తూ ప్రతిపక్ష పార్టీల శ్రేణులు సైతం భౌతిక దాడులకు పాల్పడే ప్రయత్నం చేస్తే అది సామాజిక విచ్ఛిత్తికి దోహదం చేసే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం. ఈ తరహా దుర్భాషల పర్వం గతంలోనూ కొనసాగిందనీ,దానికి ప్రతిక్రియగా రెడ్‌బుక్ ఓపెన్ చేసి తగు చర్యలనుతీసుకుంటున్నామంటున్న ప్రస్తుత పాలకులు మళ్లీ అధికారాన్నికోల్పోతే రాబోయే కాలంలో మరో బుక్ ఓపెన్ కాక తప్పదేమో?ఈ బుక్కుల అమలుని పర్యవేక్షించే పోలీసుశాఖపై సైతం దుర్భాషలు,బెదిరింపులు పెచ్చు మీరుతుండడం రాజ్యాంగ విరుద్ధమే. ఇలా బుక్కుల పరంపరను కొనసాగించకుండా అన్ని రాజకీయ పార్టీల నేతలు రాజ్యాంగ పుస్తకానికి అనుగుణంగా వ్యవహరిస్తే ఏ బుక్కుల అవసరం రాదు గదా ననే బుద్ధిజీవుల అభిప్రాయాన్ని గౌరవించాల్సిందే. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన 2014 వ సంవత్సరం నుండి 2024 డిసెంబర్ వరకు రాష్ట్రంలో అధికారమార్పిడి జరిగేవరకు రాష్ట్రంలో విపక్ష మనేది నామమాత్రంగా మిగిలిపోయిన వైనం బహిరంగ రహస్యమే. ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో అధికార, విపక్షాలకు చెందిన రాజకీయనాయకుల మధ్య పెద్దగా ఆరోపణలూ, ప్రత్యారోపణలు చోటు చేసుకోలేదనే సత్యం జీర్ణించుకోకతప్పదు. నిజానికి 2024 డిసెంబర్‌లో రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుండే రాజకీయ ఆరోపణలూ, ప్రత్యారోపణల చిటపటలు రాజుకోవడం ప్రారంభమైంది. తొమ్మిదేళ్ల పైచిలుకు పాలనలో తెలంగాణను తాము ఎంతో అభివృద్ధి చేసామని గత పాలకులు,లేదు లేదు గత పాలకులే మిగులు రాష్ట్రంగా పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ప్రస్తుత పాలకులు చట్ట సభల లోపలా బయట ఎలుగెత్తుతున్న నేపథ్యంలో అధికార,విపక్ష పార్టీల నేతల మధ్య రాజకీయ ఆరోపణలూ,ప్రత్యారోపణలూ వెల్లువెత్తుతున్న క్రమంలో ఉపయోగిస్తున్న భాష అత్యంత అభ్యంతరకరంగా మారుతున్న వైనం దురదృష్టకరమే. గతంలో ఎప్పుడూ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ పార్టీల నేతల మధ్య కనపడని విద్వేషాలు, ఫలితంగా వారి నోటివెంట వస్తున్న దుర్భాషలు రాజకీయ పార్టీల నేతలపై సామాన్య ప్రజలకు సైతం వెగటుని కలిగిస్తున్న మాటనిజం. ఎందుకంటే పన్నెండేళ్ళ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి చేసిందెవరో, చేస్తున్నదెవరో అంతిమ లబ్ధిదారులైన ప్రజలకుతెలియకుండా ఎలాఉంటుంది?ఒకవేళ అభివృద్ధి జరగకపోతే దానికి కారణమైన, కారణమోతున్న వారిపాలనా విధానాలను శాస్త్రీయంగా ఎండగట్టకుండా ఎదుటి వారిపై బాడీషేమింగ్‌తో, వారిని దుర్భాషలాడడంతో ప్రజల అభిమానాన్ని ఎలాచూర గొంటారో,దానిని ఎలా ఓటు బ్యాంకుగా మార్చుకొని రాజ్యాధికారాన్ని, సుస్థిరం చేసుకుంటారో బోధపడడం లేదు. •

# కేంద్ర బడ్జెట్‌లో గ్రహాంతర పరిశోధనలకు పెద్దపీట

సి.హెచ్.ప్రతాప్

భారతదేశాన్ని అంతరిక్ష అగ్రగామిగా నిలబెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం 2026-2027 బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంది. అంతరిక్ష విభాగం కోసం భారీగా నిధులను కేటాయించడమే కాకుండా, సాంకేతిక అభివృద్ధి,గ్రహాంతర పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ ఏడాది బడ్జెట్‌లో అంతరిక్ష విభాగానికి 13,705.63 కోట్లను కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 2.16 శాతం పెరుగుదలగా కనిపిస్తున్నప్పటికీ, సవరించిన వ్యయ అంచనాలతో పోల్చి చూస్తే దాదాపు 10.1శాతం పెరుగుదలను నమోదు చేయడం విశేషం. ఇది భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టబోయే ప్రతిష్టాత్మక మిషన్లకు కొత్తఉత్తేజాన్ని ఇస్తోంది. ఈ బడ్జెట్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశం మూలధన వ్యయం. హార్డ్‌వేర్ తయారీ, కొత్త మిషన్ల అభివృద్ధి కోసం మూలధన వ్యయాన్ని గత ఏడాదితో పోలిస్తే 20 శాతం మేర పెంచారు. దీనివల్ల అత్యాధునిక ఉపగ్రహాల తయారీ, శక్తివంతమైన రాకెట్ ఇంజిన్ల అభివృద్ధి, ప్రయోగ కేంద్రాల ఆధునీకరణ వేగవంతం కానుంది. చంద్రుడిపైకి మనుషులను పంపే గగన్‌యాన్ వంటి భారీప్రాజెక్టులతో పాటు,ఇతర గ్రహాలపై పరిశోధనలు చేసే ప్లానెటరీ సైన్స్ విభాగానికి ఈ నిధులు వెన్నుదన్నుగా నిలవనున్నాయి.సాంకేతికతనుస్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడంద్వారా అంతర్జాతీయ అంతరిక్ష వాణిజ్యంలో భారత్‌తనవాటాను పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, నిధుల వినియోగం విషయంలో కొన్నిసవాళ్లు కూడా కనిపిస్తున్నాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతరిక్ష విభాగం తనకు కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించుకోలేకపోయింది. దాదాపు రూ.970 కోట్ల నిధులు నిరుపయోగంగా మిగిలిపోవడంపై ఆర్థిక నిపుణులు చర్చలు జరుపుతున్నారు.ప్రభుత్వం నిధులను పెంచుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల అమలులో ఎదురయ్యే సాంకేతిక లేదా పరిపాలనాపరమైన జాప్యాల వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది.భవిష్యత్తులో కేటాయించిన నిధులను నిర్ణీత కాలంలో వినియోగించుకోవడం ద్వారా మాత్రమే దేశం ఆశించిన లక్ష్యాలను చేరుకోగలదు. ఈ లోటును భర్తీచేస్తూ రాబోయే కాలంలో మరింత వేగంగా ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. గ్రహాంతర పరిశోధనల రంగంలో భారత్ తన పరిధిని విస్తరిస్తోంది. చంద్రయాన్ విజయాల తర్వాత, అంగారకుడు,శుక్రుడిపైకి చేపట్టబోయే పరిశోధనలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించింది.గ్రహాల పుట్టుక, అక్కడి వాతావరణ పరిస్థితులు, జీవరాశి ఉనికిపై లోతైన అధ్యయనాలు చేయడానికి అత్యాధునిక పరికరాల తయారీకి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది కేవలంపరిశోధనలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత వనరుల అన్వేషణకు కూడా పునాది వేయనుంది.యువశాస్త్రవేత్తలలో అంతరిక్ష విజ్ఞానంపట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వ తీసుకుంటున్న ఈ చర్యలు ఎంతో తోడ్పడతాయి. •

# ప్రజావాక్కు



## పర్యావరణాన్ని కాపాడుకోవాలి

చలికాలంలో చెట్ల ఆకులు రాలిపోయి ఉగాది నాటికి కొత్త చిగుర్లు వస్తాయి. చెట్లనుంచి రాలిపోయిన ఆకులను అనేకులు తగలబెడుతూ పర్యావరణానికి హాని చేకూరుస్తున్నారు. రాలిన ఆకులు తేలికగా భూమిలో కలిసిపోయే పూర్తి పర్యావరణ హితమైనవి. రాలిన ఆకులను వ్యర్థం చేయకుండా తిరిగి ఉపయోగిస్తే ప్రయోజనమే కాక పర్యావరణానికి పాటుపడిన వాళ్ళంఅవుతాం. రాలిన ఆకులను నీటిలో కొన్ని రోజులు నానబెట్టి సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చు. రాలిపోయిన ఆకులను చెట్ల మొదళ్లలో వేయటం వల్ల చెట్లకు పోసిన నీరు గాలిలో త్వరగా ఆవిరి కాకుండా చెట్లకురక్షణగా ఉంటాయి.రాలినఆకులను కొన్ని రోజులు ఎండబెట్టి పొడిగా చేసి కూడా చెట్లకు ఎరువుగా మార్చవచ్చు. రాలిపోయిన ఆకులను సేకరించి ఎరువులుగామార్చేస్వచ్ఛంధ సంస్థలు అందుబాటులో ఉన్నాయి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## కోచ్‌ల తయారీ కేంద్రం

ఈసారి బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్నది కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు.అందులో ముఖ్యంగా హైదరాబాద్ చెన్నై,హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ పూణే ప్రాజెక్ట్స్ తెలంగాణకు పచ్చలాహారం లాగా ఉంటాయి సందేహంలేదు. ఇకశంషాబాద్ కేంద్రంగా ఫామ్ అయ్యే రైల్వే టర్మినల్ ఒక మహోజ్వల గట్టం పూర్తి స్థాయిలో కనుక వినియోగంలోకి ఈ ప్రాజెక్ట్ వస్తే మూడవ రంగం అయినా సేవలరంగం పెద్దమొత్తంలో అభివృద్ధి చెందుతుంది. దానితోపాటు సెమీ హైస్పీడ్ కోచ్‌ల తయారీ కేంద్రాన్ని కనుక తెలంగాణలో ఫామ్ చేస్తే ఇక తెలంగాణలో సంఘటితరంగంలోకార్మికులసంఖ్యపెరిగేఅవకాశం ఉంది.

- భారత అవినాష్, జనగామ

## ముసలి తల్లిదండ్రులు - మన బాధ్యత

మన జీవితానికి మొదటి గురువులు తల్లిదండ్రులు.మన కోసం వారు తమ కష్టాలను మరిచి, నిద్రలేని రాత్రులు గడిపారు.మన ఉన్నతియే వారికల,మన ఆనందమే వారి సంతోషం.ఈరోజు విద్య,ఉద్యోగాల పేరుతో అనేక మంది పిల్లలు ఇతర రాష్ట్రాలకు,విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. అది తప్పుకాదు. కానీ ఆ ప్రయాణంలో మన జన్మకు కారణమైన తల్లిదండ్రులను విస్మరించడం అన్యాయం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలి

వేసవికాలం ప్రారంభమైతున్న నేపథ్యంలో భవిష్యత్తు కాలంలో ఎండల తీవ్రత ఉండే అవకాశం ఉంది. కావునా ప్రతి చుక్కనీటి బొట్టును చూసి వాడుకోవాలి. లేదంటే గతంలో నీటి ఎద్దడికి ఎంత ఇబ్బంది పడ్డామో మన అందరం చూసి అనుభవించిన సమస్యనే. సాధారణంగా ఈసంవత్సరం వర్షాలు, చల్లి, ఎక్కువగానే ఉన్నందున ఎండలు కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. జీవరాసులన్నింటికీ జలం అవసరమే కావునా ప్రభుత్వాలు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్న ప్రతి ఇంటికి మాత్రం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది అనేచెప్పవచ్చు. అడవి ప్రాంతంలో కుంటలు చెరువులను పునర్ నిర్మిచడంలో ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. ప్రభుత్వ చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూలు జిల్లా

## గతుకుల రోడ్లు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దీర్ఘకాలిక ప్రణాళికల్ని చూపిస్తూ,'సామాన్యులు ప్రస్తుతానికి ఇలాగేసర్దుకోండి' అన్నట్టు ఉంది. ఆర్థికసర్వే ప్రకారం దేశ ఆర్థికవ్యవస్థ నిలకడగా, పటిష్టంగా ఉంది కనుక ఆ ప్రభావంతో బడ్జెట్‌లో ప్రజలకు నేరుగా మంచి ప్రయోజనాలు ఉండొచ్చని ఆశించిన వారికి భంగపాటు. ద్రవ్యలోటుని అదుపులో ఉంచడం,రానున్న రోజుల్లో స్థూల ఆర్థిక వ్యవస్థను బలీయంగా ఉంచడానికి ప్రయత్నించడమన్నవి ప్రాధాన్యతలుగా మారి,సంక్షేమం,ఆర్థిక సమానత్వంతో కూడిన వృద్ధి అన్నవి వెనకబడ్డాయి ఈసారి. జన సామాన్యానికి కొత్త పథకాలు, అభయం ఇచ్చే హామీలు, కేటాయింపులు లేవు. దేశీయ మౌలిక వసతులు ఏర్పాటు, పరిశ్రమలకు ఊతం కల్పిస్తూ మూలధన వ్యయం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఆ దిశగా 12 లక్షల కోట్లు ప్రతిపాదన చేయడం ఇదే మొదటిసారి.

- డా. డి.వి.జి.శంకర రావు, పార్వతీపురం

## దిగజారిపోయిన ఇ.డి ప్రతిష్ట

కేంద్రంలో పనిచేస్తున్న బిజెపి ప్రభుత్వంఇడిని గుప్పెట్లో పెట్టుకొనిఆడిస్తోందని తమపై ఆసంస్థను ఉసిగొల్పుతోందని దర్యాప్తు అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని వేధింపులకి గురి చేస్తున్నారని ఇ.డి విచారణను ఎదుర్కొన్న ప్రతిపక్ష నాయకులు అంటుంటారు. సామాన్య ప్రజలు కూడా దర్యాప్తు సంస్థపై అదే అభిప్రాయంతో ఉన్నారు. ఈమధ్య సుప్రీంకోర్టు కూడా ఇ.డి.ని ఆక్షేపించిఅక్షింతలు వేసింది.ఆసంస్థ పనితీరుని తప్పు పట్టింది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

# సురక్షిత భవిష్యత్తుకు ప్రణాళికలు తప్పనిసరి



డా. సునీల్ కుమార్ పోతన

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉండటానికి ప్రతి దేశం స్వీయ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలి. ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలను రెండు డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పరిమితం చేయాలి. పారిశ్రామిక పూర్వస్థాయిల కంటే1.5 డిగ్రీల సెల్సియస్ వైపు ప్రయత్నాలను కొనసాగించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను ఒక దేశం ఎలా తగ్గించాలో ఆ దేశం జాతీయంగా నిర్ణయించుకున్న సహకారాల (నేషనల్లీ డిటెర్మైన్డ్ కాంట్రిబ్యూషన్స్ ఎన్‌డిసి)తో తెలుస్తుంది. 2035 వరకు ఉద్దేశించిన వాతావరణ చర్యలను ఇవి వివరిస్తాయి. పారిస్ ఒప్పందం ప్రకారం ప్రతి దేశం తమ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రతి ఐదుసంవత్సరాలకు ఒకసారి జాతీయంగా నిర్ణయించుకున్న సహకారాలను మరింత ఎక్కువ ఆశయంతో నవీకరించాలి. ప్రజలకు సురక్షితమైన భవిష్యత్తును నిర్ధారించడానికి దేశాలు మరింత ప్రతిష్టాత్మకమైన జాతీయంగా నిర్ణయించుకున్న సహకారాలను అందించడం చాలా కీలకం. అన్నిదేశాలు జాతీయంగా నిర్ణయించిన సహకారాలను,వాతావరణ కార్యాచరణ ప్రతిజ్ఞలను ఐక్యరాజ్యసమితికి అందించాయి. భారతదేశం అక్టోబర్ 2016లో పారిస్ ఒప్పందాన్ని ఆమోదించింది. అభివృద్ధి ప్రాధాన్యతలను, పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను సమతుల్యం చేస్తూ ప్రతిష్టాత్మక వాతావరణ లక్ష్యాలను పెట్టుకుంది. భారతదేశానికి మూడుప్రధాన పరిమాణాత్మక లక్ష్యాలు ఉన్నాయి.అటవీ విస్తీర్ణంతో 2.53 బిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలకు సమానమైన అదనపు కార్బన్ సింక్‌ను సృష్టించాలి. కార్బన్ సింక్ అంటే వాతావరణం నుండి విడుదలయ్యే దానికంటే ఎక్కువ కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని, నిల్వచేసే సహజమైన లేదా కృత్రిమమైనవ్యవస్థ. ఉద్గార తీవ్రతను 33.35శాతానికి తగ్గించాలి. శిలాజేతర ఇంధన వనరుల నుండి సంచిత విద్యుత్ శక్తి స్థాపిత సామర్థ్యంలో దాదాపు 40శాతం సాధించాలి. విద్యుత్, రవాణా, పరిశ్రమ, వ్యవసాయం,భూవినియోగం, వ్యర్థ రంగాలలో ఉపశమన ప్రయత్నాలను ఈలక్ష్యాలు సూచిస్తాయి. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో నవంబర్ 2021లో జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ పార్టీల ముఖ్యమైన వార్షిక వాతావరణ శిఖరాగ్ర సమావేశం (సిఒపి)26వ సదస్సు లక్ష్యాలను బలోపేతం చేసి లక్ష్యాలను నవీకరించింది. 2005 స్థాయిలతో పోలిస్తే 2030 నాటికి దాని ఉద్గారాల తీవ్రతను 45శాతం తగ్గించాలి. 2030 నాటికి శిలాజేతర ఇంధన ఆధారిత ఇంధన వనరుల నుండి దాదాపు 50శాతం సంచిత విద్యుత్‌శక్తి స్థాపిత సామర్థ్యాన్ని సాధించాలి. 2070 నాటికి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను పూర్తిగా తగ్గించాలని దీర్ఘకాలిక లక్ష్యాన్ని భారతదేశం పెట్టుకుంది. భారతదేశం తన వాతావరణ ప్రతిజ్ఞలవైపు గణనీయమైన పురోగతిని సాధించింది. నిర్ణీత కాలసమయం కంటే



ముందే అనేక కీలక మైలురాళ్లు సాధిస్తోంది. ప్రస్తుత విధానాల ప్రకారం 2030 నాటికి ఇంధన రంగ ఉద్గారాల తీవ్రతలో 48.57 శాతం తగ్గింపు సాధ్యమని పలు స్వతంత్ర సంస్థలు అంచనా వేస్తున్నాయి.భారత అటవీ సర్వేక్షణఅంచనాల ప్రకారం భారతదేశం మొత్తం అటవీ కార్బన్ నిల్వలు 2005లో సుమారు 28.14 బిలియన్ టన్నులుగా ఉంది. 2023లో సుమారు 30.43బిలియన్ టన్నులకుపెరిగాయి. ఈ అంచనాల ప్రకారం ఇది 2030నాటికి సుమారు31.71 బిలియన్ టన్నులకు పెరగొచ్చు. తద్వారా అదనంగా 2.53 బిలియన్ టన్నుల సింక్‌ను సృష్టించాలనే జాతీయంగా నిర్ణయించుకున్న సహకారాల లక్ష్యానికి చేరువవుతుంది.అత్యంత ప్రముఖ విజయాలలో ఒకటి శిలాజయేతర ఇంధన విద్యుత్ సామర్థ్యం విస్తరణ. భారతదేశం తన 2030 లక్ష్యానికిఐదేళ్ల ముందే మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం సౌర, పవన, జల, అణుశక్తి వంటి శిలాజయేతర ఇంధన వనరుల నుండి పొందే మైలురాయిని చేరుకుంది. 2025 మధ్యనాటికి, భారతదేశం మొత్తంస్థాపిత విద్యుత్ సామర్థ్యం 500 గిగావాట్లు దాటింది. పునరుత్పాదక ఇంధనమంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం ఇందులో 256 గిగావాట్ల కంటే ఎక్కువ సామర్థ్యం శిలాజయేతర ఇంధన వనరుల నుండి వస్తుంది. ఇది స్వచ్ఛమైన విద్యుత్‌వైపు గణనీయమైన మార్పును ప్రతిబింబిస్తుంది. భారతదేశ పరివర్తనలో విధానపరమైన మద్దతు, వ్యయతగ్గింపులు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో సౌర, పవన విద్యుత్ కీలకంగా మారాయి. భారతదేశం వేగవంతమైన సౌరశక్తి విస్తరణ ప్రపంచంలోనిప్రముఖ సౌర విద్యుత్, ఉత్పత్తిదారుల సరసన నిలబెట్టింది. ఇంధన, పారిశ్రామిక రంగాలలో కొనసాగుతున్న విధానపరమైన ప్రయత్నాలు, నిర్మాణాత్మక పరివర్తనలు 2030 నాటికి 45 శాతం తగ్గింపు అనే సవరించిన లక్ష్యాన్ని అధిగమించేదిశగా భారతదేశాన్ని నడిపిస్తున్నాయి. ప్రశంసనీయమైన పురోగతి ఉన్నప్పటికీ భారతదేశం జాతీయంగా నిర్ణయించుకున్న సహకారాల ఆశయాలు, విస్తృత వాతావరణ లక్ష్యాలను పూర్తిగా సాకారం చేసుకోవడంలో సవాళ్లు మిగిలి ఉన్నాయి. స్థాపిత పునరుత్పాదక సామర్థ్యం పెరిగినప్పటికీ, ఇప్పటికీ గ్రిడ్‌మిశ్రమంలో బొగ్గు ఆధిపత్యం కంటే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి వెనుకబడి ఉంది. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు ప్రధాన సహకారిగా కొనసాగుతోంది. వేగంగా పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడానికి విస్తరిస్తోంది. ఇది స్థిరమైన వృద్ధిని ఇంధన భద్రతతో సమతుల్యం చేయడంలో సంక్లిష్టతను సూచిస్తోంది. మరొక సవాలు వాతావరణ నిబద్ధతలను సకాలంలో సమర్పించడం. 2025లో 2030 తర్వాత కాలానికి నవీకరించిన ఎన్‌డిసిని సమర్పించడానికి ఐక్యరాజ్యసమితి ఇచ్చిన గడువును భారతదేశం కోల్పోయింది. స్వచ్ఛమైన విద్యుత్, ఇంధన సామర్థ్యం, అనుసరణ చర్యల కోసం తగినంత పెట్టుబడిని,ముఖ్యంగా ప్రైవేట్‌రంగ ఆర్థికసహాయాన్ని సమీకరించడం చాలా కీలకం. భారతదేశం ప్రస్తుతం అంగీకరించిన 1.5 డిగ్రీల సెల్సియస్ లక్ష్యాన్ని చేరుకోవడానికి బలమైన పునరుత్పాదక ఇంధన విస్తరణ, ఉద్గార సామర్థ్య మెరుగుదలలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రిడ్‌నిల్వ వంటి రంగాలలో లోతైన కర్బన ఉద్గారరహిత వ్యూహాలు, ఆవిష్కరణలను గణనీయంగా పెంచాలి.స్థితిస్థాపక మౌలిక సదుపాయాలు, వాతావరణ స్మార్ట్ వ్యవసాయం, విపత్తు నిర్వహణ చట్రాలలో పెట్టుబడులను ఆకర్షించాలి. 2070 నాటికి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను పూర్తిగా తగ్గించాలనే లక్ష్యాలను చేరుకోవడానికి విధాన సమన్వయాన్ని బలోపేతం చేయాలి. స్థిరమైన సాంకేతికతలను ప్రోత్సహించాలి. గ్రీన్ ఫైనాన్స్ విధానాలను విస్తరించాలి.అంతర్జాతీయ సౌర కూటమి వంటి చొరవలతోసహా అంతర్జాతీయ వాతావరణ దౌత్యం,భాగస్వామ్యాలలో భారతదేశం నిరంతర భాగస్వామ్య వాతావరణ చర్యను ఉత్ప్రేరకపరిచే దానిసామర్థ్యాన్ని పెంచుకోవాలి. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మిత్ర ద్రోహి..దేశ ద్రోహి రగడ



రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రి బిట్టూ మధ్య వాగ్వాదం

పార్లమెంట్ వెలుపల ఆసక్తికర పరిణామం

ప్రతిపక్ష నేత తీరుపై బిజెపి నేతలు మండిపాటు

రాహుల్ వ్యాఖ్యలను సమర్థించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు మధ్య పార్లమెంట్ ఆవరణలో మిత్ర ద్రోహి... దేశ ద్రోహి అంటూ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బుధవారం లోక్‌సభ సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపీలు నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. వారి నినాదాలతో పార్లమెంట్ ఆవరణ మార్మోగింది. ఇండియా బ్లాక్ కు చెందిన ఇతర పార్టీల సభ్యులు కూడా వారితో జట్టుకట్టారు. అదే సమయంలో మెట్ల ఉన్న రాహుల్ గాంధీ, ఇతర సభ్యులను దాటుకుని లోనికి వెళ్లడానికి కేంద్ర మంత్రి రవణీత్ సింగ్ బిట్టూ అటుగా వచ్చారు. ఆయనను చూస్తూనే రాహుల్ గాంధీ సెటైర్లు వేశారు. 'హలో.. నా మిత్ర ద్రోహి)'అంటూ పిలిచారు. దీంతో వెనక్కి తిరిగి చూసిన బిట్టుతో నవ్వుతూ షేక్ హ్యాండ్ ఇవ్వబోయారు. 'నా ట్రైటర్ ఫ్రెండ్ వెళ్తున్నాడు.. చూడండి..' అంటూ అక్కడ బైఠాయించిన సభ్యులకు పరిచయం చేశారు. దీనికి అంతే సెటైరికల్‌గా స్పందించారు బిట్టూ కూడా. 'వీళ్లేదో కార్గిల్ యుద్ధాన్ని గెలిచి వచ్చినట్లున్నారు' అంటూ వ్యాఖ్యానించారు.

బిట్టూ చేసిన వ్యాఖ్యకు రాహుల్ గాంధీ వెంటనే బదులిచ్చారు. 'ఇతనే ద్రోహి.. ఇటుగా వెళ్తున్నాడు' అని బిట్టూను ఉద్దేశించి అన్నారు. అతని ముఖాన్ని చూడండి. మిత్ర ద్రోహిలా కనిపిస్తాడు అని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన షేక్ హ్యాండ్ ను తీసుకోలేదు బిట్టూ. ఆయనను దేశ్ కే దుష్మన్" (దేశ ద్రోహి) అని దూషించారు.

రాహుల్ గాంధీ కరచాలనం చేయడానికి ముందుకొచ్చినప్పుడు తాను ఎందుకు నిరాకరించానో బిట్టు వివరిస్తూ, 1984లో స్వర్ణ దేవాలయంలో మిలిటెంట్లను ఏరివేసేందుకు చేపట్టిన ఆపరేషన్ బ్లూ స్టార్, సిక్కు వ్యతిరేక అల్లర్ల విషయంలో గాంధీ కుటుంబాన్ని తీవ్రంగా విమర్శించారు. 'వాళ్లు దేశద్రోహులు, దేశానికి శత్రువులు, ప్రతిరోజూ సైన్యం గురించి, దేశం గురించి చెడుగా మాట్లాడుతారు. సిక్కుల హంతకులైన గాంధీ కుటుంబ వారసుడితో ఒక సర్దార్ ఎప్పటికీ కరచాలనం చేయడు' అని బిట్టు అన్నారు.

కాగా, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఢిల్లీ మంత్రి మంజీదర్ సింగ్ సిర్సా ఖండిం చారు. 'రాహుల్ గాంధీ, అతడి కుటుంబం ద్రోహులు.. సిక్కులు, సర్దార్‌లు కాదు. ఆయన వ్యాఖ్యలను బట్టి కాంగ్రెస్ మనస్తత్వం ఏమాత్రం మారలేదని అర్థమవుతోంది'అని విమర్శించారు. అటు, రాహుల్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సమర్థించుకునే ప్రయత్నం చేసింది.'ద్రోహి'కి అంత కంటే సరైన పదం మరొకటి లేదని వాదించింది. 'ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడనివ్వకపోతే మేము ఏం చేయగలం? బిట్టును ఎంపీగా ఎవరు చేశారు? ఒక ద్రోహి గురించి మనం ఇంకేం చెప్పగలం?' అని కాంగ్రెస్ ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ అన్నారు.



## ఆరోపణలు నిరూపించగలరా?

నా ముందు నిలబడి చెప్పగలరా?

రాహుల్‌గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్

బడ్జెట్ సమగ్రంగా లేదన్న వ్యాఖ్యలపై ఆర్థిక మంత్రి మండిపాటు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** కేంద్ర బడ్జెట్ నిరుద్యోగం, గ్రామీణ దుస్థితి, తయారీ మందగమనాన్ని పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు మద్దతుగా వివరణాత్మక ఆధారాలు అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బహిరంగంగా సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను నిరాధారమైనవిగా అభివర్ణించారు. ఆయన ఆరోపణలకు "పూర్తిగా ఆధారం లేదు" అని అన్నారు. బడ్జెట్‌లో లోపాలు ఉన్నాయని చేస్తున్న ఆరోపణలను నిరూపించే అంశాలను కాంగ్రెస్ నేత తన ముందు నిలబడి చెప్పగలరా? అని సవాల్ విసిరారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలన్నారు. తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు ప్రతిపక్షాల తీవ్ర విమర్శలను తిరస్కరిస్తూ, యువత చొరవలు, వ్యవస్థాపకత, సాంకేతిక పురోగతి పట్ల ప్రభుత్వ నిబద్ధతను ఆర్థిక మంత్రి నొక్కి చెప్పారు. జాతీయ మీడియా వీడియోస్ విడుదల చేసిన ఇంటర్వ్యూలో, సీతారామన్ మాట్లాడుతూ, "బడ్జెట్‌లో ఈ ఆరోపణలకు మద్దతు ఇచ్చే ఏదైనా పేరాను ఎత్తి చూపమని ఆయనను సవాలు చేస్తున్నాను" అని అన్నారు, ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభి వృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ప్రాధాన్యత ఇచ్చిందని పునరుద్ఘాటించారు. అభివృద్ధి చెందుతున్న కార్మిక మార్కెట్ డిమాండ్లకు యువతను సిద్ధం చేయడంపై అధిక దృష్టితో వ్యవసాయం, గ్రామీణ ఉపాధికి సాంప్రదాయ మద్దతు విధానాలను ఏకీకృతం చేసే పరిపాలన విధానాన్ని తీసుకువస్తున్నామని వివరించారు. యువత శిక్షణ, వ్యవస్థాపకతను లక్ష్యంగా చేసుకుని తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, యువత భారతీయులు అభివృద్ధి చెందుతున్న రంగాలలో అవకాశాల కోసం సిద్ధంగా ఉన్నారని నిర్ధారించుకోవడానికి నైపుణ్య కార్యక్రమాల కోసం వనరులు కేటాయించబడ్డాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి స్థిరపడిన మద్దతును శిక్షణ, ఉద్యోగ సృష్టిపై దృష్టి సారించిన కొత్త చట్రాలతో కలపడం కూడా బడ్జెట్ లక్ష్యం అని విత్త మంత్రి వివరించారు. "బడ్జెట్‌పై ఆయన విసురుతున్న ఈ విషయాలలో ప్రతిదాన్ని నిరూపించడానికి బడ్జెట్‌లో ఖచ్చితమైన నిర్దిష్ట అంతరాలను ఇవ్వాలని తాను కోరుకుంటున్నా. దానిపై ఆయనను సవాలు చేస్తున్నా" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. "ఈ వాదనలతో ఆయన ఎక్కడికి వస్తున్నారు? దయచేసి వీటిలో దేనినైనా బహిర్గతం చేసే ఏదైనా పేరాను చూపించమని ఆయనను అడగండి" అని వ్యాఖ్యానించారు. బడ్జెట్ 2026 యువతకు శిక్షణ ఇవ్వడం, వ్యవస్థాపకతకు మద్దతు ఇవ్వడం, కృత్రిమ మేధస్సును సమగ్రపరచడం కోసం ఖచ్చితమైన నిబంధనలను రూపొందించిందని సీతారామన్ పేర్కొన్నారు.

# బెంగాల్‌లోనే ఎందుకు సర్ హడావిడి..



ఇతర రాష్ట్రాలు లేవా, సుప్రీం చీఫ్ జస్టిస్ ఎదుట మమతా బెనర్జీ వాదనలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన సర్ వల్ల 150 మంది తమ రాష్ట్ర ప్రజలు ప్రాణాలు కోల్పోయారని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎదుట ఆమె సుప్రీంలో న్యాయవాదిగా వాదనలు వినిపించారు. స్వతహాగానే న్యాయశాస్త్ర పట్టభద్రురాలయిన మమతా తానే స్వయంగా సుప్రీంలో వాదనలు వినిపించారు. సర్ విషయంలో ఫిర్యాదు చేసేందుకు మమతా బెనర్జీ మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. సోమవారం సీఈసీని కలవగా బుధవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిశారు. ఈ అంశంపై వివరించేందుకు సమయం కావాలని మమత సీజేఐని కోరారు. ఆయన మమతకు 15 నిమిషాల సమయం ఇచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) వోటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోందంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు. మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్‌మ్యాచ్‌ల వల్ల మాత్రమే వోటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు 3 నెలల్లో ఎందుకు ఇంత హడావుడి నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ఎందుకు బెంగాల్‌ను మాత్రమే ఎంచుకున్నారు అని ప్రశ్నించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల మరణాలకు సర్‌తో సంబంధం ఉందని, హార్వెస్టింగ్ సీజన్‌లో 100 మందికి పైగా మరణాలు, హాస్పిటలైజేషన్లు జరిగాయని, అసోంలో ఎందుకు ఇలాంటివి లేవని విమర్శించారు. బెంగాల్‌ను బుల్డోజ్ చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడాలని ధర్మాసనాన్ని కోరుతున్నానని అన్నారు. జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, వీఎం పంచోలి బెంచ్ మమతా పిటిషన్ జెన్యూన్ అని అంగీకరించింది. సర్ నోటీసులు పంపేటప్పుడు అధికారులు కాస్త సెన్సిబుల్‌గా ఉండాలని ఈసీకి సూచించింది. అమర్త్యా సేన్, జాయ్ గోస్వామి, టీఎంసీ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖులకు నోటీసులు పంపడం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది. మరోవైపు, మమత కోల్ కతాలోని జోగేశ్ చంద్ర చౌదరి కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టులో సొంతంగా వాదనలు వినిపించడం ఇదే తొలిసారి.

## శ్రీజిత్ పవార్‌తోనే అజిత్ పవార్ చివరి ఫోన్‌కాల్



**ముంబయి,ఫిబ్రవరి 4:** మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ గత నెల 28న విమాన ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం కోసం బారామతి బయలుదేరిన అజిత్ పవార్ విమానం క్రాష్ ల్యాండ్ కావడంతో దుర్మరణం పాలయ్యారు. ముంబైలో విమానం ఎక్కే ముందు పార్టీ నేత శ్రీజిత్ పవార్ కు ఫోన్ చేశారు. ఆయన మాట్లాడిన చివరి కాల్ అదే. తాజాగా ఈ ఫోన్ కాల్ సంభాషణను శ్రీజిత్ పవార్ బయటపెట్టారు. ఐక్యత, సమానత్వం గురించే ఆయన తనకు సూచనలు చేశారని తెలిపారు. పార్టీ వ్యవహారానికి సంబంధించి దాదా (అజిత్ పవార్)తో ఓ విషయం మాట్లాడాలని ఆ రోజు ఉదయం ఫోన్ చేశా. అయితే, నెట్ వర్క్ కవరేజ్ లేకపోవడంతో ఫోన్ కలవలేదు. దీంతో ఓ మెసేజ్ పెట్టాను. నెట్ వర్క్ కవరేజ్ ఏరియాలోకి వచ్చిన తర్వాత ఆ మెసేజ్ చూసిన దాదా వెంటనే నాకు ఫోన్ చేశారు. పార్టీలో ఎలాంటి అసమానతలకు, వివక్షకు చోటు లేదని స్పష్టంగా చెబుతూ అన్ని కులాలను, మతాలను కలుపుకుని వెళ్లాలని దాదా నాకు సూచించారు. మహారాష్ట్ర గురించి, రాష్ట్ర ప్రజల గురించి దాదా ఆలోచనలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే నేనీ సంభాషణకు సంబంధించిన ఆడియోను విడుదల చేస్తున్నానంటూ శ్రీజిత్ పవార్ తెలిపారు.



## మహావీర్‌జయంతి అయినా మార్చి 31న బ్యాంకులు యథాతథం

**ముంబయి, ఫిబ్రవరి 4:** మహావీర్ జన్మకల్యానక్ (మహావీర్ జయంతి) సందర్భంగా బ్యాంకులకు ఇచ్చిన సెలవు రద్దు చేస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో ఆరోజు బ్యాంకులు యథావిధిగా తెరుచుకుని బ్యాంకింగ్ సేవలు అందించనున్నాయి. ఆర్థికసంవత్సరం ముగింపు కావడంతో ఆరోజు బ్యాంకులు విధిగా పనిచేయాల్సి ఉంటుంది. ఆస్తిఅప్పుల పట్టాల జమాబందీ కావడంతో చివరిరోజున ఖచ్చితంగా పనిచేస్తాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొద్ది రోజుల క్రితం జారీ చేసిన హాలిడే క్యాలెండర్‌లో మార్చి 31 హాలిడే ఉండగా తాజాగా దానిని రద్దు చేసింది. మార్చి 31తో ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 ముగుస్తుంది. ఈ ఆర్థిక ఏడాదిలోనే అన్ని ప్రభుత్వ జమలు, పేమెంట్లను నమోదు చేయాలని, ప్రభుత్వ ట్రాన్సాక్షన్లు నిర్వహించే బ్యాంకులను మార్చి 31, 2026 రోజున తెరిచి ఉంచాలని ప్రభుత్వం కోరింది. పలు రాష్ట్రాల్లో పబ్లిక్ హాలీడే ఉన్నప్పటికీ ప్రభుత్వ ట్రాన్సాక్షన్లు నిర్వహించే బ్యాంకులన్నీ తెరిచి ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. దీంతో ఆర్‌బీఐ సెలవు రద్దు చేస్తూ నిర్ణయంతీసుకుంది. అన్ని ఏజెన్సీ బ్యాంకులు తమ బ్యాంక్‌బ్రాంచీలను తెరిచి ఉంచాలని ఆదేశించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హాలిడేక్యాలెండర్ ప్రకారం గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్య ప్రదేశ్, తమిళ నాడు, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెం గాల్, ఢిల్లీ, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో మార్చి 31, 2026వ తేదీన సెలవు ఇచ్చారు. ఇపుడు ఆర్‌బీఐ ఇచ్చిన కొత్త ఆదేశాల ప్రకారం ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ ట్రాన్సాక్షన్లు చేసిన బ్యాంక్ బ్రాంచీలన్నీ తెరిచి ఉంటాయి. మహావీర్ జన్మకళ్యాణక లేదా మహావీర్ జయంతి అనేది జైన మతంలో అత్యంత ముఖ్య మైన, మతపరమైన పండుగలలో ఒకటి. ఆమ తంలో చివరి తీర్థంకరుడైన మహావీరుడి పుట్టిన రోజు.

## ఆన్‌లైన్ గేమ్స్ కట్టడిచేసారని ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య




**ఘజియాబాద్, ఫిబ్రవరి 4:** ఆన్ లైన్ గేమ్స్ ఆడ వద్దంటూ తల్లిదండ్రులు కట్టడి చేయడంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. తొమ్మిదో అంతస్తు నుంచి దూకడంతో వారు చనిపోయారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లోని భారత్ సిటీ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ లో ఈ రోజు తెల్లవారుజామున ఈ ఘోరం చోటుచేసుకుంది. భారత్ సిటీ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ లో నివాసం ఉంటున్న దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. విశిక (16), ప్రాచి (14), పాఖి (12) ముగ్గురు బాలికలూ చక్కగా కలిసి ఉండేవారు. తిండి దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ అన్నీ కలిసే చేసేవారు. కరోనా సమయంలో ఇంట్లోనే ఉండాల్సి రావడంతో వారికి ఆన్ లైన్ గేమ్స్ ఆడటం అలవాటుగా మారింది. ఆ తర్వాత అది వ్యసనంగా మారింది. ఇలా గేమ్స్ ఆడేందుకు తరచూ స్కూలుకు దుమ్మా కొట్టేవారు. పిల్లల తీరుతో విసిగిపోయిన పేరెంట్స్ ఆన్ లైన్ గేమ్స్ ఆడవద్దని, బాగా చదువుకోవాలని గట్టిగా హెచ్చరించారు. గేమ్స్ ఆడేందుకు వీలులేకుండా కట్టడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన బాలికలు ముగ్గురూ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ రోజు తెల్లవారు జామున తాము ఉంటున్న బిల్డింగ్ పైకెక్కి తొమ్మిదో అంతస్తు నుంచి దూకారు. తీవ్ర గాయాలతో ముగ్గురూ అక్కడికక్కడే చనిపోయారు. ఘజియాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తన కూతుళ్లు రెండున్నరేళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసయ్యారని, ఆ గేమ్‌లలో చివరి టాస్క్ సూసైడ్ అని ఉందని దర్యాప్తు అధికారులు తమతో చెప్పారని ఘజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్ల తండ్రి తెలిపారు. ఆన్‌లైన్ కొరియన్ టాస్క్ ఆధారిత గేమ్‌కు బానిసైన వారు క్షమించండి, నాన్నా అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కొరియన్ ఆన్‌లైన్ గేమ్‌లో చివరి టాస్క్ ఆత్మహత్య అని తండ్రి తెలిపారు. రెండు న్నరేళ్లుగా ఈ గేమ్‌కు బానిసైన తన కూతుళ్లు క్రమంగా కుటుంబానికి కూడా దూరమయ్యారని అన్నారు. బుధవారం తెల్లవారుజామున ముగ్గురు అక్కాచెల్లెళ్లు బాల్కనీలోకి వెళ్లి తలుపు గడియ వేసి కిటికీలో నుంచి కిందకు దూకారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ బాలికలు కిందపడిపోవడాన్ని తాను ప్రత్యక్షంగా చూసినట్లు పక్క ఫ్లాట్ వ్యక్తి వెల్లడించారు. రాత్రి రెండు గంటల సమయంలో నేను బాల్కనీలోకి వచ్చా నని ఆ సమయంలో వారు బాల్కనీలోనే ఉన్నా రని, కానీ అక్కడ కూర్చున్నది ఎవరో తనకు అర్థం కాలేదని తెలిపారు. ఆ తర్వాత వారు కిందకు దూకుతుండటం చూసి కుటుంబ సభ్యులను అప్రమత్తం చేసేలోపు ఒకరి తర్వాత ఒకరు దూకేశారని అన్నారు. ఆ తర్వాత తాను పోలీసులకు, అంబులెన్స్‌కు ఫోన్ చేశానని వెల్లడించారు.

# బలూచిస్థాన్‌లో మాసైన్యం చేతులెత్తేసింది

పార్లమెంటులో పాక్ రక్షణమంత్రి సంచలన వ్యాఖ్యలు



**కరాచి, ఫిబ్రవరి 4:** పాకిస్థాన్‌లో అతిపెద్ద రాష్ట్రమైన బలూచిస్థాన్‌లో వేర్పాటువాద సెంట్రల్ దాడులు మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేషనల్ అసెంబ్లీలో చేసిన ప్రసంగం ఇప్పుడు చర్చనీయాంశమైంది. బలూచిస్థాన్ తిరుగుబాటుదారులను అణచివేయడంలో తమ భద్రతా దళాలు శారీరక వైకల్యంతో ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. బలూచిస్థాన్ విస్తీర్ణం పాకిస్థాన్ మొత్తం భూభాగంలో 40 శాతానికి పైగా ఉందని, కానీ జనాభా మాత్రం చాలా తక్కువని ఆసిఫ్ పేర్కొన్నారు. ఒక నగరాన్ని నియంత్రించడం సులభం, కానీ ఇంత పెద్ద రాష్ట్రాన్ని కాపాడటం చాలా కష్టం. మా సైనికులు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు, కానీ ఆ ప్రాంత విస్తీర్ణం, పర్వత ప్రాంతాల వల్ల వారు తిరుగుబాటుదారులను సమర్థవంతంగా అడ్డుకోలేకపోతున్నారని ఆయన ఒప్పుకున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 మధ్య ఆపరేషన్ హెరోఫ్ 2.0ఖి పేరుతో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) విరుచుకుపడింది. ఈ దాడుల్లో దాదాపు 17 మంది భద్రతా సిబ్బంది, 33 మంది సామాన్య పౌరులు మరణించగా, పాక్ సైన్యం జరిపిన ఎదురుకాల్పుల్లో 177 మంది తిరుగుబాటుదారులు హతమైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి దాడుల్లో మహిళా ఫైటర్లు కూడా పాల్గొనడం పాక్ సైన్యాన్ని కలవరపెడుతోంది. నుష్కీలోని ఐఎస్ఐ కార్యాలయంపై దాడి చేసింది ఆసిఫా మెంగల్ అనే మహిళా ఫిదాయీ అని గుర్తించారు. బలూచిస్థాన్‌లో కేవలం స్వేచ్ఛ కోసం పోరాటం జరగడం లేదని, అక్కడ చమురు స్మగ్లింగ్ చేసే మాఫియా, బ్యూరోక్రసీ, వేర్పాటువాదులు కలిశారని ఆసిఫ్ ఆరోపించారు. ఇరాన్ నుంచి జరిగే పెట్రోల్ స్మగ్లింగ్ ద్వారా వీరు రోజుకు సుమారు 4 బిలియన్ పాక్ రూపాయలు ఆర్జిస్తున్నారని, వీరు అఫ్ఘనిస్థాన్ మద్దతుతో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బలూచిస్థాన్ ప్రజలు దశాబ్దాలుగా తమ ఖనిజ సంపదను పంజాబ్ ప్రావిన్స్ దోచుకుంటోందని, తమకు కనీస సౌకర్యాలు లేవని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా చైనా పెట్టుబడి పెట్టిన గ్వాదర్ పోర్ట్ వల్ల స్థానికులకు ఎలాంటి ఉపయోగం లేదని, అది కేవలం వనరులను తరలించుకు పోవడానికేనని అక్కడి ప్రజల ఆగ్రహం. ఈ దాడుల నేపథ్యంలో బలోచిస్థాన్ అంతటా నెల రోజుల పాటు సెక్షన్ 144 విధించారు. రైలు సర్వీసులు ఇప్పటికే మూడవ రోజు కూడా నిలిచిపోయాయి. పాకిస్థాన్ ఈ తిరుగుబాటును అణచివేయడానికి మరిన్ని బలగాలను మోహరిస్తోంది.

## సంక్షిప్తంగా..

### ఇండిగో షెడ్యూల్‌లో సర్దుబాటు: సర్వీసుల తగ్గింపు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** కార్యాచరణ సమస్యల కారణంగా దూరప్రాంతాలకు వెళ్లే తమ విమానాల షెడ్యూల్ లో సర్దుబాటు చేయనున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ ప్రకటించింది. ఈ నెల 17వ తేదీ నుంచి తదుపరి నోటీసులు జారీ చేసేవరకు డెన్మార్క్ రాజధాని కోపన్‌హేగన్‌కు విమాన సర్వీసులు నిలిపి వేయనున్నట్లు వెల్లడించింది. అదేవిధంగా అదేవిధంగా ఈ నెల 7 నుంచి ఢిల్లీ-మాంచెస్టర్, 9 నుంచి ఢిల్లీ-లండన్ హీత్రూ మార్గాల్లో సర్వీసులను తగ్గించనున్నట్లు పేర్కొంది. 'భౌగోళిక రాజకీయ పరిస్థితుల వల్ల గగనతలంలో ఆంక్షలు నిరంతరం మారుతున్నాయి. భారత్‌తోపాటు విదేశాల్లోని విమానాశ్రయాల్లో రద్దీ నెలకొంటోంది. దీంతో విమాన ప్రయాణ సమయం భారీగా పెరుగుతోంది. ఫలితంగా సంస్థకు చెందిన వైడ్ బాడీ విమానాలు (787-9) షెడ్యూల్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

### ఎఫ్‌స్టీన్ ఫైల్స్ వల్లే బిల్‌గేట్స్‌తో బంధం ముగిసింది : మిలిందా



**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తులో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడవడంపై ఆయన మాజీ భార్య మిలిందా స్పందించారు. బిల్‌గేట్స్ ఇతర మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు తెలియడంతో తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించానని అన్నారు. ఆ కారణంగానే తమ వైవాహిక జీవితానికి ముగింపు పలికినట్లు తెలిపారు. తన జీవితంలో ఆ సమయం చాలా బాధాకరమైనదని మిలిందా పేర్కొన్నారు. తమ బంధాన్ని కాపాడుకోవడానికి కావాల్సిన విలువలను బిల్‌గేట్స్ నిలబెట్టుకోకపోవడం వల్లే ఆయనతో విడాకులు తీసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్‌గేట్స్ గురించి బయటకు వచ్చిన విషయాలపై ఆయనే సమాధానం చెప్పుకోవాలని, తాను కాదని వ్యాఖ్యానించారు.

### మదురో దంపతులను విడుదలచేయాలంటూ వెనిజులాలో నిరసనలు



**కారకాస్, ఫిబ్రవరి 4:** వెనిజులా రాజధాని కరాకస్ నగరం నిరసన జ్వాలలతో అట్టుడుకుతోంది. సరిగ్గా నెల రోజుల క్రితం అమెరికా సైన్యం జరిపిన మెరుపు దాడిలో బందీలుగా చిక్కిన తమ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను వెంటనే విడుదల చేయాలంటూ వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. జనవరి 3న మొదలైన ఈ నిరసనలు మంగళవారం నాటికి ఉద్భృత రూపం దాల్చాయి. ఒక దేశాధ్యక్షుడిని మరో దేశ సైన్యం బలవంతంగా ఎత్తుకుపోవడాన్ని వెనిజులా రక్షణమంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్ తీవ్రంగా ఖండించారు. ప్రపంచంలోని అతి పెద్ద అణుశక్తిదేశం, ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా మాపై దాడికి తెగబడింది. ఇది అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని ఆయన ధ్వజమెత్తారు. వెనిజులా సాయుధ దళాలు రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాయని, మదురో తిరిగి వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## లిబియా మాజీ నియంత కుమారుడు సైఫ్ గడాఫీ హత్య



**ట్రిపోలి, ఫిబ్రవరి 4:** లిబియా మాజీ నియంత మొమ్మర్ గడాఫీ కుమారుడు, ఒకప్పుడు ఆ దేశానికి కాబోయే పాలకుడిగా భావించిన సైఫ్ అల్ఇస్లాం గడాఫీ (53) దారుణ హత్యకు గురయ్యారు. పశ్చిమ లిబియాలోని జింతాన్ నగరంలో ఉన్న ఆయన నివాసంలోకి నలుగురు సాయుధులు చొరబడి జరిపిన కాల్పుల్లో సైఫ్ మరణించినట్లు ఆయన రాజకీయ కార్యాలయం ధ్రువీకరించింది. సైఫ్ అల్ఇస్లాం న్యాయవాది మాట్లాడుతూ ఇదొక ప్రణాళికాబద్ధమైన హత్య అని పేర్కొన్నారు. ఒక కమాండో యూనిట్ తరహాలో వచ్చిన నలుగురు వ్యక్తులు నేరుగా ఇంట్లోకి చొరబడి కాల్పులు జరిపారన్నారు. ఈ దాడికి ఆదేశాలు ఇచ్చింది ఎవరు దీని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి అనే విషయాలు ఇంకా బయటకు రాలేదు. మరోవైపు, సైఫ్ సోదరి స్పందిస్తూ ఆయన అల్జీరియా సరిహద్దుల్లో మరణించారని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. గడాఫీ 40 ఏళ్ల పాలనలో సైఫ్ అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా ఉండేవారు. 2011 ప్రజా తిరుగుబాటులో గడాఫీ పతనం తర్వాత సైఫ్ అజ్ఞాతంలోకి వెళ్లారు. అదే ఏడాది పట్టుబడిన ఆయన దాదాపు పదేళ్ల పాటు బందీగా గడిపారు. విడుదలైన తర్వాత తిరిగి రాజకీయాల్లోకి వచ్చి అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని ప్రకటించడం ద్వారా లిబియా రాజకీయాల్లో మళ్లీ సంచలనం సృష్టించారు. గతంలో లిబియా తన సామూహిక విధ్వంసక ఆయుధాల ప్రోగ్రామ్‌ను వదులుకోవడంలో సైఫ్ కీలక పాత్ర పోషించారు. అలాగే లాకర్బీ విమాన పేలుడు బాధితులకు పరిహారం అందించే చర్చల్లోనూ ఆయన ముందున్నారు. లిబియాకు కొత్త రాజ్యాంగం కావాలని, మానవ హక్కులను గౌరవించాలని కోరుతూ ఒక సంస్కర్తగా తనను తాను ప్రపంచానికి పరిచయం చేసుకునే ప్రయత్నం చేశారు. సైఫ్ అల్ఇస్లాం మృతితో లిబియాలో జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ మరింత సందిగ్ధంలో పడింది. ఆయన మద్దతుదారులు దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగే అవకాశం ఉందని భద్రతా దళాలు హెచ్చరిస్తున్నాయి.

## 2.5 కోట్ల ఆధార్ కార్డులు డీ యాక్టివేషన్




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 4:** గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపువ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటంవంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు.




# కేన్సర్ బాధితులకు ఉచిత వైద్యం

● ఎన్టీఆర్ వైద్య ట్రస్టు ద్వారా అందిస్తాం ● ఏపిలో 6.32లక్షల మంది క్యాన్సర్ బాధితులు ● క్యాన్సర్ బాధితుల కోసం రూ.4,751.82 కోట్ల వ్యయం ● దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ అట్లాస్ ద్వారా సమగ్ర కార్యాచరణ

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల నియంత్రణ, వైద్యసేవలు మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రాణాంతకంగా మారిన క్యాన్సర్ మహమ్మారిపై పోరాటం చేసేందుకు అందరూ కలిసి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ముందస్తు జాగ్రత్తలు, ప్రాథమిక పరీశీలన ద్వారా క్యాన్సర్ వ్యాధులను ప్రారంభ దశలోనే అరికట్టవచ్చునని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్న కేసులు, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రాథమిక పరీక్షలు, గుర్తించిన అంశాలు, తీసుకోబోతున్న చర్యలను మంత్రి సత్యకుమార్ వివరించారు. రాష్ట్రంలో 2007-2008 నుంచి 2025-26 జనవరి 24వరకు క్యాన్సర్ తో బాధపడుతున్న 6 లక్షల 32 వేల 426 మందికి ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా ఉచితంగా అందించిన వ్యయం 4,751.82 కోట్లకు చేరుకుందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 675.66 కోట్లను క్యాన్సర్ పీడితులకు వైద్యాన్ని అందించేందుకు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. 2025-26 లో జనవరి 24 వరకు 585.22 కోట్లు ఖర్చు పెట్టినట్లు పేర్కొన్నారు.



క్యాన్సర్ వ్యాధుల పట్ల ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తూనే ఎన్సీడీ4.0 ద్వారా బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. పాలియేటివ్ కేర్ కింద దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ముఖ్యంగా క్యాన్సర్ పీడితులకు ఎలాంటి వైద్యాన్ని అందించాలన్న దానిపై శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించామని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. నానాటికీ పెరుగుతున్న క్యాన్సర్ కేసులతో పాటు, పీడితులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు సీఎం చంద్రబాబు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ప్రభుత్వ సలహాదారుగా నియమించి ఈ వ్యాధి కట్టడి దిశగా కార్యాచరణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్ కేసులను గుర్తించేందుకు ప్రత్యేకంగా అసాంక్రమిక వ్యాధుల (ఎన్సీడీ) 4.0 సర్వే చేపడుతున్న ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ అట్లాస్‌ను రూపొందించినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలవారీ పరిస్థితులకు అనుగుణంగా ఈ మహమ్మారిపై సమరానికి అడుగులు వేస్తోంది. క్యాన్సర్‌ను నోటిఫై వ్యాధిగా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం తాజాగా రూపొందించిన అట్లాస్ ద్వారా పరిస్థితులను ఎక్కడికక్కడ చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందుకు ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకుంది. అవే ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఆరోగ్య విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం. క్యాన్సర్ భయాలు తొలగించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం. ప్రమాదస్థాయిలో ఉన్నవారిని గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చెయ్యడం ద్వారా వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం. తక్కువ ఖర్చుతో, సులువుగా అందుబాటులో ఉండే వైద్యం. దీర్ఘకాలిక రోగులకు జీవన ప్రమాణాలు మెరుగుపరిచే చర్యలు చేపట్టింది. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా నగదు రహిత సేవలు అందించనున్నట్లు సంబంధిత అధికారులు వివరిస్తున్నారు.

క్యాన్సర్ అట్లాస్‌లో పేర్కొన్న గణాంకాల ప్రకారం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ ఈ వ్యాధి పీడితులు ఉన్నట్లు తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అత్యధికంగా 8,101 కేసులు కాకినాడ జిల్లాలో ఉన్నాయి. అత్యల్పంగా 1,495 కేసులు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నట్లు తెలుస్తుంది. పీడితుల్లో మహిళలు ఎక్కువగా ఉన్నారని, 5059 ఏళ్ల వయసు వారు అధికంగా ఈ వ్యాధి బారిన పడుతున్నారని గణాంకాల్లో బయటపడింది.



## అసెంబ్లీలో ఉండగానే వీడియో కాల్స్ చేశాడు

● స్పీకర్‌కూ ఫిర్యాదు చేస్తా

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై బాధితురాలి ఆరోపణ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అసెంబ్లీలో ఉండగానే తనతో వీడియో కాల్స్ చేసి మాట్లాడేవాడని బాధితురాలు ఆరోపించారు. శ్రీనగర్‌కాలనీలో బుధవారం తన న్యాయవాదితో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వ్యవహారంపై తాను స్పీకర్‌కు సైతం ఫిర్యాదు చేస్తానన్నారు. ఆయన బాధితుల్లో తాను ఒక దానినే కాదని, మరో అయిదుగురు ఉన్నారన్నారు. రూ. 25 కోట్లు తాను అడగలేదన్నారు. డబ్బులు డిమాండ్ చేసినట్లు వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవలేనన్నారు. అసెంబ్లీ నుండి వీడియో కాల్ చేయడమే కాకుండా అక్కడున్న అన్ని విషయాలను చూపేవాడన్నారు. సంజీవని ఆసుపత్రిలో వైద్యులు ఇచ్చిన మెడిసిన్ వేసుకున్న తరువాతనే అబార్షన్ అయ్యిందన్నారు. అతను తనతోపాటు మరో అయిదుగురితో ఇలానే చేశాడన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడన్నారు. పెళ్లి వ్యవహారంలో వాళ్ల ఇంట్లోపై తెలుసని, ఆయనకు టీడీపీ నేత ముక్క రూపానందరెడ్డి అండదండలు ఉన్నాయన్నారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య కేసులో 12 మంది అరెస్ట్

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని ఓ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య కారణమైన 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్లో గన్నవరం డిఎస్పి చలసాని శ్రీనివాసరావు, పెనమలూరు సిఐ జె వెంకట రమణ ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలిపారు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్య పేట మండలం బంగారుమెట్టకు చెందిన మొల్లి పవన్ కుమార్ (17), తోటి విద్యార్థి హేమంత్ స్నేహంగా ఉండే వారు. గతేడాది డిసెంబరులో వారి మధ్య వివాదం తలెత్తింది. హేమంత్ మంచివాడు కాదని, అతనితో మాట్లాడవద్దని తోటి విద్యార్థులకు పవన్‌కుమార్ చెప్పాడు. ఈ నేపథ్యంలో హేమంత్‌తోపాటు కళాశాల హాస్టల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జనవరి 5వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పవన్ కుమార్ రూమ్‌కు వెళ్లి ఆయనను కొట్టారు. దీన్ని వీడియోతీసి ఇన్‌స్టాలో పోస్టుచేశారు. జనవరి 30న మళ్లీ దాడి చేసి కొట్టారు. దీంతో మనస్తాపం చెందిన పవన్ కుమార్ జనవరి 31వ తేదీ సాయంత్రం స్టడీ అవర్‌కు వెళ్లకుండా తనను కొట్టి అవమానించిన ఆరుగురు విద్యార్థుల పేర్లను తన చేతి మణికట్టుపై రాసుకుని హాస్టల్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాల ప్రిన్సిపల్ పిచ్చయ్య, ఫ్లోర్ ఇన్చార్జి రవీంద్ర, మెస్ బాయ్ హేమంత్, జూనియర్ లెక్చరర్లు రాజేష్, ఆనంద్, కృష్ణ సంఘటన స్థలానికి వెళ్లారు. జరిగిన విషయం బయటకు పొక్కకుండా వారు జాగ్రత్త పడ్డారు. ఆధారాలు లేకుండా చేసారు. ఈ విషయంలో మృతుని సన్నిహితుల ద్వారా విషయం బయటకు పొక్కింది. యాజమాన్యం వారిని బెదిరించింది, అయితే పవన్‌కుమార్ తల్లిదండ్రులు అతని ఆత్మహత్య ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ క్రమంలో గుట్టురట్టుకావడంతో నిందితులందరిని అదుపులోకి తీసుకున్నారు.



## సిఎంకు శివయ్య ప్రసాదాలు

● శివరాత్రి ఆహ్వానం ● రాష్ట్రంలో ముందంజలో ఉన్నారు.. కీపిటప్: సిఎం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బుధవారం శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను, వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. అంతేకాక శ్రీకాళహస్తీశ్వరుని చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన అభివృద్ధి చిత్రాలను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి లాప్‌టాప్‌లో సిఎంకు చూపారు. కాగా ఈ నెల 10 నుంచి 23 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించాలని అభ్యర్థించారు. లోకకళ్యాణం నిమిత్తం జరుగు బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కూడా కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్ళిన ప్రజాప్రతినిధులు, అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలోని ఆలయాల్లో పరిపాలనా పారిశుద్ధ్యంకు సంబంధించి నిర్వహించిన సర్వేల్లో 'శ్రీకాళహస్తికి మొదట గ్రేడ్ వచ్చింది. కీపిటప్' అంటూ అభినందించినట్లు తెలిసింది. ఈ పేరు రావటానికి పాలకులు, అధికారుల కృషిని సిఎం అభినందించారు. శ్రీకాళహస్తిలో బ్రహ్మోత్సవాలకు దేశ నలుమూలల నుంచి జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరవుతారు. ఏర్పాట్లు జాగ్రత్త చేయండి, వచ్చిన ప్రతిభక్తుడు సంతృప్తిగా వెళ్ళాలి. వారికి సకల సదుపాయాలు కల్పించాలని సిఎం సూచించారు. అంతేకాక వచ్చిన ప్రతి ఒక్కరు మళ్ళీ మళ్ళీ రావాలనే విధంగా భక్తుల పట్ల ప్రవర్తించాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని వేదపండితులు శివకుమార్, త్రినాధ్‌శర్మలు ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు పగడాల మురళి, గోపినాథ్, నాగరాజు, దండి రాఘవయ్య, ఆలయ కార్యనిర్వహ ణాధికారి డి.బాపిరెడ్డి, డిప్యూటీ ఇఓ కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

### మంత్రులకు ఆహ్వానం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర మంత్రులకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్‌లు కలసి ఆహ్వాన పత్రికలు అందించి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ కమిషనర్ డాక్టర్ హరి జవహర్‌లాల్, దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, తిరుపతి శాసనసభ్యుడు ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవులు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, బిసి వెల్ఫేర్ మంత్రి సవిత, రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర మైక్రో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లను స్వాగతం పలుకుతూ ఆహ్వాన పత్రికలను అందించారు.



## రాయలసీమ వర్సిటీలో గొడవలు

● ఇరు వర్గాల విద్యార్థులు పరస్పరదాడులు

● విసి కార్యాలయం ముట్టడించి విద్యార్థుల ధర్నా

కర్నూలు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో విద్యార్థులు గాయపడ్డారు. కాగా ర్యాగింగ్ జరిగిందన్న కోణంలో మొదట కలకలం రేగింది. కానీ అది ర్యాగింగ్ కాదని తేల్చడంతోపాటు ఒక అమ్మాయి విషయంలో విద్యార్థులు గొడవ పడ్డారని పోలీసులు పేర్కొంటున్నారు. కాగా ఈ గొడవలకు పాల్పడ్డ ఇరు వర్గాల విద్యార్థులు వివిధ వర్గాల అండదండలు ఉన్నవారు కావడంతో వివాదం మరింత ముదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి యూనివర్సిటీ యాజమాన్యంతో పాటు పోలీసులు కూడా ఈ విషయంపై అప్రమత్తంగా ఉన్నారు. మంగళవారం రాత్రి వర్సిటీ ప్రాంగణంలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి మహేష్, ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఓబులేసు మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓబులేసుతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కర్నూలు తాలూకా యుపిఎస్ ఎస్సై మోహన్ కిషోర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాల విద్యార్థులను విచారించారు. మహేష్‌కు ప్రతిపక్షానికి చెందిన స్థానిక నాయకుల అనుచరులతో సంబంధాలు ఉన్నాయనే సమాచారం ఉండగా, ఓబులేసుకు విద్యార్థి సంఘాలతో అనుబంధం ఉందని సమాచారం. ఈ ఘటనను ఖండిస్తూ పీజీ విద్యార్థులు సీమ కృష్ణ రాథోడ్, రామకృష్ణ, సందీప్ నాయక్ తదితరులు దాడికి పాల్పడిన విద్యార్థులను యూనివర్సిటీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థులు ర్యాలీగా వెళ్లి పరిపాలన భవనాన్ని ముట్టడి చేసి ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీలో సాధారణ విద్యార్థులపై దాడులు జరగడం దుర్మార్గమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ధర్నా సందర్భంగా యూనివర్సిటీ అధికారులతో విద్యార్థులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం దాడికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వీసీ వెంకట బసవరావు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు. అయితే ఈ వివాదం ఇంతటితో ముగిసిపోతుంది అన్న నమ్మకం లేక పోలీసులు మరికొన్ని భద్రతా చర్యలు తీసుకున్నారు.

## దుర్గమ్మ ఆలయానికి ఎస్‌బిఐ బ్యాటరీ వాహనం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: విజయవాడ గాంధీనగర్‌లోని ఎస్‌బిఐ శాఖ సుమారు రూ. 9.13 లక్షల విలువైన బ్యాటరీ వాహనాన్ని బుధవారం ముంబై హెడ్ ఆఫీస్ ఎస్.బి.ఐ ఛైర్మన్ శ్రీనివాసులు సెట్టి హైదరాబాద్ సర్కిల్ సి.జి.ఎం రాజేష్ కుమార్ పటేల్, ఇతర జనరల్ మేనేజర్లు మరియు గాంధీనగర్ బ్రాంచ్ మేనేజర్ తదితర అధికారులుఎస్.బి.ఐ ఉన్నతాధికారులు ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ లకు విరాళంగా అందజేశారు.



**హుండీ ఆదాయం రు.2.91 కోట్లు:** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రు.2.91 కోట్ల నగదుతో పాటు బంగారం 251 గ్రాములు. వెండి 3 కేజీల 255 గ్రాములు. విదేశీ కరెన్సీ అమెరికా 785 డాలర్లు, ఇంగ్లాండ్ 25 పౌండ్లు, కువైట్ 10 దినార్లు, ఆస్ట్రేలియా 365 (డాలర్లు), సింగపూర్12 (డాలర్లు), కెనడా 300 (డాలర్లు), ఒమన్ 200 (రియాల్స్), యూఏఈ 80 (దిర్హామ్స్), మలేషి టయా 8 (రింగిట్స్), ఖతార్ 1 రియాల్, పోలాండ్ 110జులోటీలు లభించినట్లు ఇఓ శీనా నాయక్ తెలిపారు.



ఆలయానికి బ్యాటరీ కారు అందచేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

**ఇఓ క్షేత్రస్థాయి పరిశీలన:** శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్ బుధవారం ఆలయ పరిసరాల్లో విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. భక్తులకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించి, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**నిత్యాన్నదాన విరాళాలు:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలిసిన శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అన్నదాన పథకానికి కాకినాడ రమణయ్యపేటకు చెందిన గరికపర్తి నమశ్శివాయ కోట సూర్య నరసింహ, నాగమణి రూ. 1,00,152/ విరాళంగా ఆలయ అధికారులకు బుధవారం విరాళంగా అందించారు.

## ఇద్దరు సైబరు నేరస్తులు అరెస్టు



కోవెలకుంట్ల, పిబ్రవరి 4 ప్రభాతవార్త: జిల్లా యస్‌పి ఆదేశాల మేరకు కోవెలకుంట్ల సిఐ హనుమంతునాయక్ పర్యవేక్షణలో యస్ఐ మల్లికార్జున రెడ్డిలు సిబ్బంది ఇద్దరు సైబరు నేరస్తులను అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డియస్‌పి ప్రమోద్ చెప్పారు. బుదవారం సర్కిల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నకిలీ యస్ఐలమని కోవెలకుంట్ల పట్టణంలోని కర్నాటి ప్రతాపరెడ్డి వద్ద నుండి రూ.30000 అకౌంటు జమ చేసినందుకు కూపి లాగగా మొత్తం చిట్టా బయటపడిందని చెప్పారు. సంజామల మండలంలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖరు అలాగే తెలంగాణలోని మహబూబ్ నగరు జిల్లాలో హన్వాడ గ్రామం అడ్రసు ఉందని చెప్పారు. ఇతను కోవెలకుంట్ల పట్టణంలోని కర్నాటి ప్రతాపరెడ్డి అనే వ్యక్తికి పోన్ చేసి మీరు కండక్టరు బార్యకు పోన్ చేశారు. ఆమె భర్తకు తెలియగా ఆమె క్రిమిసంహారక మందు తాగింది. ఆమెను ఆసుపత్రి చేర్పించారని రూ.2 లక్షలు ఇప్పుడు కట్టాలని చెప్పారు. అనంతరం అతని మిత్రుడు దాసరి సందీప్‌కుమారు ఇతనిది కూడా హన్వాడ గ్రామమే కండక్టరు భర్తగా పోన్ మాట్లాడారు దీనితో ప్రతాపరెడ్డి భయపడి రూ.30,000 అకౌంటులో జమ చేశారని ఇది కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయిందని చెప్పారు. ఇలా రెండు నెలల్లో రూ.15 లక్షలు దాకా దోచుకున్నారని చెప్పారు దీనితో వీరిద్దరిని, అరెస్టు చేశామన్నారు.

## తిరుమల కొండపై వైకాపా దోపిడీ అంతా ఇంతా కాదు

### జనసేన ఎమ్మెల్సీ నాగబాబు

విజయవాడ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి భక్తులకి భగవంతుడిని వైకాపా దూరం చేసిందని జనసేన ఎమ్మెల్సీ నాగబాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. 'తిరుమల కొండపై వైకాపా దోపిడీ అంతా ఇంతా కాదు. గెస్ట్‌హౌస్‌ల్లో రూ.500కు దొరికే రూమ్ ఛార్జీలు రూ.1000కి పెంచారు. ఏ మాఫియాని సంతోషపెట్టడానికి ఇలా చేశారో ప్రజలకు తెలుసు. రూ.2.5 కోట్లు ఉన్న తితిదే కామన్ గుడ్ ఫండ్ కాంట్రిబ్యూషన్‌ను ఒక్కసారిగా రూ.50 కోట్లకు పెంచారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో రథం దగ్ధమైతే కేసును సీబీఐ కోర్టుకు అప్పగిస్తామని మసిపూసి మారేడుకాయ చేశారు. దీనిపై ఒక్క వైకాపా నాయకుడూ మాట్లాడలేదు' అని నాగబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 140 మీటర్ల వెడల్పుతోనే

### అధికారుల స్పష్టీకరణ

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఓఆర్ఆర్ (అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు) భూసేకరణ విషయంలో రైతుల ఆందోళన ప్రభుత్వం తెరిదించింది. 140 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మిస్తామని స్పష్టం చేసింది. ముందస్తు ప్రతిపాదనల్లో 140 మీటర్ల వెడల్పు భూమి అని ఉంటే గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొనడంతో రైతుల్లో కలవరం మొదలైంది. ఈ అంశంపై అధికారుల చుట్టూ తిరుగుతూ ఫిర్యాదులు చేస్తున్నారు. కొందరు రైతులు ఆందోళనలు చేపట్టారు. ఇది ముందు జాగ్రత్త కోసమేనని 140 మీటర్ల వెడల్పుతోనే ఓఆర్ఆర్ నిర్మిస్తామని అధికారులు స్పష్టత ఇస్తున్నారు. 3ఏ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తవకుండా: సాధారణంగా 3ఏ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తవకుండా భూమి సర్వేకు అధికారులకు హక్కు ఉండదు. దీంతో కొలతలు తీసి సరిహద్దులు వేయలేరు. జీపీఎస్‌పై ఆధార పడాల్సిందే, ఆందోళన అవసరం లేదు. 140 మీటర్ల వెడల్పును జీపీఎస్ ప్రామాణికంగా తీసుకుని సరిహద్దులు నిర్ధారిస్తే క్షేత్ర స్థాయిలో కొన్నిచోట్ల 510 మీటర్లు తేడా వచ్చే వీలుంది. ఇలాగైతే ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి చేయాల్సిందే. దీంతో ప్రాజెక్టు మరో ఏడాది ఆలస్యం అవుతుంది. ఈ సమస్య రాకుండా ముందు జాగ్రత్తగా నోటిఫికేషన్‌లో 250 మీటర్లని ప్రస్తావించారు. అభ్యంతరాల ప్రక్రియ పూర్తయి సర్వే చేశాక 140 మీటర్లకే క్షేత్రంలో కొలత వేసి సరిహద్దులు నిర్ణయించి ఆ మేరకే భూమి తీసుకుంటారు. ఈ విషయం తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారు. కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం మండలాల్లో 18 గ్రామాల్లో 1,798 సర్వే నంబర్లలో 1,416.31 హెక్టార్లు సేకరించనున్నారు. జనవరి 5న విడుదలైన గెజిట్ నోటిఫికేషన్‌లో 140కు బదులుగా 250 మీటర్ల భూసేకరణ అని ఉంది. 140 మీటర్లే ఎక్కువనీ, 250 మీటర్లు తీసుకుంటే నష్టపోతామనీ, విలువైన పంటలు పండే భూమి కోల్పోయి జీవనోపాధి ప్రశ్నార్థకం అవుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామసభలు, ప్రజా విచారణ చేపట్టకుండా, భూ యజమానులను సంప్రదించకుండా నిర్ణయించారని చెబుతున్నారు. ప్రారంభంలో ఈ రింగ్ రోడ్ 70 మీటర్ల వెడల్పుతో ఉండాలని మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలిపింది. ఆ ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.16,310 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో సివిల్ పనులకు రూ.12,995 కోట్లు, 1,702 హెక్టార్ల భూసేకరణకు రూ.2,665 కోట్లు, 124 హెక్టార్ల అటవీ భూముల సేకరణకు రూ.150 కోట్లు, పర్యావరణ అనుమతులకు రూ.200 కోట్లు, ఇతర వ్యయాలకు రూ.300 కోట్లు కేటాయించారు. ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ కేవలం రాజధాని ప్రాంతంవైపు మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అప్పుడు సీఎం చంద్రబాబు కేంద్రంతో చర్చించారు. ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉంటేనే ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉండే గ్రామాలు, పట్టణాలకు చెందినవారు సులువుగా రాకపోకలు సాగించగలరని ఆయన పేర్కొన్నారు. దీంతో ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మించనున్నారు.

## డిజిటల్ వేధింపులపై నటి ఈషారెబ్బ ఫిర్యాదు



**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** సామాజిక మాధ్యమంలో తనపై అనుచిత, అభ్యంతకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకో వాలంటూ సినీనటి ఈషారెబ్బ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవలి కాలంలో అనామక ఖాతాల నిర్వహిస్తున్న వ్యక్తులు కొందరు డిజిటల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన ఒక పోస్టు నేపథ్యంలో రీల్ మాయ-1 పేరుతో ఉన్న ఖాతాదారుడు అసభ్య, అభ్యంతకర, అగౌరవపరిచే వ్యాఖ్యలు పోస్ట్ చేశాడన్నారు. మహిళగా తన గౌరవాన్ని హరించేవిధంగా ఉన్నాయని, మానసిక వేధింపులకు గురిచేశాయన్నారు. ఈ ఘటన వల్ల తీవ్రమానసిక కలతకు గురవ్వడంతోపాటు ఆందోళనకు లోనయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒక్క సంఘటనే కాకుండా ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. సామాజిక మాధ్యమ వేదికలను దుర్వినియోగం చేస్తూ, వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టరీత్యాచర్యలు తీసుకోవాలని ఈషారెబ్బ కోరారు. ఈ మేరకు పోలీసులు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



హనుమాన్‌జంక్షన్(కృష్ణా), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు సహకరించటం అభినందనీయమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వ నిధులు, పూర్వవిద్యార్థుల విరాళంతో రూ.98.5లక్షల ఖర్చుతో నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ, సిమెంట్‌రోడ్డు, మూడు తరగతి గదులు, కంప్యూటర్‌ల్యాబ్‌ను ఈపాఠశాల పూర్వవిద్యార్థి రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి యం.టి.కృష్ణబాబు, కృష్ణాకలెక్టర్ డికె.బాలాజీలతో కలిసి యార్లగడ్డ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు.


ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ఈపాఠశాల అభివృద్ధికి కృష్ణబాబు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు సహకరించాలని సూచించారు. దాతల సహకారంతో నిర్మించిన విద్యాలయాలు ద్వారా రాష్ట్రంలో ఎంతోమందికి విద్య అందుతుందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తెరిగి బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కృష్ణబాబు మాట్లాడుతూ ఈపాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు మంచి వాతావరణ కల్పించేందుకు పూర్వవిద్యార్థులు కృషిచేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఇతర పాఠశాలలను పూర్వవిద్యార్థులు అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఆర్డీఓ బాలసుబ్రమణ్యం పూర్వవిద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఏకాంత జంటలు టార్గెట్ పోలీసులు అదుపులో ముఠా

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఏకాంతంగా ఉండే జంటలను టార్గెట్ గా చేసుకున్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంటరి జంటల వీడియోలను రికార్డ్ చేస్తూ.. ఆ తర్వాత వారిని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఠా సభ్యులు ఒకరికొకరు గొడవపడుతూ పోలీసులకు దొరికిపోయారు. వీరి సెల్‌ఫోన్లు పరిశీలిస్తే అనేక వీడియోలు బయటపడినట్లు తెలిసింది. దీంతో వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈజీ మనీ.. సులభంగా డబ్బు సంపాదించే మార్గం ఎలా.. పని చేయకుండానే పైసలు సంపాదించటం ఎలా.. ఈ మధ్యకాలంలో ఈ తరహా ధోరణి ఎక్కువైపోయింది. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి సర్వం కోల్పోయేవారు కొందరైతే.. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించేందుకు చెడు మార్గాలు ఎంచుకునే వారు మరికొందరు. మొదటి రకం వారితో సమాజానికి పెద్ద నష్టం లేకపోవచ్చు.. ఎందుకంటే వారికి సొంత నష్టమే తప్ప..పక్కోడికి పోయేదేమీ లేదు. కానీ అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనుకునే వ్యక్తులతోనే అసలు సమస్య. అలాంటి ఘటనే ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ వ్యవహారం గురించి తెలుసుకున్నవారు ఈ రకంగా కూడా డబ్బులు సంపాదిస్తారా అని విస్తుపోతున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఈ మధ్య ఆకతాయిల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. మద్యం మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఓ కొత్త ముఠాను నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్ అరాచకాలు తెలుసుకున్న పోలీసులు.. షాక్ తిన్నారు. అయితే ఈ గ్యాంగ్ వ్యవహారం ఎవరో ఫిర్యాదు చేస్తే కాకుండా వారి స్వయంకృతాపరాధంతో బయటకు వచ్చింది. కొంతమంది యువకులు గొడవపడుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. పరిశీలిస్తే పోలీసులు విస్తుపోయే వీడియోలు వెలుగు చూశాయి. వాటాల పంపిణీలో గొడవలు రావటంతో రోడ్డుపై ఒకరికొకరు ఘర్షణకు దిగారు. ఈ సమయంలోనే పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక ఇదే ముఠాలకు గుర్తింపులేని యూట్యూబ్ చానల్స్,వాట్సాప్‌లో ప్రచారం చేసే అండగా ఉన్నట్లు కీలక సమాచారం. పెళ్ళిళ్ళు,ఇతర శుభకార్యాలకు పిలువకున్నా వెళ్ళి అక్కడ రాద్ధాంతం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు.వీరికి కొందరు పోలీసు ఉద్యోగులు,రెవెన్యూ.,మున్సిపాలిటీ ఉద్యోగులు అండగా ఉండటం గమనార్హం!

## ఎపి ప్రవేశ పరీక్షలు 2026 నోటిఫికేషన్లు విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి యూనివర్సిటీలు కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎపి-సిఇటిస్-2026 కంప్యూటర్ ఆధారిత పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.



వెనిజులా చమురు కొనుగోలుచేస్తే

## భారత్‌కు రూ.27వేల కోట్లు ఆదా

### ఎస్బీఐ రీసెర్చి నివేదిక ప్రస్తావన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్‌పై అవగాహనకు వచ్చిన భారత్ వెనిజులా చమురు కొనుగోలుచేస్తే భారత్‌కు సాలీనా మూడు బిలియన్ డాలర్లు అంటే సుమారుగా రూ.27వేలకోట్లు ఆదా అవుతుందని ఎస్‌బిఐ రీసెర్చి నివేదికలో ప్రస్తావించింది. భారత్‌చమురు కొనుగోళ్లను రషానయనుంచి వెనిజులాకు మళ్లిస్తే దిగుమతుల వ్యయం భారీగా తగ్గ తుందని అంచనావేసింది. వెనిజులా చమురు బ్యారెల్‌పై 10-12 డాలర్ల వరకూ డిస్కౌంట్ లభిస్తే ఆచమురు ఎంచుకోవడం భారత్‌కే లాభదా యకమని వెల్లడించింది. రవాణా వ్యయం ఇతర ఖర్చులు అన్నీ మిన హాయించినా ఏటా భారత్‌కు చమురుదిగుమతుల బిల్లు మూడు బిలియన్ డాలర్లమేర ఆదా అవుతుందని వెల్లడించింది. వెనిజులా ముడిచమురు బ్యారెల్‌ధర సుమారు 51 డాలర్లవద్దట్రేడ్ అవుతున్నట్లు ఎస్‌బిఐ రీసెర్చి నివేదికలో తెలిపింది. భారత్‌ముడిచమురు కొనుగోళ్లు రష్యానుంచి వెనిజు లాకు మళ్లిస్తే వ్యయం ఆదా అవుతుందని వెల్లడించింది. అయితే భౌగోళి కంగా వెనిజులా భారత్‌కు చాలా దూరంగా ఉంది. అక్కడి చమురు రవాణాకు సుదీర్ఘ వ్యవధి పడుతుంది. పశ్చిమాసియా దేశాలతోపోలిస్తే ఐదురెట్లు ఎక్కువ. రష్యానుంచి వచ్చే మయంకంటే రెట్టింపు అవుతుంది. దీనివల్లఅదనపు భారం పెరుగుతుందని మార్కెట్ డీలర్లు చెపుతున్నారు. రష్యా నుంచి డిస్కౌంట్‌దరలకు సుదీర్ఘ కాలం లభించే అవకాశాలు లేవని, ఉక్రెయిన్‌తో యుద్ధ పరిస్థితులు తగ్గితే డిస్కౌంట్ ఆగిపోతుందని ట్రేడర్లు హెచ్చరిస్తున్నారు. దీనితోనే భారత్ వెనిజులా చమురు కొనుగోలుకు మొగ్గుచూపించింది.

# మనమిత్ర హాయ్

## అరకోటికి పెరిగిన యూజర్లు




- 2.50 కోట్లకుపైగా సేవలు (లావాదేవీలు) అందుకున్న యూజరు
- వాట్సప్ గవర్నెన్స్ కు గణనీయంగా పెరుగుతున్న ఆదరణ
- ఉన్న చోటు నుంచే క్షణాల్లో పనులు పూర్తి
- బిల్లుల చెల్లింపుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాల డౌన్‌లోడు వరకు
- అన్నీ మొబైల్ ఫోనులోనే పూర్తి చేసుకునే సదుపాయం
- ప్రతి ఇంటి చిరునామాగా మారిన మనమిత్ర నెంబరు 9552300009

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఏలూరుకు చెందిన ఎం. కిశోర్ బెంగళూరులో ఛార్టెర్డ్ అకౌంటెంటుగా పనిచేస్తున్నారు. గతంలో ఆయన ఏలూరులోని తన సొంత ఆస్తికి సంబంధించి పన్నులు చెల్లించాలన్నా పనులు మానుకుని ఇక్కడికి రావాల్సి వచ్చేది. ఒకటి రెండు రోజులు ఇక్కడ ఉన్న కార్యాలయాల చుట్టూ తిరగడానికే పని సరిపోయేది. ఇప్పుడు ఆయనకు ఆ ఇబ్బంది లేదు. తన మొబైల్ ఫోనులోనే తాను చెల్లించాల్సిన పన్నులు పూర్తి చేసుకుంటున్నారు. మరిన్ని సేవలు పొందుతున్నారు. పల్నాడు జిల్లా నాదేండ్లకు చెందిన సరళది ఇదే తరహా అనుభవం. ఆమె హైదరాబాద్‌లో పనిచేస్తోంది. గతంలో ఆమె పన్నులు కట్టాలన్నా, రెవెన్యూ సేవలు పొందాలన్నా పనులు మానేసుకుని హైదరాబాద్ నుంచి ఇంటికి రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఆమెకు ఆ అవసరం కనిపించడం లేదు. హైదరాబాద్ నుంచే తన మొబైల్ ఫోనులో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా బిల్లులు చెల్లింపు మొదలు, దరఖాస్తు చేసుకోవడం వరకు అన్ని సేవలు పొందుతోంది. ఇటీవలే శ్రీశైలం మల్లన్న స్వామి దర్శనానికి టికెట్లు బుక్ చేసుకుంది. అనకాపల్లి మండలం మామిడిపాలెంకు చెందిన సురేష్ ఒక ప్రవైటు కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నారు. ఉదయం ఆఫీసుకు వెళ్లి ఇంటికి రావాలంటే రాత్రి 8 గంటలవుతుంది. సర్టిఫికెట్ కావాలన్నా, పన్నులు చెల్లించాలన్నా ప్రత్యేకించి సెలవు పెట్టుకుని సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆయనకు ఇప్పుడా అవరం కనిపించడం లేదు. తన మొబైల్ ఫోనులోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే తనకు కావాల్సిన ఓబీసీ సర్టిఫికెట్ కోసం హాయిగా దరఖాస్తు చేసుకున్నారు. మనమిత్రతో ..హాయ్..గా సేవలు పొందుతున్న లక్షలాది మంది పౌరుల్లో వీరు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వ కార్యాలయాలకు ఏమాత్రం వెళ్లాల్సిన పనిలేకుండా తామున్న చోటు నుంచే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పుడు ఏపీలో లక్షలాది మంది ప్రజలు హాయిగా సేవులు పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ఆనందంగా ఆస్వాధిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మనమిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ కు ప్రజల ఆదారణ పెరుగుతోంది. ప్రజలు ఇప్పుడిప్పుడే ఈ సదుపాయం ఉపయోగాలేంటో అర్థం చేసుకుంటున్నారు. వాట్సాప్ ఉపయోగించడానికి మొగ్గ చూపుతున్నారు. మనమిత్ర ఉపయోగించేవారి సంఖ్య ప్రస్తుతం అరకోటి దాటింది. రాష్ట్రంలో ప్రజలెవ్వరూ కూడా తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకే తీసుకెళ్లాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ఆశయం. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేస్తూ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమానికి రూపుకల్పన చేశారు. గత ఏడాది జనవరిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఏడాది కాలంలో వాట్సాప్ గవర్నెన్స్ యూజర్ల సంఖ్య రోజురోజుకీ గణనీయంగా పెరుగుతూ ప్రజాదరణ చూరగొంటోంది. వెయ్యికిపైగా సేవలుమనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు దాదాపు వెయ్యికిపైగా సేవలు కల్పించనుంది. ప్రస్తుతం 900కుపైగా సేవలు మనమిత్ర ద్వారా అందుతున్నాయి. ఈ నెలలో ఈ సేవలు వెయ్యికి దాటనున్నాయి. ఆర్టీసీ బస్సు టికెట్ల రిజర్వేషన్లు మొదలు, మున్సిపాల్టీ, పంచాయతీల్లో ఆస్తిపన్ను, నీటి పన్నుల చెల్లింపులు, కరెంటు బిల్లుల చెల్లింపులు, రెవెన్యూ, పోలీసు, పింఛన్లు, రిజిస్ట్రేషన్ సేవలు, తల్లికి వందనం, సర్టిఫికెట్లు, ఓబీసీ, ఇన్‌కమ్, ప్రభుత్వం నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు, ఫలితాలు కూడా ఇందులోనే డౌన్ లోడు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే సదుపాయం ఇలా పలు రకాల సేవలను మనమిత్ర ద్వారా పౌరులకు అందిస్తోంది. పట్టాదారు పాసుపుస్తకం పొందొచ్చుమనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రెవెన్యూ సేవలు మరింత సులభతరం చేశారు. ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ తమ సెల్‌ఫోన్ లోని వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. 1బీ అడంగళ్ కాపీని ఇందులోనే డౌన్ లోడు చేసుకోవచ్చు. పట్టాదారుపాసుపుస్తకం ఈకాపీని కూడా ఇందులో డౌనులోడు చేసుకోవడంతో పాటు తమ ఆస్థులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. గతంలో ఈ పనుల కోసం ప్రజలు పనులు మానేసుకుని రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఈసీ (ఎన్క్యుంబరెన్సు సర్టిఫికెట్)కూడా ఇందులోంచి డౌను లోడు చేసుకోవచ్చు. ఆలయాల సేవలన్నీతిరుమల శ్రీవారి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి చేసే ఆర్జిత సేవల టికెట్లు, దర్శనాల టికెట్ల బుకింగ్ మొదలు, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, సింహాచలం, అన్నవరం, తదితర ప్రముఖ ఆలయాలతో పాటు దేవాదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో సేవలకు సంబంధించి వాట్సాప్‌లో భక్తులు ముందుగానే నమోదు చేసుకోవచ్చు. అలాగే ఆయా ఆలయాలకు భక్తులు కానుకలను కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈహుండీకి పంపొచ్చు.9552300009 సేవ్ చేసుకోండిమనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులందరూ సులభంగా సేవలు పొందడానికి వారి యాండ్రాయిడ్ మొబైల్ ఫోనులో 9552300009 నెంబరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. వాట్సాప్‌లో ఈ నెంబరుకు హాయ్ అని మెసేజే పంపితే చాలు, అందులో ప్రభుత్వం పౌరులకు అందిస్తున్న సేవలన్నీ కనిపిస్తాయి. పౌరులు తమకు ఎలాంటి సేవలు కావాలో అందులో తెలుసుకుని చాలా సులభంగా ఇట్టే క్షణాల్లో ఆ సేవలను పొందవచ్చు. తెలుగులోనూ పనిచేస్తుందిమనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఇంగ్లీషు, తెలుగు భాషల్లోనూ పనిచేస్తుంది. అందువల్ల పౌరులు దీన్ని ఉపయోగించడం ఎంతో తేలిక. పైగా సేవలు కూడా ఎంతో సులభంగా పనిచేస్తాయి. వాయిస్ ద్వారా కూడావాట్సాప్‌లో టైపు చేయడం తెలీని వారు తమకు ఏం కావాలో వాయిస్ ద్వారా చెప్పడం ద్వారా కూడా ఆ సేవలు పొందవచ్చు. ఆ విధంగా పనిచేసేలా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు) ఆధారితంగా పనిచేస్తుంది. 50 లక్షలకు చేరిన యూజర్లుమనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను రాష్ట్రంలో వినియోగించేవారి సంఖ్య 50 లక్షలకు చేరుకుంది. వీరు పలుమార్లు ప్రభుత్వ సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందారు. ఈ ప్రకారం ఈ యూజర్ల అందుకున్న సేవలు, చేసిన లావాదేవీలు 2.50 కోట్లకుపైగా ఉన్నాయి. వీరంతా కూడా ఎలాంటి అంతరాయాలు లేకుండా క్షణాల్లో సేవలను వాట్సాప్ గవర్నెన్సప్ ద్వారా పొందారు.

## కోటప్పకొండ తిరుణాళ్లను వైభవంగా నిర్వహిస్తాం

- ఆలయాల్లో స్వామి దర్శనానికి సామాన్య భక్తులకే పెద్ద పీట
- త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రతి భక్తుడికీ ఒక ఉచిత లడ్డూ ప్రసాదం
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన బందోబస్తు
- జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్



నరసరావుపేట (పల్నాడుజిల్లా), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రాష్ట్రంలోని దేవాలయాల లో జరిగే ప్రతి పూజా, ప్రతి కైంకర్యములో సామాన్య భక్తులకే పెద్ద పీట వేయాలని కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. త్రికోటేశ్వర స్వామి తిరుణాళ్ల మహోత్స వాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభు త్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈనెల 15 వ తేదీన జరగ నున్న కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై బుధవారం మంత్రి ఆనం ఆధ్వర్యంలో మూడవ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి ఆనం, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదల వాడ అరవిందబాబు, జీవీ. ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మహాశివరాత్రి నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్ల నిర్వహణకు రూ.30 లక్షలు మంజూరు చేయనున్నామని వెల్లడించారు. త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు మజ్జిగ, మంచినీటి సదుపాయాలు అందించాలని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు చిన్న పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాల న్నారు. క్యూ లైన్‌లలో భక్తులు ఎక్కువసేపు నిలబడ కుండా వెంటనే దర్శనం కలిగించేలా చర్యలు తీసుకోవా లని అధికారులకు సూచించారు. వీఐపీ పాసుల విషయంలో గత అనుభవాల దృష్ట్యా వీఐపీ టికెట్లు మంజూరు చేయనున్నామన్నారు. వీఐపీ దర్శన టికెట్ల ఫిబ్రవరి 10 14 వరకూ ఆన్ లైన్ లో సైతం బుక్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. వీఐపీలు వాళ్లకు ఇచ్చిన టైం స్లాట్‌లో మాత్రమే దర్శనం చేసు కునేలా చూడాలన్నారు. త్రికోటేశ్వర స్వామిని దర్శించు కున్న ప్రతి భక్తుడికి ఒక ఉచిత లడ్డూ అందజేస్తా మన్నారు. ఈనెల 12వ తేదీ లోపు తిరుణాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. వృద్ధులు, వికలాం గుల దర్శనానికి అవసరమైన వాహనాలు, ఇతర ఏర్పాట్లు జాగ్రత్తగా చూడలని దేవాదాయ శాఖ అధికా రులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారులకు సూచిం చారు. తిరునాళ్ల సమయంలో లో ఓల్టేజ్, విద్యుత్ అంతరాయాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ గత సంవత్సరం శివరాత్రికి 550 బస్సులు నడిపామని, ఈ సంవత్సరం అంతకుమించి 618 బస్సులు కేటాయించామన్నారు. కేవలం కొండ మీద నుంచి కిందకు భక్తులను తరలించేందుకు 95 బస్సులు కేటాయించామన్నారు. శివరాత్రికి రాత్రి పూట కొండపైన ఉండే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామ న్నారు. ప్రభల సమయంలో వెలుతురు నాణ్యత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా తిరునాళ్లకు భారీగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అరవిందబాబు సూచించారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల దృష్ట్యా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ పనులను సమర్థవంతంగా నిర్వహించాలని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమిష్టి కృషితో కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేసి జిల్లా ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపునిచ్చారు. కోటప్పకొండ తిరుణాళ్లకు 30 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిన మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, ఎస్పి బి. కృష్ణారావులు మాట్లా డుతూ సామాన్య భక్తునికి స్వామి వారి దర్శనం సులభంగా లభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటా మన్నారు. చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో తిరు ణాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కృత్తికా శుక్లా,ఎస్పీ బి కృష్ణారావులు పిలుపునిచ్చారు.

### త్రికోటేశ్వరునికి మంత్రుల ప్రత్యేక పూజలు

ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇన్చార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, దేవస్థానం ధర్మకర్త కొండలరావు బహుదూర్, ఆలయ ఈవో డి చంద్రశేఖర రావు పూర్ణకుంభం తో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రుల వెంట ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, పత్తిపాటి పుల్లారావు, బ్రహ్మారెడ్డి, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలిత్, ఆర్డీవో మధులత వారి వెంట ఉన్నారు. త్రికోటేశ్వరుని దర్శనం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రత్యేక చిత్రపటాన్ని, శేష ఈ సందర్భంగా అధికారులు అందజేశారు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు

## అమెరికా అధ్యక్షుని సిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు

విజయవాడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ వ్యాపార ప్రతిపాదన సంస్థ యూ.ఎస్ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ మంత్రి విశేష సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటించింది. యూ.ఎస్ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ వాషింగ్టన్ డీసీలో ప్రధాన కార్యాలయం కలిగిన ఒక లాభాపేక్షలేని సంస్థ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ కౌన్సిల్ కృషి చేస్తోంది. యూ.ఎస్ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ సీఈఓ ప్రెసిడెంట్ ఎలీషా బి. పులివర్తి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు అమెరికా అధ్యక్షుని పేరుతో ఇచ్చే "ది ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు"ను అందజేశారు. రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల బలోపేతం, మహిళా నేతృత్వంలోని పరిశ్రమలకు ప్రోత్సాహం, సెర్ప్ ద్వారా గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాల పెంపు, స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం చేయడం కోసం చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేశారు.

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం


రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం యూ.ఎస్ ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలోని పెట్టుబడులను, సాంకేతికతను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి, ఎన్ఆర్ఐల భాగస్వామ్యాన్ని పెంచడానికి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో యూ.ఎస్ ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ సిఈఓ/ప్రెసిడెంట్, ఎలీషా బి. పులివర్తి, వైస్ చైర్మన్ కె.శ్రీహరి, ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎమ్.ఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహరన్, ప్రధాన సాంకేతిక సలహాదారు డాక్టర్ ఎమ్. శ్రీనివాస శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రి పరిసరాల్లో పెద్దపులి సంచారం

### సీతానగరం మండలంలో పశువులపై దాడి, రెండు గేదెలు మృతి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ప్రతినిధి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: గత కొద్ది రోజులుగా పులి భయం ప్రజలను వెంటాడుతోంది. మొన్న ఏలూరు జిల్లా, నిన్న తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం.. నేడు రాజమండ్రి.. వరుసగా ఇలా గత కొద్ది రోజులుగా పులి సంచారం భయాందోళనలు రేకెత్తిస్తోంది. నిన్నటి వరకు పులి కనబడకపోయినా.. దాని పాదముద్రలను సీతానగరం మండలంలోని పలు ప్రాంతాల్లో అధికారులు, స్థానికులు గుర్తించారు. పశువులపై కూడా దాడి చేసింది. ఆ దాడిలో రెండు పశువులు మృతి చెందాయి. అయితే మంగళవారం రాత్రి 9గంటల సమయంలో రాజమండ్రి శివారు దివాన్ చెరువు వద్ద పులి దర్జాగా రోడ్డు దాటుతూ వాహనచోదకుల కంట పడింది. దివాన్‌చెరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఎస్‌విపిసి ఫంక్షన్ హాల్ రోడ్డులోని కొబ్బరితోట వద్ద సంచరించింది. భారీ శరీరంతో పెద్ద పులి దర్జాగా రోడ్డుపై నడుస్తూ కనిపించింది. కొద్ది సెకన్లలో రోడ్డు పక్కన ఉన్న పెద్ద కంచెను సరదాగా ఎక్కేసి, అవతలి వైపునకు దూకేసింది. అంత పెద్ద పులి కంటపడటంతో వాహనచోదకులు ఒక్కసారిగా భయాందోళన చెందారు. దీంతో ఉలిక్కిపడిన ఫారెస్ట్, పోలీసు అధికారులు అక్కడకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ టీవి కెమెరాలను పరిశీలించగా.. పెద్ద పులి సంచారం స్పష్టమైంది. ఫారెస్ట్, పోలీసు, రెవెన్యూ అధికారులు నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానికులకు పలు జాగ్రత్తలను తెలిపారు. రాత్రి సమయంలో పెద్ద పులి సంచారం ఎక్కువగా ఉందని, ఎట్టి పరిస్థితు ల్లోనూ పరిసర ప్రాంత ప్రజలు బయటకు రావొద్దని కోరారు. రాజ మహేంద్రవరం సర్కిల్ సీసీఎఫ్ బి.ఎన్.ఎన్. మూర్తి ఆధ్వర్యంలో డీఎఫ్‌వో ప్రభాకరరావు, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డీఆర్‌వో శ్రీనివాస్‌రావు, రాష్ట్ర సిల్వికల్చరిస్ట్ ఆర్.శ్రీనివాసరావు తదితర అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పులిని పట్టుకునేందుకు పూణేలోని నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, బుధవారం ఉదయానికి వారిని రాజమహేంద్రవరం రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే నిన్నటి వరకు సీతానగరం మండలంలో ఆందోళనలు కలిగించిన పెద్దపులి నేడు రాజమండ్రి పరిసర ప్రాంతంలోకి అడుగుపెట్టింది. సీతానగరం నుంచి నగరం వైపు వచ్చిందా? అనే అనుమానాలు బలంగా ఉన్నాయి.

ఇదిలా ఉండగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడు, రేమానుకుంట ప్రాంతాల్లోనూ పెద్దపులి కనిపించిందన్న సమాచారంతో ఉదయగిరి పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలతో గడుపుతున్నారు.



పెద్దపులి దాడిలో మృతి చెందిన గేదెను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, పోలీసులు

## ఇక మూడు రోజుల్లోనే కొత్త కనెక్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** కొత్త విద్యుత్ కనెక్షన్ల నిమిత్తం ఇక నుండి అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటి వరకూ కొత్త కనెక్షన్ కావా లంటే విద్యుత్ శాఖ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా తీవ్ర జాప్యం చేసేవారు. ఈ నేపథ్యంలో విద్యుత్ కనెక్షన్లలో పారదర్శకతను పెంచుతూ జాప్యం జరగకుండా రూపొందించిన కొత్త నిబంధనలు ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి రాబోతున్నాయి. ఇక నుంచి మెట్రో నగరాల్లో విద్యుత్ కొత్త సర్వీసు కోసం వినియోగదారులు దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లోనే కనెక్షన్ విధిగా ఇవ్వాలనే నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. అదేవిధంగా మున్సిపాలిటీల్లో గరిష్టంగా 7 రోజులు, గ్రామీ ణ ప్రాం తాల్లో దరఖాస్తు చేసిన తర్వాత గరిష్టంగా 15 రోజుల్లో కొత్తకనెక్షన్ తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉం టుంది. అలాగే కొండ ప్రాంతాలు లేదా భౌగో ళిక ఇబ్బందులు ఉన్నచోట మాత్రం 30 రోజుల గడు వు పెట్టారు. అదే అవసరమైనచోట స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటివి ఏర్పాటు చేయాల్సి వస్తే కేంద్ర విద్యుత్‌శాఖ నిబంధనల మేరకు గరిష్టంగా 90 రోజుల్లోగా ప్రక్రియ పూర్తి చేయాలి. అదేవిధం గా కొత్తకనెక్షన్ కావాలనుకునే వారు ఇకపై భౌతిక పత్రాలతో అధికారుల వద్దకు వెళ్లా ల్సిన అవసరం లేదు. సంబంధిత విద్యుత్ పంపిణీ సంస్థ అధికా రిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసు కోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డ్, ఆస్తి పత్రాలు వంటి అవసరమైన సర్టిఫికెట్లను స్కాన్‌చేసి అప్లోడ్ చేస్తే సరిపోతుంది. దరఖాస్తు ఏ దశలో ఉందో ఆన్లైన్లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ట్రాక్‌చేయవచ్చు. దీంతో ఒకవేళ ఎవ రైనా విద్యుత్ పంపిణీ సంస్థ అధికారుల నిరక్ష్యం వల్ల జాప్యం జరిగితే ఆటోమేటిక్‌గా ఉన్నతా ధికారులకు ఆ సమాచారం అందుతుంది.



## బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్‌కు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** తెలంగాణ పర్యటనలో మహబూబ్ నగర్‌లో నిర్వహించిన విజయసంకల్ప సభకు హాజరైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ మేరకు బుధ వారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతోపాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడికి స్వాగతం పలికేందుకు విమానా శ్రయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న బీజేపీ కార్యకర్తలు, అభిమానులు కార్యకర్తలకు అభివాదం చేస్తూ విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన నితిన్ నబిన్ మహబూబ్‌నగర్ విజయ సంకల్ప సభలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణుల నినాదాలతో ఎయిర్ పోర్టు పరిస రాలు మార్మోగాయి. మహబూబ్‌నగర్ సభ అనంతరం నితిన్ నబిన్ బుధ వారం రాత్రి తిరిగి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్‌నబీన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా బుధవారం తెలంగాణకు రావడంతో ఆయన పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## గెలిచే దమ్ములేక మా అభ్యర్థులను ఎత్తుకెళ్తున్నారు..

### మాజీమంత్రి హరీశ్‌రావు నిశిత విమర్శ

**మెదక్, ఫిబ్రవరి 4, ప్రభాతవార ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీకి గెలిచే దమ్ములేక, ఓడిపోతామనే భయంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులను బెదిరించి, ప్రలోభపెట్టి పార్టీలు మారుస్తున్నారని మాజీ మంత్రి, హరీశ్‌రావు మండిపడ్డారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషపై, పాలనపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి గెలిచే సత్తా ఉంటే మా అభ్యర్థులను ఎందుకు ఎత్తుకెళ్తున్నారు? జనం మీకు ఓటు వేయరని అర్థమై.. పోలీసులతో బెదరించి, బ్లాక్ మెయిల్ చేసి కండువాలు కప్పు తున్నారు. ఎవరెవరు అమ్ముడుపోతున్నారో, ఎవరు ఎందుకు ఎత్తుకుపోతున్నారో అందరినీ గుర్తుపెట్టుకుంటాం. సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం. ఇప్పటివరకు రైతుబంధు ఇవ్వలేదు. ఈ నెల 11వ తేదీలోగా రైతు బంధు పడకపోతే.. నిన్ను చీరిచింతకు చెండాడుతారు. మెదక్ జిల్లా కల నెరవేర్చింది కేసీఆర్. ఇక్కడికి కలెక్టర్ ఆఫీసు, ఎస్పీ ఆఫీసు, రైలు, నాలుగు లైన్ల రోడ్డు తెచ్చింది కేసీఆర్. ఘనపూర్ ఆయకట్టుకు నీళ్లు ఇచ్చింది మేము. సిద్దిపేటతో సమానంగా మెదక్‌ను అభివృద్ధి చేశాం. కాంగ్రెస్ వచ్చాక ఇక్కడ ఒక్క రూపాయి పని జరగలేదు. మెదక్‌లో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు.ఏ కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా మీకు మీ హరీశ్ అన్న ఉన్నాడు.. నేను చూసుకుంటా. కాంగ్రెస్ గుండా రాజకీయాన్ని, మోసాలను ఎండగట్టండి. బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చారు. కాబట్టి కారు గుర్తుకే ఓటు వేసి బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించండి. మెదక్ అభివృద్ధిని కొనసాగిద్దామని ఆయన అన్నారు.

## వ్యవసాయ వర్సిటీ పేరుతో నకిలీ సర్టిఫికెట్

### విచారణ జరిపిన యూనివర్సిటీ

### ఈ బాగోతంపై వ్యవసాయ శాఖకు సమాచారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీసు ఏఈవోల పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ అంశం మరవకముందే ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకవర్గం చాకచక్యంగా వ్యవహరించి మరో అక్రమాన్ని వెలుగులోకి తెచ్చింది. ఎం.రాధ అనే వ్యక్తి 2005లో పాలెం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా చదివినట్లు నకిలీ సర్టిఫికెట్‌ను సమర్పించి వ్యవసాయ శాఖలో ఏఈవోగా పని చేస్తున్నారని విచారణ నిర్వహించి తేల్చింది. 2003..2005 మధ్య రాధ పేరుతో ఎవరూ వ్యవసాయ డిప్లమా కోర్సు చదవలేదని విచారణలో తేలింది. అయితే ఎం. రాధ (తండ్రి ఎం.రాజన్న) వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, పాలెంలో ఐడీ నంబర్ పీఏపీ/2003/46తో చదివిన బి. దేవరాజ్ అనే వ్యక్తి సర్టిఫికెట్‌ను తన పేరు మీద మార్చుకుని వ్యవసాయ శాఖలో ఏఈవోగా ఉద్యోగం పొందినట్లు సమాచారం. ఈ అంశంపై వ్యవసాయ శాఖ సంచాలకులకి సమాచారం అందించినట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.



మహిళలకు డ్రైవర్లుగా ఉపాధి కల్పించేందుకు వివిసి మోటార్స్‌తో ఎంఒయు కుదుర్చుకున్న డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారుసిన్హా. చిత్రంలో వివిసి మోటార్స్ సంస్థ ప్రతినిధులు

## మహిళలకు డ్రైవర్లుగా ఉపాధి కల్పనకు వివిసి మోటార్స్‌తో డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఒప్పందం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) మరో ముందడుగు వేసింది. ఇప్పటికే జంట నగరాలలో డ్రైవింగ్‌లో నైపుణ్యం వున్న మహిళలకు బైక్, క్యాబ్ డ్రైవర్లుగా అవకాశం కల్పించిన డబ్ల్యుఎస్‌డబ్ల్యు తాజాగా గ్రేటర్ పరిధిలో మరో 500 మంది మహిళలకు ఇదే డ్రైవింగ్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాల డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చి వారు సొంతంగా వాహ నాలను నడిపేలా చూసేందుకు నిశ్చయించింది. ఇందుకుగానూ డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారు సిన్హా వివిసీ మోటార్స్ అనే సంస్థతో బుధవార ం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మహేంద్ర లాస్ట్ మైల్ మొబిలిటి అధికారిక భాగస్వామి అయిన ఈ సంస్థ ఎలక్ట్రిక్ వాహనాల పంపిణీలో అగ్రగామిగా వుంది. ఈ నేపథ్యంలో మహిళల కోసం ఎలక్ట్రిక్ మొబిలిటి పైలట్ ప్రాజెక్టును అమలు చేసేందుకు డబ్ల్యుఎస్‌డబ్ల్యు వివిసీ మోటార్స్ స ంస్థ ముందుకు వచ్చాయి. తొలి విడతగా 500 మందిని ఎంపిక చేసి వారికి వాహనాలను నడపడంలో శిక్షణ ఇచ్చి ఎలక్ట్రిక్ వాహ నాలను అందించేందుకు నిర్ణయించారు. దీనివల్ల ఎం పికైన మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారు సిన్హా తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలులో మహిళల ఎంపిక బాధ్యత డబ్ల్యుఎస డబ్ల్యు చేబట్టనుండగా వారికి శిక్షణను వివిసీ మోటార్స్ చేబట్టనుంది. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం అధికారులతో పాటు వివిసీ మోటార్స్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# ఈ యేడాది మిర్చి రైతుల కంట సంతోషం

### క్వింటాల్‌కు రూ. 41 వేలు దాటిన వైనం

### రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఈ యేడాది మిర్చి (ఎర్రబంగారం) రైతులకు కలిసివస్తోంది. గత ఏడాది మిర్చి ధరలు భారీగా పతనమవడంతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడం సంతోషాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్లలో ఎర్ర బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వరంగల్ ఏనమాముల, ఖమ్మం, కరీంనగర్ తదితర వ్యవసాయ మార్కెట్లకు మిర్చిపంట పెద్ద ఎత్తున వస్తోంది. రాష్ట్రంలో తెలంగాణలో దేశీ రకం మిర్చి ఇప్పటికే 41 వేల రూపాయల మైలు రాయిని దాటింది. వరంగల్‌లోని ఏను మాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధరలు పైపైకి ఎగబాకుతు న్నాయి. పసిడి ధరలతో పోటీపడి పరుగులు పెడుతున్నాయి. దేశీ రకం టమాటా మిర్చి ఈ ఏడాది ఇప్పటివరకు రికార్డు ధర పలికింది.. క్వింటా దేశీరకం మిర్చి 41,200 రూపాయలు ధర పలుకుతుంది. దేశీ మిర్చి పండించిన రైతులు ఆనందంతో మురిసిపోతున్నారు.మరోవైపు ఎల్లో మిర్చి (పసుపు రకం మిరపకాయలు) క్వింటా 44 వేల రూపాయలు పలుకుతుంది.వండర్ హాట్ మిర్చి రకానికి కూడా డిమాండ్ పెరిగింది. రెండు రోజుల క్రితం వరకు క్వింటా రూ.32,000 రూపాయలు పలికిన వండర్ హాట్ మిర్చి ధర ఒక్కరోజులోనే అయిదు వేలు పెరిగింది. ఈరోజు క్వింటా వండర్ హాట్ మిర్చి ధర రూ.37,100 కు పెరిగింది. ఈ రకం మిర్చికి ఉన్న ఘాటు, రంగు కారణంగా మసాలా కంపెనీల నుండి భారీ ఆర్డర్లు వస్తున్నాయి. గతంలో ఎన్నడు లేనివిధంగా అన్నిరకాల మిర్చి ధరలు పసిడితో పోటీపడి పైపైకి ఎగబాకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో మిర్చి ధరలకు ఫుల్ డిమాండ్ ఉండడంతోపాటు మధ్యప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో మిర్చి సాగు తగ్గడం వల్ల ఇక్కడ ఈ ఏడాది మిర్చికి భారీ డిమాండ్ పెరిగిందని వ్యాపారులు, అధికారులు చెబుతున్నారు.

# రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

### నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత

### సింగరేణి సిఎండి కృష్ణభాస్కర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఇకపై రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సిఎండి డి కృష్ణభాస్కర్ స్పష్టం చేశారు. అలాగే 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఈ యేడాది పలు కారణాల వల్ల నెలవారీ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నామని, అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రతీ రోజూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణాతో పాటు, 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొల గింపు లక్ష్యంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి, రవాణాలో నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిస్తూ లక్ష్యాలు సాధించాలని వెల్లడిం చారు. హైదరాబాద్‌లో సంస్థ డైరెక్టర్లు మరియు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత గల బొగ్గును మాత్రమే వినియోగదారులు కోరుతు న్నారని, ఈ దిశగా అన్ని రకాల చర్యలు తీసు కోవాల్సిందిగా తెలియచేశారు. నేడు బొగ్గు మార్కెట్లో విని యోగదారులు తమకు అవసరమైన నాణ్యత గల బొగ్గును మాత్రమే స్వీకరిస్తున్నారని, కనుక బొగ్గు పరిమాణం కన్నా బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు గట్టి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ అధికారి, ఉద్యోగి ఈ దిశగా శ్రమిస్తేనే సంస్థకు భవిష్యత్తు ఉంటుం దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, పొత్రు గౌతమ్, ఎం.తిరుమలరావు, ఇడి బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కేన్సర్ మరణ శాసనం కాదు.. జీవనశైలే కారణం

### కిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి



కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న మెగాస్టార్ చిరంజీవి

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** కేన్సర్ మరణ శాసనం కాదని, ఆ వ్యాధి దేవుడు ఇచ్చిన శాపం కూడా కాదని, అది మన జీవన విధానంలో మనతో మొదలవుతుందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. బుధవారం సికిం దరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన చిరంజీవి ముందుగా జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేన్సర్ అనగానే జీవితం ముగిసినట్లేనని అంతా అనుకుంటున్నారని, ఇక్కడ ఇంతమంది కేన్సర్ వ్యాధిని జయించిన వారిని చూస్తుంటే డాక్టర్లు ఎంత కష్టపడుతున్నారో అర్థమవుతుంద న్నారు. మన జీవనశైలి ఆధారంగానే మనకు వ్యాధులు వస్తుంటాయ న్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ ఎంతోమంది చిన్నారులు కూడా కేన్సర్ బారిన పడ్డారంటే వారిని చూసి తనకెంతో బాధగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన పెంచుకొని ఆయా లక్ష ణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ రోబోటిక్ సర్జన్ డా.మధు దేవరశెట్టి మాట్లాడుతూ గతంలో 40, 50 సంవత్సరాల పైబడిన వారికే కేన్సర్ వ్యాధి వచ్చేదన్నారు. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా చిన్నవయసు వారు 5 నుంచి 10 సంవత్సరాల పిల్లలు కూడా కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. దీనికి కారణం జన్యుపరమైన లోపాలు, వంశపారంపర్యం, రేడియేషన్, రసాయన పదార్థాలు, ఎరువుల వాడకం, మద్యం, ధూమపానం, ఒత్తిడికి గురైతే డయాబెటిస్.. ఇలా చాలారకాల కారణాలు ఉన్నాయన్నారు. కేన్సర్ చికిత్స కోసం అనేక రకాలైన అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. చికిత్స చేయించుకున్న తర్వాత కూడా ఎక్కువ కాలం బతికే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కేన్సర్‌ను జయించిన వారు తమ అను భవాలను వెల్లడించారు.కార్యక్రమంలో మెడికల్ డైరక్టర్ డా.సంబిత్‌సాహూ, మెడికల్ ఆంకాలజిస్ట్ డా.నరేందర్‌కుమార్ తోట, కేన్సర్ చికిత్స పొందిన వారు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

### గెజిట్ ప్రకటన విడుదల



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగ మమైంది. రాజ్యాంగంలోని 356వ అధికర ణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేసిన తర్వాత తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు.

ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యమ్నాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 యేళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నా హాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చు కున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీ ణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు.

### కూకట్‌పల్లిలో ఎసిబి దాడులు.. సూపరింటెండెంట్ ఇంజినీర్ అరెస్ట్

# కోట్ల బిల్లుల విడుదలకు రూ.30 లక్షల లంచం



లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడిన అధికారులు

**హైదరాబాద్ (మూసాపేట్), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి జోనల్ కార్యా లయంలో అవినీతి ఆరోపణలు తీవ్రంగా చర్చనీయాంశమవుతున్న సమయంలో, ఎసిబి అధికారులు జరిపిన దాడులు సంచలనంగా మారాయి. ప్రభుత్వ పనుల బిల్లుల విడుదల పేరుతో భారీ లంచం డిమాండ్ చేసిన సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.చిన్నారెడ్డి ఎసిబి ఉచ్చులో చిక్కాడు. బుధవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో చిన్నారెడ్డి లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. రంగారెడ్డి రేంజ్ ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి జోనల్ పరిధిలో అల్వాల్, కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్లలో చెరువుల పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించి రూ.1 కోటి 40 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ బిల్లులు విడుదల చేయాలంటే మొదట రూ.40 లక్షలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేసిన చిన్నారెడ్డి, అనంతరం రూ.30 లక్షలకు తగ్గేది లేదని స్పష్టం చేసినట్లు కాంట్రాక్టర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒకేసారి అంత మొత్తం ఇవ్వలేనని చెప్ప డంతో, విడతల వా రీగా చెల్లించేందుకు కాం ట్రాక్టర్ అంగీకరించాడు. ఫిర్యాదు మేరకు పథకం రచించిన ఎబిసి అధికా రులు, బుధవారం తొలి విడతగా రూ.15 లక్షలను చిన్నారెడ్డి తరఫున కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ చేతికి అందజే స్తున్న సమయంలో రెడ్‌హ్యాం డెడ్‌గా పట్టు కున్నారు. ఈ కేసులో చిన్నా రెడ్డితోపాటు మధ్యవర్తుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు రంగారెడ్డి రేంజ్ ఎసిబి డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు.

## నష్టాల మదర్ డెయిరీని గట్టెక్కించే యత్నం

### ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** నష్టాల్లో ఉన్న తెలంగాణలోని మదర్ డెయిరీని గట్టెక్కించే ప్రయత్నం చేస్తామని డెయిరీ ఛైర్మన్ గుడిపాడి మధుసూధన్ వెల్లడించారు. రూ.70 కోట్ల నష్టాల్లో ఉన్న సంస్థను కాపాడేందుకు తాము ప్రయత్నిస్తుంటే ఆ నష్టాలకు కారణమైన గత ఛైర్మన్ అడ్డుకుని జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) అధికారులు రాకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డెయిరీ కార్యాలయంలో ఐదుగురు పాలకవర్గం సభ్యులతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ డెయిరీతో ఒప్పందానికి ప్రయత్నిస్తున్నామని, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం గ్రాంటు ఇస్తుందా లేక ఎన్‌డీడీబీకి అప్పగిస్తుందా అనేది 15వ తేదీకల్లా తేలుతుందన్నారు. ఉద్యోగుల వేతనాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మదర్ డెయిరీకి 13 ఏళ్ల పని చేసిన గత ఛైర్మన్ సంస్థను భ్రష్టు పట్టించారన్నారు. నష్టాల్లో ఉన్న సంస్థను లాభాల్లో ఉన్నట్లు చూపించి, దానికి దొంగ ఆడిట్ చేయించి ఆదాయ పన్ను కట్టించారని ఆరోపించారు. పాలకవర్గంపై చేసిన ఆరోపణలను ఖండించారు. ప్రభుత్వంతో మాట్లాడి రూ.35కోట్లు ఇప్పిస్తానంటూ గత ఛైర్మన్ రైతులకు అబద్ధంచెప్పి సంతకాల సేకరణ చేశారన్నారు. రూ.35 కోట్లు రైతులు, ఉద్యోగుల ఖాతాల్లో జమచేస్తే తామే రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. చిట్యాలలో ఎకరా భూమి రూ.5 లక్షల చొప్పున కొని రూ.16 లక్షలకు కొన్నట్లు లెక్కలు చూపించారన్నారు. ఆ సొమ్ముతో 150 ఎకరాల భూమి వచ్చేదని తెలిపారు. 2023లో తాను ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసే నాటికి మదర్ డెయిరీ రూ.35 కోట్లు నష్టాల్లో ఉండ గా రూ.కోటీ 85 లక్షల లాభాల్లో ఉన్నట్లు చూపించి రూ.43 లక్షలు ఐటీ కట్టించడంతో సంస్థ మరింత నష్టాల్లోకి వెళ్లిందని వెల్లడించారు.

## బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై కేసు నమోదు

### పోలీసు శాఖను బెదరించే రీతిలో వ్యాఖ్యలు

### రాష్ట్ర పోలీసుల అధికారుల సంఘం ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ ఆర్మూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిపై బంజారాహిల్స్ ఠాణాలో నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదైంది. సిట్ విచారణను ప్రభావితం చేయడంతోపాటు పోలీసు శాఖను బెదరించే రీతిలో అతని వ్యాఖ్యలు ఉన్నాయంటూ తెలంగాణ పోలీసు అధికారుల సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా ఈ నెల 1న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సిట్ విచారిస్తున్న సమయంలో, బంజారా హిల్స్‌లోని బిఆర్‌ఎస్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర పోలీస్ శాఖతోపాటు ఐపీఎస్ అధికారి, నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్‌పై అవమానకరమైన, బెదరింపు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు మీడియా చానళ్లలో విస్తృతంగా ప్రసారమై, పోలీస్ బలగాల మనోధైర్యాన్ని దెబ్బతీయడంతోపాటు, సిట్ విచారణను అడ్డు కునేలా, ప్రభావితం చేసేలా ఉన్నాయని తెలంగాణ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధి నల్లా శంకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపించారు. ఘట నపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద జీవన్‌రెడ్డిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి(ఫైల్)



## ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉంది

### మెట్ట భూములకు నీటి సౌకర్యం

### సిఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**చొప్పదండి, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భవిష్యత్తు తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు ఈ మేరకు గురువారం చొప్పదండి నియోజకవర్గం కేంద్రంలోని గుమ్మలాపూర్ గ్రామంలో నిర్వహించే ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థల పరిశీలన చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యంతో కలిసి పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు గత ప్రభుత్వం పోటీల నిర్మాణానికి భూమి పూజలు చేసి వదిలిపెట్టిందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే పోటీల నిర్మాణాన్ని చేపట్టి అన్నదాతలకు సాగునీరును అందిస్తున్నామని అన్నారు గత ప్రభుత్వం కొండగట్టుకు నిధులు కేటాయించమని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు కనీసం ఒక్క రూపాయి కూడా కేసీఆర్ ప్రభుత్వ హాయంలో కొండగట్టు అభివృద్ధికి కేటాయించలేదని ఆరోపించారు కొండగట్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేస్తుందని అన్నారు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలన్నీ ప్రజల అభ్యున్నతి కోసమే ఏర్పాటు చేసి అమలు చేస్తున్నామని ఓటు అడిగే హక్కు కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని అన్నారు గత సర్పంచ్ ఎన్నికలలో ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందాన్ని అదే సత్తా పురపాలక సంఘం నగరపాలక సంఘం ఎన్నికలలో ఉంటుందని అన్నారు లేనిపోని రాజకీయాలు చేస్తున్నారని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని తమకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని మేము తలుచుకుంటే లాగుల తొండలు కూడా ఎక్కించగలమని అన్నారు ఆర్‌ఎస్పి ప్రవీణ్ కుమార్ దిగజారుడు రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు బి ఆర్ ఎస్ పార్టీ నాలుగు యూట్యూబ్ ఛానల్ లను చెక్కభజన చేసేలా పెట్టుకుని చిందులు వేస్తుందని అన్నారు రాష్ట్రంలోని అన్ని స్థానాలను కైవసం చేసుకుంటామని పేర్కొన్నారు మెట్ట ప్రాంతాలకు నీటి వసతులను కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవాలను చేస్తారని పేర్కొన్నారు రహదారులు విద్య వైద్యాలను ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో చూస్తున్నారని పేర్కొన్నారు.

# బుల్లెట్‌పై లద్దాఖ్ ప్రయాణం






.. బుల్లెట్‌పై సుదూర ప్రయాణాలు చేస్తుంటే.. ఏదో తెలియని ఉత్సాహం వస్తుంది. పైగా ఇవి ఎన్నో జీవిత పాఠాలనీ నేర్పుతున్నాయి అంటారు నీరజ వేలమూరి. అవేంటో ఆమె మాటల్లోనే..

మాది విశాఖపట్నం. అమ్మ పద్మావతి. నాన్న మూర్తి, ఉద్యోగరీత్యా అసోం, ఢిల్లీ, విశాఖ తదితర ప్రాంతాల్లో నా చదువు సాగింది. ఇండోర్ ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేశా. నాన్నకు బైక్ రైడింగ్ అంటే చాలా ఇష్టం. బుల్లెట్పై లద్దాఖ్ వెళ్లాలనేది ఆయన కోరిక, బాధ్యతల వల్ల వీలుపడలేదు. కానీ ఆ విశేషాల్ని చెబుతుండేవారు. దాంతో బైక్ రైడింగ్ మీద ఇష్టం ఏర్పడటంతోపాటు నాకూ లద్దాఖ్ అందాలు చూడాలన్న కోరిక బలపడింది.

తొమ్మిదో తరగతిలోనే స్కూటీ నేర్చుకున్న తర్వాత అన్నయ్య బైక్ నేర్పించాడు. ఓ సంస్థలో బైక్ రైడింగ్ కోర్సులో చేరి మెలకువలూ నేర్చుకున్నా. ప్రస్తుతం ఉద్యోగరీత్యా గురుగ్రామంలో ఉంటున్నా బైక్ రైడ్స్ అంటే ఇష్టమే.... కానీ, మొదట్లో ఎలా, ఎక్కడి నుంచి మొదలు పెట్టాలన్న స్పష్టత లేదు. ఈ రోజు ఓ నా సహోద్యోగులు ఉత్తరాఖండ్లోని రిషికేశకు బైకుల మీద వెళ్తున్నారని తెలిసింది. నేనూ వస్తా అన్నా. అమ్మాయి అంత దూరం బైక్ ఏం నడుపుతుంది. అనుకున్నారంతా. సగం నుంచే వెనక్కి వెళ్లిపోతుందిలే అని అనుకున్న వాళ్లూ లేకపోలేదు. వాళ్ల అంచనాలన్నీ తారుమారు చేస్తూ... రిషికేశ్ మొత్తం చుట్టొచ్చా. అలా 2025 ఏప్రిల్ కల్లా గంగోత్రి పంజాబ్‌లోని అమృత్సర్, హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలి... ఇలా దాదాపు 4వేల కి.మీ. బైక్ మీద వాహనాల. ఈ ప్రయాణాలకు వాడే బైక్ కూడా నాన్నదే. ఆయనకు 45 ఏళ్లు వచ్చాక చాలా ఇష్టపడి కొనుక్కున్నారు. దీన్ని నేను ఉద్యోగం చేస్తూనే దీన్నో వ్యాపకంగా కొనసాగుతున్నా ఇటీవల అనుకోకుండా నేను కలల కన్న లద్దాఖ్‌కు వెళ్లే అవకాశమూ వచ్చింది.


**ఇబ్బందులు దాటుకుని....** ఎండ, వాన, ఒక్కోసారి మైనస్ డిగ్రీలు... లద్దాక్‌లోని ఉమింగ్ లా చేరుకునే అవకాశం మాకు ఎదురైన వాతావరణ పరిస్థితులివి. 19,024 అడుగుల ఎత్తులో ఉంటుందీ ప్రాంతం. గురుగ్రామ్ నుంచి రానూపోనూ 4800 కి.మీ. 17 రోజులపాటు సాగింది ప్రయాణం ఒక్కోసారి 300400 కి.మీ. అంతా పెట్రోల్ బంకులు ఉండేవి కాదు. వెళ్లే మార్గం మంచుతో మూసుకుపోయిన రోజులూ ఉన్నాయి. దాంతో రెండు మూడు రోజులు టెంట్లలోనే గడిపాం. టైములో గాలి తగ్గించి మంచుతో నిండిన రహదారిలోనూ ప్రయాణం చేశాం. చివరికి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నా. ఈ కోరిక ఎన్నో పాఠాల్నీ నేర్పుకున్నా, ఓపిక, సహనం, రక్షణ, కష్టం సుఖం నందిని నేర్పింది ప్రయాణం. తొందరలోనే నాన్నను కూడా లద్దాఖ్ తీసుకు వెళ్లాలి.

# వాకింగ్‌తో ఒత్తిడి, డిప్రెషన్ దూరం !

## వ్యథ

ప్ర: నేను చాలా రోజులుగా తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాను. ఇటీవల డిప్రెషన్ కూడా మొదలైంది.ఆకలి లేదు, నిద్ర రావడం లేదు. ఎప్పుడూ ఏదో భయం, ఆందోళన. అప్పుడప్పుడు ఆత్మహత్య ఆలోచనలు కూడా వస్తున్నాయి.నా సమస్యలకు ప్రధాన కారణం మా అనుమానం. మా వీధిలో ఎవరు మా ఇంటివైపు చూసినా, నాపై అనుమాన పడి గొడవచేస్తారు.నా వయస్సు 45 ఏళ్లు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అన్నీ భరిస్తున్నాను. ఇటీవల ఒక సైకాలజిస్ట్‌ను కలిస్తే కౌన్సెలింగ్ చేశారు.రోజూ అర్థగంట వాకింగ్, 10 నిమిషాలు ధ్యానం చేయమన్నారు. నా భర్తను కూడా కౌన్సెలింగ్‌కు తీసుకుని రమ్మన్నారు. కానీ నా భర్త మారకుండా, సమస్యలు అలాగే ఉంటే, వాకింగ్ చేస్తే ఒత్తిడి, డిప్రెషన్ ఎలా తగ్గుతాయో నాకు అర్థం కావడం లేదు. నాకు సరైన దారి చూపండి.

–ఒక సోదరి విజయవాడ



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు



జవాబు : అమ్మా..ముందుగా ఒక విషయం స్పష్టంగా చెప్పాలి.మీరు తప్పు చేయలేదు. మీది బలహీనత కాదు త్యాగం. 'సమస్య అలాగే ఉంటే, వాకింగ్ వల్ల ఏమి మారుతుంది?" మీ సందేహం సహజమే. వాకింగ్ సమస్యను మార్చక పోవచ్చు, కానీ మిమ్మల్ని బలంగా మారుస్తుంది. వాకింగ్ మీ భర్తను మార్చి మీ సమస్యలను పరిష్కరించదు. కానీ, మారని పరిస్థితుల్లో కూడా మీలో ఆత్మ విశ్వాసం పెరగడానికి దోహదపడుతుంది. ఇది శాస్త్రీయంగా నిరూపితమైన నిజం. వాకింగ్ వల్ల మెదడులో ఎండార్ఫిన్స్, సెరటోనిన్, డోపమైన్ వంటి"హ్యాపీ హార్మోన్లు" విడుదలవుతాయి. ఇవి మనసుకు ప్రశాంతత, ఆశావాద దృక్పథం, ధైర్యాన్ని ఇస్తాయి. ఒత్తిడికి కారణమైన కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గుతుంది. దీంతో ఆందోళన, టెన్షన్ క్రమంగా తగ్గుతాయి. నిద్రలేమికి వాకింగ్ మంచి మందు. డిప్రెషన్‌లో ఉన్నవారికి నిద్ర సమస్యలు సాధారణం. రోజూ నడిస్తే శరీరం సహజంగా అలసి పోతుంది. దాంతో నిద్ర బాగా పడుతుంది. ప్రకృతి మధ్య నడక అదనపు లాభం. ఉదయం సూర్యకాంతిలో లేదా పచ్చదనం మధ్య నడిస్తే మెదడులో మెలటోనిన్ సమతుల్యత ఏర్పడుతుంది. నెగటివ్ ఆలోచనలు తగ్గుతాయి. మనసు తేలిక పడుతుంది. ఆత్మహత్య ఆలోచనలు వచ్చినప్పుడు ఒంటరిగా ఉండకండి. మౌనంగా భరించకండి. వెంటనే నమ్మకమైన వ్యక్తిని, మానసిక వైద్యుడిని సంప్రదించండిమీ భర్తలో అనుమానపు రుగ్మత ఉండే అవకాశం ఉంది.. ఇలాంటి సమస్యలు కౌన్సెలింగ్, చికిత్స ద్వారా మారవచ్చు. ఒకవేళ డిప్రెషన్ తీవ్రంగా ఉంటే సైకియాట్రిస్ట్‌ను కలిసి మందులు వాడటం అవసరం. శరీరాన్ని కదిలిస్తే, మనసు కదులుతుంది.మనసు కదిలితే, జీవితానికి దారి కనిపిస్తుంది.మీరు ఒంటరిగా లేరు. సహాయం ఉంది. ఆశ ఇంకా మిగిలే ఉంది.

# శరణు వేడితే చాలు !



నల్ల మస్తాన్ గారు గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి,మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు. షిరిడీలోని ద్వారాకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంట బడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకా మాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి.

సాయి రక్షణ పొందిన చాలు భీతికి తావు ఉండదు.

- యం.పి.సాయినాథ్

# కింద కూర్చుంటే ఆందోళన తగ్గుతుంది..



ఒకప్పుడు నేలపైనే నిలబడి భోజనం చేసేవాళ్లం. వీధి అరుగులే సోఫాలు... గిన్నెలు తోమాలన్నా, దుస్తులు ఉతకాలన్నా కింద కూర్చునే... కానీ, ఇప్పుడు ఆ అవకాశం? నేలపై కూర్చోవడం వల్ల వెన్నెముక సహజ స్థితిలో ఉంటుంది. కుర్చీలో కూర్చున్నప్పుడు వచ్చే వంపు తప్పుతుంది. ముఖ్యంగా దేన్నీ అనుకోకుండా కూర్చోవడం వల్ల పొట్ట, వీపు కండరాలు బలోపేతమవుతాయి. వెన్ను నొప్పి తగ్గుతుంది.

✦. తుంటి, మోకాళ్లు, చీలమండలు సాగుతాయి. వీటివల్ల పెద్ద వయసులోనూ నేల మీద నుంచి సులువుగా లేవగలుగుతారు. ఇది దీర్ఘాయువుకు సంకేతమట. కాళ్ళు ముడుచుకుని కూర్చోవడం వల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. ✦ నేలపై కూర్చుని ముందుకు వంగి తినడం, తిరిగి వెనక్కు వచ్చే కదలిక జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గించడం.

✦. మహిళలు నేలపై సరైన భంగిమలో కూర్చోవడం వల్ల పెల్విక్ కండరాలు బలపడతాయి. ఇది, ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. మనస్సుని ప్రశాంతంగా ఉంచుతుంది.

# పిల్లలకు డైరీ కొన్నారా?



కొత్త సంవత్సరం అనగానే గుర్తొచ్చే అంశాల్లో డైరీ ఒకటి. పెద్దవాళ్లకే కాదు, పిల్లలకూ ఇది ముఖ్యమే. మొబైల్ స్క్రీన్‌లకు అతుక్కుపోతున్న ఈరోజుల్లో ఇది ఇంకా అవసరం. చిన్నప్పట్నుంచే డైరీ రాయడం అలవాటు చేసుకుంటే.. తమ ఆలోచనలూ, భావనల్ని వ్యక్తపరచడం పిల్లలకు తెలుస్తుంది. కొద్దిసేపు కుదురుగా కూర్చోవడం, ఆలోచనలపైన ధ్యాస పెట్టడంవల్ల ఇది ధ్యానంలా పనిచేస్తుంది. రాతవల్ల ఆలోచనల సరళి మెరుగవుతుంది. అనుభవం నుంచినేర్చుకోవడం, లక్ష్యం నిర్దేశించుకోవడం, ఆత్మశోధన... ఇవన్నీ సాధ్యమవుతాయి. చేతిరాత మెరుగవుతుంది. ఇది బాగుంటే చదువుల్లోనూ ముందుంటారు. అందుకోసం మీరేం చేయాలంటే.

●.ఒక ఆకర్షణీయమైన నోట్బుక్, లెదర్ బౌండ్ డైరీ... పిల్లలకు నచ్చింది ఏదైనా ఎంచుకోనివ్వండి. దానివల్ల డైరీ రాయడంలో కుతూహలాన్ని చూపిస్తారు.

● పిల్లలు ఏం రాస్తారనుకోవద్దు... స్కూల్ సంగతులు, ఆహారం, ఆటలు, అనుభ వాలు... ఇలా వాళ్ల దైనందిన జీవితంలోనూ ఎన్నో చోటుచేసుకుంటాయి. వాటిలో నచ్చినవి రాయమనండి. 3.డైరీ ఫార్మాట్‌లో ఉన్న 'ది డైరీ ఆఫ్ ఎ. వింపీ కిడ్' లాంటి పుస్తకాలను వాళ్లకు పరిచయం చేయండి. జాతీయ నాయకుల డైరీల గురించి చెప్పండి.

●.రాయడానికి ఏమీ లేదనిపిస్తే... పండగలూ, జాతీయ నాయకులు, క్రీడాకారులు... ఏదైనా అంశం పైన కొన్ని వాక్యాలు రాయమని చెప్పండి.

● .నోట్‌బుక్ లాంటివాటిలో రాస్తుంటే.. తేదీ, సమయం కచ్చితంగా ఉండాలి. దీనివల్ల సంఘటనల్ని వరుస ఆలోచించడం తెలుస్తుంది.

● ఈరోజు నేను ఎందరో. మిత్రులను కలుసుకున్నాను రోజంతా నాకు సంతోషంగా గడిచింది... ఇలా ఫస్ట్ పర్సన్‌లో రాయమనండి.

●. కేవలం ఆ రోజు జరిగిన సంఘటనల్నే కాకుండా. అన్ని రకాల ఆలోచనల్నీ రాసేలా నప్రోత్సహించాలి.

● రాతలో చిన్న చినప తప్పులు దొర్లడం సహజం. అంతమాత్రాన కంగారు పెట్టద్దు. క్రమంగా మెరుగుపడేలా ప్రోత్సహించాలి.

● సెలవుల్లో తమతోపాటు డైరీని తీసుకువెళ్లమని ,చెప్పండి. రొటీన్‌కి భిన్నంగారోజు గడిచినప్పుడే రాయడానిక అంశాలూ దొరుకుతాయి.

# 'ఓ టార్చర్ ప్రేమ' చిత్రం ఫస్ట్ లుక్ విడుదల



శ్రీకరం ప్రొడక్షన్స్ పతాకం పై శ్రీకర్ కృష్ణ స్వయదర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం "ఓ టార్చర్ ప్రేమ". ఈ చిత్రం లో మాదాల రంగారావు గారి మనవడు మాదాల రవి గారి అబ్బాయి సన్నీ మాదాల హీరోగా, మోనిక డాకోజు హీరోయిన్ గా పరిచయం అవుతున్నారు. అయితే ఈరోజు ఈ చిత్రం యొక్క మొదటి టైటిల్ పోస్టర్ ని ప్రముఖ రచయిత, దర్శకుడు డాక్టర్ పరచూరి గోపాల కృష్ణ గారు విడుదల చేసారు.అనంతరం పరచూరి గోపాల కృష్ణ గారు మాట్లాడుతూ "మా మాదాల రంగారావు గారి మనవడు, మాదాల రవి కుమారుడు మూడోతరం హీరో సన్నీ మాదాల హీరో గా పరిచయం అవుతున్నాడు. తాత మార్గం, తండ్రి మార్గం విప్లవం అయితే మూడోతరం హీరో సన్నీ మాదాల ప్రేమ మార్గం ని ఎన్నుకున్నాడు. "ఓ టార్చర్ ప్రేమ" అనే అద్భుతమైన ప్రేమ కథ చిత్రం తో వస్తున్నాడు. దర్శకుడు శ్రీకర్ కృష్ణ మాట్లాడుతూ "ఇది ఒక మంచి ప్రేమకథా చిత్రం. ఈ చిత్రం లో నవ్వులు చిందించే సన్నివేశాలతో పాటు ప్రేమలో ఉన్న ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. ఈ చిత్రం షూటింగ్ పూర్తి అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీ గా ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదల చేస్తాం" అని తెలిపారు.

# అడివి శేష్ ఆవిష్కరించిన 'క్యాట్' పోస్టర్



వి.ఆర్.జి.ఆర్ (VRGR) మూవీస్ బ్యానర్ పై వై. గంగాధర్ IPS సమర్పణ లో, రజని గొంగటి నిర్మాతగా నూతన దర్శకుడు G.V. నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం క్యాట్ (CAT) ఫస్ట్ కాపీ రెడీ చేసుకుని త్వరలో రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్ ని ప్రముఖ సినీ హీరో అడివి శేష్ హైదరాబాద లోని అన్నపూర్ణ స్టూడియో లో విడుదల చేశారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ.. నటీనటులకు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు తెలిపి "క్యాట్" (CAT) మూవీ ఘన విజయం సాధించాలి అని అన్నారు. డ్రామా, థ్రిల్లర్ జోనర్ లో తెరకెక్కిన ఈ చిత్రంలో బి.జు. నాయుడు, V.J. బాలు, లావణ్య, కళ్యాణి రాణి ప్రధాన పాత్రల్లో నటించారు.ఈ చిత్రానికి ఫోటోగ్రఫీ: పంకజ్ తొట్టాడ, ఎడిటింగ్: దీ.వెంకట ప్రభు, మ్యూజిక్: మారుతి రాజా, కథ, స్క్రీన్ ప్లే, మాటలు: V. CH శేఖర్ ముద్దు, దర్శకత్వం: బి.జు. నాయుడు (గొంగటి వీరాంజనేయులు).

## తెర

# 'శ్రీ చిదంబరం గారు' ఫీల్ గుడ్ మూవీ

**నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి**



శ్రీమతి. చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన 'శ్రీ చిదంబరం గారు'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమవు తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా సినిమాలోని హైలైట్స్ తెలి పారు ప్రొడ్యూసర్ చింతా గోపాలకృష్ణారెడ్డి. కొత్త వాళ్లను ఎంకరేజ్ చేయాలనే ఉద్దేశ్యంతో 'శ్రీ చిదంబరం గారు' చిత్రాన్ని నిర్మించాం. ఈ సినిమా టీమ్ నాలుగేళ్లు గా కష్టపడుతున్నారు. క్రౌడ్ ఫండెడ్ మూవీగా స్టార్ట్ చేశారు. సినిమా బాగా చేయండని సపోర్ట్ ఇస్తూ ఈ సినిమా టేకప్ చేశాం. రాజమండ్రిలో ఆఫీస్ తీసి, రెండు షెడ్యూల్స్ లో మారేడుమిల్లి ప్రాంతంలో 35 రోజులు, రాజమండ్రిలో 10 రోజులు షూటింగ్ చేశాం. 'శ్రీ చిదంబరం గారు' సినిమా టైటిల్ ఫస్ట్ చిదంబరం. గౌరవంగా ఉంటుందని శ్రీ చిదంబరం గారు అని మార్చాం. సినిమాకు డిస్ట్రిబ్యూషన్ వంశీ నందిపాటి చేస్తున్నారు. ఓటీటీ హక్కులు ఎవరికీ ఇవ్వలేదు. కొత్త వాళ్ల మూవీ కాబట్టి ఓటీటీలు ఆసక్తి చూపవు. ఇటీవల సెలబ్రిటీ షో నుంచి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా బాగుంటుందనే మేము నమ్మి చేశాం. మూవీ చూసిన వాళ్లు కూడా అదే విషయం చెబుతుంటే హ్యాపీగా ఉంది. మంచి కంటెంట్ సెలెక్ట్ చేసుకుని సినిమాలు చేస్తే ఎవరికీ నష్టం రాదు. ఒక మేనేజర్ వర్క్ చేసినట్లు నిర్మాత కూడా కష్టపడాలి

# 'ఘనంగా ఎర్ర చీర' ప్రీ రిలీజ్

బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ఎన్ వీ వీ సుబ్బారెడ్డి, సుమన్ బాబు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఎర్రచీర – ది బిగినింగ్". మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ప్రముఖ




నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించగా, దర్శకుడు సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్రను కూడా పోషించారు. సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో మూవీ టీమ్ ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచింది. ప్రసాద్ ల్యాబ్ లో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. .మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ.. ట్రైలర్ చూశాక చాలా కొత్తగా అనిపించింది. మూవీ టీమ్‌కి నా అభినందనలు. ఫిబ్రవరి 6న నేను కచ్చితంగా టికెట్ కొనుక్కుని సినిమా చూస్తా. చిన్నారి తేజస్విని యాక్టింగ్ బాగుంది. ." అన్నారు. నిర్మాతలలో ఒకరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. "మా సినిమాకు పని చేసిన నాటినటులందరికి కృతజ్ఞతలు. 300 థియేటరస్ లో మా సినిమా రిలీజ్ చేస్తున్నాం. 'అన్నారు. జయలక్ష్మి ఫిలిమ్స్ వెంకట్రావ్ మాట్లాడుతూ.. "సుమన్ గారికి మంచి భవిష్యత్ ఉంది. అన్నారు. హీరోయిన్ హీరోయిన్‌కారుణ్య చౌదరి మాట్లాడుతూ.."ట్రైలర్ చూశాక చాలా బాగా అనిపించింది. మూవీ మొత్తం నా చుట్టూనే తిరుగుతుంది. అన్నారు.

# మార్చి 26న 'ఉస్తాద్ భగత్ సింగ్'



మార్చి 26న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బాక్సాఫీస్ విస్ఫోటనంపవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్రాన్ని 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు ప్రత్యేక విందుగా నిలవడంతో పాటు, అన్ని వయసుల ప్రేక్షకులను అలరించేలా వినోదభరితంగా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. అభిమాని నుంచి దర్శకుడిగా మారిన హరీశ్ శంకర్, పవన్ కళ్యాణ్ తో రూపొందించిన గత చిత్రం"గబ్బర్ సింగ్'తో ఎంతటి సంచలనాలు సృష్టించారో తెలిసిందే. ఇప్పుడు"ఉస్తాద్ భగత్ సింగ్'తో అంతకుమించిన సంచలనాలు సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే ఆ సందడే వేరు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. మార్చి 26న అసలుసిసలైన పవర్‌స్టార్ వేడుకకు సిద్ధంగా ఉండండి.

# 'బైకర్' ఏప్రిల్ 3న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్



నారీ నారీ నడుమ మురారితో సంక్రాంతి బ్లాక్ బస్టర్‌ని అందుకున్న చార్మింగ్ స్టార్ శర్వా తన అప్ కమింగ్ మూవీ 'బైకర్' లో మోటార్‌సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ సినిమాని నిర్మించింది. ఈ సినిమా ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్ , సాంగ్ తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు .ఏప్రిల్ 3న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. అనౌన్స్మెంట్ పోస్టర్లో శర్వా బైకర్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. 1990, 2000 బ్యాక్ డ్రాప్ లో సాగే బైకర్" రేసింగ్ యాక్షన్‌తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా. స్పీడ్, అంబిషన్, హార్ట్‌ఫెల్ట్ రిలేషన్‌షిప్స్‌తో మూడు జనరేషన్స్ ఒకే రేసింగ్‌లతో, కుటుంబ బంధాలతో సాగే అద్భుతమైన కథ.

## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# స్వర్ణంతో మెరిసిన ఈషా..
### రాణాకు కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా ఛాంపియన్‌షిప్, రైఫిల్ / పిస్టల్ మహిళా విభాగంలో భారత్ షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని సాధించగా, పురుషుల విభాగంలో భారత ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ సామ్రాట్ రాణా కాంస్యం గెలుచుకున్నాడు. న్యూఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్న రైఫిల్ మరియు పిస్టల్ ఈవెంట్లలో బుధవారం మను భాకర్ మరియు సురుచి సింగ్‌లను ఓడించి ఇషా సింగ్ బంగారు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పతకాన్ని గెలుచుకుంది. 39.8 స్కోరు చేసిన ఈషా, రెండవ స్థానంలో ఉన్న చైనీస్ తైపీకి చెందిన యెన్‌చింగ్ చెంగ్‌పై ఆధిక్యాన్ని సంపాదించింది. పోటీలో ఉన్న ఇతర భారతీయులు సురుచి సింగ్ (197.7) మరియు డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్ (135.3) వరుసగా నాల్గవ మరియు ఏడవ స్థానాల్లో నిలిచారు. మహిళల అర్హతలో సైన్యమ్ 584 పాయింట్లతో పోల్ పొజిషన్‌ను కైవసం చేసుకుంది. సైన్యమ్, సురుచి (576, నాల్గవ), భాకర్ (57520, ఐదవ), ఈషా (575 18, ఆరవ) త్రయం మొత్తం 1726 పాయింట్లతో భారత్‌కు జట్టు స్వర్ణాన్ని అందించింది. పురుషుల విభాగంలో సామ్రాట్ 220.3 స్కోరుతో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన వ్లాదిమిర్ స్వెచ్నికోవ్ (242.0), కజకిస్తాన్‌కు చెందిన వాలెరీ ర ఖిమ్‌జాన్ (241.0) కంటే వెనుకబడి ఉన్నాడు. ఫైనల్‌లో మరో భారతీయుడు శర్వన్ కుమార్ 198.6తో పతకాలకు కొంచెం దూరంగా ఉన్నాడు. శర్వన్, సామ్రాట్ మరియు వరుణ్ తోమర్ సంయుక్తంగా 1732 స్కోరుతో భారత్‌కు రజత పతకాన్ని అందించారు. స్వెచ్నికోవ్, ముహమ్మద్ కమాలోవ్, ఇల్ఖోంబెక్ ఒబిజోనోవ్‌లతో కూడిన ఉజ్బెకిస్తాన్ కూడా అదే స్కోరుతో ముగించింది, కానీ ఆతిథ్య జట్టు కంటే ఆరు ఇన్నర్10లు ఎక్కువతో బంగారు పతకాన్ని గెలుచుకుంది.



ఆట

# బాక్సమ్ ఎలైట్‌లో.. భారత్ అద్భుత ఆరంభం



**న్యూఢిల్లీ:** బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్-2026లో భారత్ తన ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది. 21 దేశాల నుండి 214 మంది బాక్సర్లు పాల్గొన్న ప్రతిష్టాత్మక ఈ టోర్నమెంట్ మొదటి రోజు బుధవారం భారత్ ఆధిపత్య ప్రదర్శన చేసింది. ప్రీతి ఎలైట్ మహిళల 54 కిలోల విభాగంలో తన ప్రత్యర్థి కజకిస్తాన్‌కు చెందిన అలియాస్కర్ సింబాట్‌పై 5:0 తేడాతో విజయం సాధించింది. ఇతర భారత మహిళలు సైతం అద్భుత ప్రదర్శన చేశారు. ప్రాచి (57 కిలోలు), ప్రియ (60 కిలోలు), కాజల్ (65 కిలోలు) అందరూ స్టైలిష్‌గా ముందుకు సాగారు. ప్రాచి, ప్రియా వరుసగా స్పెయిన్‌కు చెందిన వనేసా మోరెల్ రామిరేజ్, కెనడాకు చెందిన అలెసియా మాన్సుట్టోపై 5:0 తేడాతో విజయం సాధించగా, కాజల్ పోటీలో కజకిస్తాన్‌కు చెందిన అస్సెం తనాటర్‌ను 4:1 తేడాతో ఓడించింది. ఇక పురుషుల డ్రాలో, భారత్ వరుస ఖచ్చితమైన ప్రదర్శనలతో ఒత్తిడిని ఎదుర్కొంది. సచిన్ (60 కిలోలు) స్పెయిన్‌కు చెందిన బ్రాండన్ అలెజాండ్రోపై 5:0తో ఆధిపత్యం చెలాయించగా, మహమ్మద్ హుస్సామ్ ఉద్దీన్ (60 కిలోలు) డెన్మార్క్‌కు చెందిన మాటియాస్ మెహ్మెట్ బుయుక్‌డెమిర్‌ను 4:1తో ఓడించాడు. అభినాష్ జామ్వాల్ (65 కిలోలు) డెన్మార్క్‌కు చెందిన ఖలీద్ ఉస్మాన్‌పై 5:0తో క్లీన్ విజయం సాధించాడు, దీపక్ (70 కిలోలు) బెల్జియంకు చెందిన హార్నెల్ అయితేవిపై 4:1తో ఘన విజయం సాధించాడు. ఆకాష్ (75 కిలోలు) మరియు అంకుష్ (80 కిలోలు) కూడా 4:1తో విజయాలు సాధించారు, అయితే ఇంగ్లాండ్‌కు చెందిన జో టర్నర్‌తో జరిగిన కఠినమైన పోరులో ఆదిత్య ప్రతాప్ యాదవ్ (65 కిలోలు) ఓడిపోయారు.



## మహిళల ఛాంపియన్ షిప్‌లో.. భారత్ గెలుపు
### 8-0తో భూటాన్ చిత్తు

**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్19 మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్ అఖండ విజయం సాధించింది. బుధవారం నేపాల్‌లోని పోఖారా రంగశాలలో జరిగిన మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్ 8-0 తేడాతో భూటాన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ రేసులో కొనసాగడానికి కనీసం డ్రా కావాల్సిన సమయంలో, భారత్ దూకుడుగా ప్రారంభించి, ఆరో నిమిషంలోనే అలీషా లింగ్డో ద్వారా ఆధిక్యంలోకి వెళ్ళింది. నాలుగు నిమిషాల తర్వాత అభిస్తా బాస్నెట్ గోల్ చేసి ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. పెర్ల్ ఫెర్నాండెజ్ హ్యాట్రిక్ సాధించగా, దివ్యాని లిండా మరియు ప్రీతికా బార్మాన్ కూడా గోల్స్ సాధించారు. భారతదేశం హోరాహోరీగా పరుగులు తీసింది. హాఫ్ టైమ్ సమయానికి, పోటీ సమర్థవంతంగా ముగిసింది, భారతదేశం 7-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బార్మాన్ ఒక నిమిషం తర్వాత తన రెండవ మరియు భారతదేశం యొక్క ఎనిమిదవ గోల్‌ను జోడించి ఆధిపత్య ప్రదర్శనను ముగించింది. గత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో 02 తేడాతో ఓడిపోయిన తర్వాత భారత్ తిరిగి పుంజుకోవడంతో, ఈ విజయం ప్రధాన కోచ్ పమేలా కాంటికి రెండవసారి బాధ్యతలు అప్పగించింది.

## సంతోష్ ట్రోఫీ..
# సెమీస్‌కు కేరళ
### అసోంపై 3-0తో గెలుపు

**న్యూఢిల్లీ:** సంతోష్ ట్రోఫీ-2026 క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య అస్సాంపై 3-0 తేడాతో కేరళ గెలుపొంది సెమీస్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. 17వ నిమిషంలో మనోజ్ ఎం మరియు హాఫ్ టైం ముందు ముహమ్మద్ అజ్సల్ గోల్స్ చేయడంతో కేరళ జట్టు పోటీపై పట్టు సాధించింది. రెండవ అర్ధభాగంలో అస్సాం దూకుడు ప్రదర్శించినా కేరళ రక్షణను ఛేదించలేకపోయింది. ప్రత్యామ్నాయంగా అబూబకర్ దిల్షాద్ ఇంజురీ టైమ్‌లో వడో గోల్ చేసి ఫలితాన్ని ముగించాడు. ఇక ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ పశ్చిమ బెంగాల్‌ను సర్వీసెస్ ఓడించింది. 120 నిమిషాలు గోల్ లేకుండా ముగిసిన తర్వాత, పెనాల్టీ షూటౌట్‌లో సర్వీసెస్ 3-2 తేడాతో



విజయం సాధించింది. ఇక 1-1తో డ్రాగా ముగిసిన తర్వాత, పెనాల్టీ కార్నర్ ద్వారా తమిళనాడును ఓడించి పంజాబ్ ముందుకు సాగింది. మ్యాచ్ చివరిలో ఉమాశంకర్ గోల్ చేయడంతో మ్యాచ్ సమం అయింది. షూటౌట్‌లో పంజాబ్ తమ పట్టును నిలుపుకుని 4-1తో గెలిచింది. మరోపక్క రాజస్థాన్‌పై 2-0 తేడాతో విజయం సాధించి రైల్వేస్ సెమీఫైనల్ లైనప్‌ను పూర్తి చేసింది. చివరి 15 నిమిషాల్లో సౌరభ్ భన్వాలా మరియు జాన్సన్ జోసెఫ్ మాథ్యూస్ చేసిన చివరి గోల్స్ రైల్వేస్‌ను చివరి నాలుగు స్థానాల్లోకి చేర్చాయి. దీంతో క్వార్టర్ ఫైనల్ విజయం సాధించి కేరళ, పంజాబ్, సర్వీసెస్ మరియు రైల్వేస్ జట్లు 2025-26 సంతోష్ ట్రోఫీలో సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ నాలుగు జట్లు ఫిబ్రవరి 5న జరిగే చివరినాలుగు దశల మ్యాచ్‌లలో తలపడతాయి.



# ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్
### శ్రీలంకపై 2-1 తేడాతో సిరీస్ సొంతం

**న్యూఢిల్లీ:** తక్కువ స్కోరుతో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 12 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. ఆ జట్టు సిరీస్‌ను 30తో క్లీన్ స్వీప్ చేసింది. పల్లెకెలె మైదానంలో ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్, తొలి ఓవర్‌లోనే బెన్ డకెట్‌ను వికెట్ ముందు పడగొట్టింది. జాకబ్ బెథెల్ (3), టామ్ బాంటన్ (7), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (4) కూడా మొదటి పవర్‌ప్లేలోనే తమ వికెట్లను కోల్పోయింది. జోస్ బట్లర్ 21 బంతుల్లో 25 పరుగులు చేసి, ఎనిమిదో ఓవర్‌లో మహేష్ తీక్షణ బౌలింగ్‌లో బౌలింగ్ చేశాడు. విల్ జాక్స్ నాలుగు బంతుల్లో మూడు పరుగులు మాత్రమే చేయగలిగాడు. సామ్ కుర్రాన్ 48 బంతుల్లో 58 పరుగులు చేశాడు, ఇది ఇంగ్లాండ్ 128 పరుగుల స్వల్ప స్కోరును నమోదు చేయడంలో సహాయపడింది. చివరి ఓవర్‌లో చమీర అతనిని అవుట్ చేసి ఐదు వికెట్లు పడగొట్టాడు. అతను 4-0-24-5 బౌలింగ్ గణాంకాలతో ముగించాడు. మథీష పతిరాన రెండు వికెట్లు పడగొట్టగా, తీక్షణ, దునిత్ వెల్లగే కూడా తలా ఒక వికెట్ తీశారు. అనంతరం ఛేదనలో లంక 19.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. ఈ సిరీస్‌లో శ్రీలంక జట్టు తొలి ఓవర్‌లోనే ల్యూక్ వుడ్ అవుట్ చేయడంతో కమిల్ మిషారా తొలి వికెట్‌ను కోల్పోయింది. నిషాంక (23), కుషాల్ మెండిస్ (26) కాస్తా పోరాడగా, మిగిలిన వారు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెథెల్ 4, జాక్స్ 3 వికెట్లు పడగొట్టారు. పాతుమ్ నిస్సాంక రెండో వికెట్‌కు కుశాల్ మెండిస్ (26)తో కలిసి 33 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ స్పిన్నర్లు జాకబ్ బెథెల్ మరియు విల్ జాక్స్ ఏడు వికెట్లు పంచుకోవడంతో శ్రీలంక క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూనే ఉంది. బెథెల్ బౌలింగ్ గణాంకాలు 3.3-0-11 -4తో ముగించగా, జాక్స్ తన నాలుగు ఓవర్లు ముగించి మూడు వికెట్లు తీసి 14 పరుగులు మాత్రమే ఇచ్చాడు.



# తులం బంగారం రూ.6వేలు పెరుగుదల
### కిలో వెండి రూ.14 వేలు జంప్!



**ముంబయి, ఫిబ్రవరి 4:** బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు పెరిగాయి. వెండి కిలో ధర రూ.14 వేలు పెరగగా, బంగారం రూ.1.60 లక్షలు దాటింది. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో విలువైన లోహాల ధరలు పెరుగుతున్నాయి. లాభాల స్వీకరణ సహా వివిధ కారణాలతో రెండు రోజుల క్రితం వరకు బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. నిన్న బంగారం, వెండి ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఉదయం గం.11.30 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,64,400 పలికింది. నిన్నటి రూ.1,58,500తో పోలిస్తే దాదాపు రూ.6 వేలు పెరిగింది. అలాగే ముందురోజు రూ.2,79,600 వద్ద ముగిసిన వెండి ఈరోజు రూ.14 వేలు పెరిగి రూ.2,93,900కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయి. స్పాట్ గోల్డ్ ఔన్సు 5,080 డాలర్లు, వెండి 87.95 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరగడంతో సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు ఇన్వెస్టర్లు దృష్టి సారించారు.



## రూ.2 లక్షలకోట్ల ఐటిమార్కెట్‌క్యాప్ కోత!

**ముంబయి, ఫిబ్రవరి 4:** భారత ఐటి కంపెనీల షేర్లు విలువలు సుమారు రెండులక్షలకోట్లరూపాయలవరకూ క్షీణించాయి. బుధవారం షేర్ మార్కెట్లలో కేవలం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ షేర్లకు మాత్రమే విఘాతం కలిగింది. కృత్రిమమేధ ఆటోమేషన్ టూల్ ఇపుడు ఐటి మార్కెట్లను వణికించడమే ఇందుకు కీలకం. అలాగే ఐటిసేవల రంగంపైనా ఈ ప్రభావం కనిపించింది. నిఫ్టీ ఐటి సూచీలోని పది భారీ కంపెనీలు సుమారు ఆరుశాతం దిగువన ముగిసాయి. గడచిన ఆరేళ్లలో ఇదే అత్యంత భారీ క్షీణతగా నిలుస్తోంది. అన్నింటికంటే ఇన్ఫోసిస్;టిసిఎస్‌లు భారీగా క్షీణించాయి. యూరోపియన్; అమెరికా డేటా అనలిటిక్స్ పరంగాచూస్తే వృత్తిపరమైన సేవలు, సాఫ్ట్‌వేర్ స్టాక్స్ కంపెనీలు యాక్సెంచూర్, కాగ్నిజెంట్ టెక్నాలజీ కంపెనీలు 9శాతం వరకూ మంగళవారం క్షీణించాయి. టెక్ హెవీ నాస్‌డాక్ 100 సూచీ 1.6శాతంచొప్పున ముగిసింది. భారత ఐటి సంస్థలు 60 నుంచి 70శాతం వరకూ మానవ వనరుల సేవలపైనే ఆధారపడ్డాయి. ఆటోమేషన్ ఇటీవలికాలంలో విఘాతం కలిగించింది. ఎఐ సేవలు 20-25శాతం వ్యయం తగ్గిస్తుండటంతోకంపెనీలన్నీ ఇపుడు అటువైపు మళ్లుతున్నాయి. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్‌టెక్ వంటి కంపెనీలు ఇపుడు ఎఐ, క్లౌడ్, ఆటోమేషన్ వైపు వెళుతున్నాయి. న్యాయరంగానికి కూడా ఎఐ స్టార్టప్‌లు టూల్స్ వృద్ధిచేస్తున్నాయి. ఎఐ కోడింగ్ టూల్; క్లాడ్ కోడ్ వంటివి గత ఏడాది మేనెలలోనే షురూ చేసారు. నవంబరునాటికి 100 కోట్ల డాలర్ల వ్యయనియంత్రణ జరిగే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుత మార్కెట్‌సూచీల్లో ఎల్‌అండ్‌టి 0.30శాతం, ఇన్ఫోసిస్ 7.37శాతం, టిసిఎస్ 6.99, కాఫోర్జ్ 6.02, ఎల్‌టిఐఎం 5.84, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.76, ఎంఫసిస్ 4.59శాతం, హెచ్‌సిఎల్‌టెక్ 4.58, టెక్ మహీంద్ర 4.52, విప్రో 3.79శాతం చొప్పున క్షీణించాయి. వీటన్నింటికీ కారణం కూడా ఎక్కువశాతం కృత్రిమమేథ టూల్స్ కీలకంగా ఉందని కంపెనీలు పేర్కొంటున్నాయి. వ్యయనియంత్రణ ప్రణాళికలవల్ల కంపెనీలనుంచి ఉద్యోగుల మార్పిడి పెరుగుతూ వస్తోంది.

## మూడోరోజూ లాభాల్లోనే
# ఈక్విటీ సూచీలు!
### ఐటి, ఫార్మాలు రివర్స్‌గేర్




**ముంబయి,ఫిబ్రవరి 4:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వారంలో మూడోరోజు లాభాల్లోనే ముగిసాయి. అయితే కొన్ని ఎంపికచేసిన రంగాలకు మాత్రమే ఈ లాభాలుపరిమితం కావడంతోమొత్తంగా స్వల్పలాభాలతోనే సెన్సెక్స్,నిఫ్టీలు ముగిసాయి. ఆర్థికవృద్ధి అంచనాలు, ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్‌తోపాటు త్రైమాసిక ఫలితాలుకూడా ఈ వారం మార్కెట్లను ప్రభావితంచేస్తున్నాయి. నిఫ్టీ 25,750 మార్కువద్ద సెటిల్ అయింది.ఐటి, ఫార్మారంగ షేర్లు క్షీణిస్తే వినియోగరంగ ఉత్పత్తులు, ఆయిల్ గ్యాస్, మెటల్‌షేర్లు ముందుకు కదలిలతాయి. ఎస్‌అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 78.56 పాయింట్లు లాభపడి 83.917.69 పాయింట్లవద్దట్రేడింగ్ ముగించింది. నిఫ్టీ 50 సూచీ కూడా 48.45 పాయింట్లు క్షీణించి 25,776 పాయింట్లవద్ద స్థిరపడింది. మూడు ట్రేడింగ్‌సెషన్లలో సెన్సెక్స్ 3.83శాతం, నిఫ్టీ 3.82శాతం పెరిగింది. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.61శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.54శాతం చొప్పున లాభపడ్డాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2639 కంపెనీలషేర్లు పెరిగితే 1493 కంపెనీలషేర్లు క్షీణించాయి. 173 కంపెనీలు స్థిరంగా నిలిచాయి. ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం బుధవారమే ప్రారంభం అయింది. మూడురోజులపాటు జరిగే ఈ సమావేశంలోనే మరుసటి ద్వైమాసిక ఎంపిసిని నిర్ణయించడం జరుగుతుంది,మార్కెట్లు కూడా ఈ నిర్ణయంపై ప్రభావితం అయ్యాయి. నిఫ్టీలో ఐటి సూచీ 5.87శాతం, క్షీణించింది. ఇన్ఫోసిస్ 7.37శాతం, టిసిఎస్ 6.99శాతం, కాఫోర్జ్ 6.02శాతం, ఎల్‌అండ్‌టి మైండ్‌ట్రీ 5.84శాతం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.76శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 4.62శాతం, ఎంఫసిస్ 4.59శాతం, టెక్ మహీంద్ర 4.52శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 4.06శాతం విప్రో 3.79శాతం క్షీణించాయి. టీమ్‌లీజ్ సర్వీసెస్ 3.24శాతం, బజాజ్ ఫిన్‌సెర్వ్ 0.21శాతం,రూబికాన్‌రీసెర్చ్ 6.13శాతం, బజాజ్‌ఫైనాన్స్ 0.08శాతం, కాన్సాయ్ నెరొలాక్ పెయింట్స్ 2.81శాతం, షీలా ఫోమ్ 13.93శాతం పెరిగాయి. ఎడిఎఫ్ ఫుడ్స్ 10.03శాతం, అనూప్ ఇంజినీరింగ్ 6.34శాతంపెరిగితే సెంచరీ ప్లైబోర్డులు ఐదుశాతం క్షీణించాయి. ఇమామి 2.57శాతం,రైట్స్ 0.54శాతం పెరిగినట్లు ట్రేడింగ్ డేటా చెపుతోంది.



వాణిజ్యం

## టెక్‌దిగ్గజం గూగుల్ బెంగళూరులో భారీ క్యాంపస్

**బెంగళూరు, ఫిబ్రవరి 4:** టెక్ దిగ్గజం గూగుల్ బెంగళూరులో భారీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. హెచ్1బీ వీసాల జారీకి అమెరికా కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. దీంతో విదేశీ ఉద్యోగుల నియామకం టెక్ కంపెనీలకు భారంగా మారడంతో గూగుల్ సంస్కరణ చర్యలు చేపట్టింది. వీసాలు, ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేకుండా, భారత్‌లో కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. దేశంలోనే అతిపెద్ద టెక్ హబ్ అయిన బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో గూగుల్ లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కొత్త కార్యాలయాన్ని నిర్మించేందుకు సిద్ధమైంది. 20 వేల మంది ఉద్యోగుల కోసం ఈ క్యాంపస్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఓ ఆఫీస్ టవర్‌ను గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ లీజుకు తీసుకుందని, మరో రెండు టవర్ల కోసం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మూడు టవర్లు 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తోంది. తొలి టవర్ లీజును అల్ఫాబెట్ కూడా ధృవీకరించింది. మొదటి టవర్ కొన్ని నెలల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, మిగిలిన రెండు టవర్ల నిర్మాణం వచ్చే సంవత్సరం పూర్తవుతుందని పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో గూగుల్‌కు 14 వేల మంది ఉద్యోగులు ఉండగా, వైట్ ఫీల్డ్ క్యాంపస్ పూర్తిగా మొదలైతే అమెరికా వెలుపల గూగుల్ కార్యకలాపాలకు భారత్ కీలక కేంద్రంగా మారనుంది. ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసా ఫీజులను పెంచిన విషయం తెలిసిందే. ఒక్కో దరఖాస్తుకు 1,00,000 డాలర్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. దీనితో అనేక టెక్ కంపెనీలు అమెరికా వెలుపల తమ కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా భారత్ లాంటి దేశాల్లో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలు విస్తరించడానికి ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం కారణమైంది.

## ఎన్ఎస్ఇ ఐపిఒకు డెల్లాయిట్ పర్యవేక్షణ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** నేషనల్ స్టాక్ ఎక్చేంజి దీర్ఘకాలికంగా వేచిచూస్తున్న ఐపిఒకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎన్ఎస్ఇ బోర్డు వచ్చే శుక్రవారం సమావేశం అవుతోంది. పబ్లిక్ ఇష్యూ పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేస్తోంది. ఈ ప్యానెల్‌లో ఛైర్మన్ శ్రీనివాస్ ఇంజేటి, ఎండి సిఇఒ ఆశిశ్‌కుమార్‌చౌహాన్ ఇతర నామినీలు కూడా ఉంటారని తెలుస్తోంది. బహుళజాతి సంస్థ డెల్లాయిట్ మొత్తం ఐపిఒ ప్రక్రియను మానిటర్‌చేస్తోంది. గత వారంలోనే ఎన్ఎస్ఇ సెబీనుంచి ఐపిఒకు అనుమతులు పొందింది. 2016లో దాఖలుచేసిన తర్వాత సుమారు పదేళ్లకు మళ్లీ అనుమతులు వచ్చాయి. కార్పొరేట్ సుపరిపాలన లోపాలు, సహేతుకం కానీ మార్కెట్ లావాదేవీల ప్రక్రియ వంటివి సెబి తిరస్కరణకు మూలం అయింది. ప్రస్తుతవాటాదారులు ఆఫర్‌ఫర్‌సేల్‌ప్రక్రియాలో 4నుంచి ఐదుశాతం వాటాను విక్రయిస్తారు. కంపెనీ లెక్కల ప్రకారం 1.90 లక్షలమంది వాటా దారులున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వరంగసంస్థలు 31.29శాతం వాటాలున్నాయి. జీవితబీమా సంస్థ ఒక్కటే 10.72శాతం అత్యధిక వాటాతో ఉంది. ప్రభుత్వరంగ బ్యాంకులు సమిష్టిగా 4.56శాతం వాటాలు కలిగి ఉన్నాయి. పిఎస్‌యులపరంగా మొత్తం 14సంస్థలున్నాయి. ఎన్ఎస్ఇ డిఆర్‌హెచ్‌పిని 3-4 నెలల్లో దాఖలుచేయడం, లిస్టింగ్‌కూడా వచ్చే 8-9 నెలల్లో చేయవచ్చని ఎన్ఎస్ఇ వర్గాలు చెపుతున్నాయి.

## 58.5 పాయింట్లకు చేరిన సేవలరంగ పిఎంఐ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** సేవలరంగ పిఎంఐ జనవరిలో 58.5 పాయిట్లకు పెరిగింది.గత ఏడాది డిసెంబరులో 58 పాయింట్లు మాత్రమే ఉన్న సేవలరంగ పిఎంఐ సూచీ హెచ్ఎస్‌బిసి సర్వీసెస్ పిఎంఐ ప్రకారం 58.5పాయింట్లకు పెరిగినట్లు వెల్లడి అయింది. డిమాండ్; కొత్త బిజినెస్‌ల లాభాలు, టెక్ ఇన్వెస్ట్‌మెంట్లుపెరగడం వంటివాటితో సేవలరంగంలో వృద్ధినమోదయింది. 50 దాటితే వృద్ధిలోను 50కి లోపు క్షీణతగానే సేవలరంగ దిక్సూచిని పరిగణిస్తారు. హెచ్ఎస్‌బిసి ఇండియా చీఫ్ ఎకానమిస్ట్ ప్రాంజుల్ భండారి మాట్లాడుతూ జనవరిలో 58.5 పాయింట్లకు పెరిగిందని స్పష్టంచేసారు. కొత్త ఆర్డర్లు వెల్లువలా రావడం, దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలనుంచి డిమాండ్ పెరగడం కూడా ఇందుకు దోహదంచేసింది. సేవలరంగంలో సర్వీసెస్, ఫైనాన్స్, బీమా రంగాల్లో పటిష్టమైన వృద్ధి కనిపించింది. దేశీయ మార్కెట్, ఎగుమతి ఆర్డర్లు కూడా ఆరోగ్యకరమైన దిశగానే వెళుతున్నట్లు హెచ్ఎస్‌బిసి తెలిపింది. కంపెనీలు కొత్త బిజినెస్‌లు కూడా ప్రకటించాయి. ఇండోనేసియా, కెన్యా, మలేసియా, ఒమన్; ఖతార్; శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం వంటి దేశాలు కొత్త బిజినెస్‌లు ప్రారంభించాయి. ఎగుమతుల్లో వృద్ధి కూడా ఈ మూడునెలల్లో మరింత పటిష్టంగా ఉంది. అలాగే హెచ్ఎస్‌బిసి ఇండియా కాంపోజిట్ పిఎంఐ ఉత్పత్తిసూచీ కూడా జనవిలో 58.4 పాయింట్లకు పెరిగింది. డిసెంబరులో 57.8 పాయింట్లుగా ఉన్న సూచీ జనవరిలో పెరిగింది. ఉత్పత్తిరంగం, సేవలరంగం రెండూ కూడా పటిష్టమైన వృద్ధితో ఉన్నట్లు తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.